# దర్పదళనము

మద్రాసు, 1927

Record no. 718

# Darpadaḷanamu

## Madrāsu, 1927

Record no. 718

దర్పదళనము / ఇది గొల్లపూడి శ్రీరామశాస్త్రిగారిచే ఆంధ్రీకృతము.- మద్రాసు : ఆర్యభారతీముద్రాక్షరశాల, 1927.

(2), 119 p. ;18 cm.

Record no. 718

Darpadaḷanamu / idi Gollapūḍi Śrīrāmaśāstrigāricē Āṃdhrīkṛtamu.- Madrāsu : Āryabhāratīmudrākṣaraśāla, 1927.

(2), 119 p. ;18 cm.

Record no. 718

# DARPA-DALANAMU.

**AUTHOR**

GOLLAPUDI SRIRAMA SASTRI GARU.

# ప్రకటన

## శ్రీయుత గొల్లపూడి, శ్రీరామశాస్త్రిగారి గ్రంథములు.

### ఆంధ్రనాటకరంగము—

ఇది 1929 సం, బి. ఏ. పరీక్షకు పఠనీయ గ్రంథము.

**చతుర్విధాభినయములును, వానికి సంబంధించిన పాత్రోచితభావ, సంగీతము, లోనగు పెక్కు విషయము లీగ్రంథమునఁ జర్చింపఁబడినవి. ఆంధ్రదేశమునందలి పండితశ్రేష్ఠుల యాదరణమునకుఁ బాత్రమై దేశమందంతట వ్యాపించిన యపూర్వగ్రంథము.** వెల 1—4—0

### అహోబలమాహాత్మ్యము—

ఇయ్యది కవిత్రయమువారిలో నొకరగు ఎఱ్ఱాప్రెగ్గడ నృసింహపురాణమునకు వచనము. అత్యద్భుత కల్పనలతోనుండు శంభుదాసుని కవితామృతము నాంధ్రలోకమున కనాయాసముగ నందఁజేయుటయే యీగ్రంథోద్దేశము. వెల 0—12—0

### గురుసేవ—

ఇది తేటగీతములతో వ్రాయఁబడి వేదాంతమతమును జిజ్ఞాసువులకు సులభముగ బోధించు గ్రంథరాజము. ఇందు ముఖ్యముగ గురుసేవాఫలము పెక్కు దృష్టాంతములతో వివరింపఁబడినది. (నటిప్పణము.)

వెల 0—9—0

### సత్కథామంజరి—

వివిధపురాణేతిహాసములనుండి సంగ్రహింపబడిన యపూర్వగాథలతోఁగూడి, అందఱును జదువుటకర్హమైన వచనశైలితో నొప్పుచు, ఆద్యంతములయందు భావగర్భితములైన చక్కని పద్యములతో విరాజిల్లు మనోహరమగు గ్రంథము. వెల 0—10—0.



# దర్పదళనము.

ఆంధ్రనాటకరంగ, నాటకజిజ్ఞాస, కావ్యమీమాంసాది కృతికర్తలును, చిత్తూరు హైస్కూల్ ప్రధానాంధ్రోపాధ్యాయులును నగు

## గొల్లపూడి, శ్రీరామశాస్త్రిగారిచే,

ఆంధ్రీకృతము.

ఆర్యభారతీముద్రాక్షరశాల
మద్రాసు.
1927.

 [వెల 0—10—0

# విజ్ఞప్తి.

నేటివఱకు వెలువడిన యాంధ్రగ్రంథములు పెక్కులు సంస్కృతగ్రంథముల యాంధ్రీకరణములు, ననుకరణములు నైన నింకను దెనుఁగుచేయవలసిన సంస్కృతగ్రంథము లనేకము గలవు. వానిలో క్షేమేంద్రుని కృతులు ముఖ్యము లైనవి.

### క్షేమేంద్రునికాలము.

శ్రీ కాళిదాస భవభూత్యాది మహాకవులకుఁ దరువాతఁ బ్రసిద్ధిఁ గాంచినకవులలో క్షేమేంద్రుఁ డొకఁడు. ఏతత్కృతము లగు "సువృత్తతిలకము, ఔచిత్యవిచారచర్చ" అను గ్రంథముల కడపటి పద్యములఁబట్టి యీకవి శ్రేష్ఠుఁడు కాశ్మీరదేశాధీశ్వరుఁ డగు ననంతభూపాలుని యాస్థానమందలి విద్వత్కవి యని తెల్లమగుచున్నది.

శ్లో. క్షేమేంద్రేణ ప్రణయి విపదాం హర్తు రాశ్చర్య కర్తుః,
భూభృద్భర్తు ర్భువనజయినో ఽనన్తరాజస్యరాజ్యే.

(సువృత్తతిలకము.)

శ్లో. ఆశాశ్శీతలతాం నయ త్యవిరతం యస్య ప్రతాపానల,
స్తస్య శ్రీమదనంతరాజనృపతేః కాలేకిలాయంకృతః,

(ఔచిత్యవిచారచర్చ)

ఈ యనంతభూపతి విదర్భదేశాధీశ్వరుఁ డగుభోజరాజునకు సమకాలికుఁడు బంధువు నైనట్లు కాశ్మీరరాజచరిత్ర మగురాజతరంగిణివలన విదిత మయ్యెడి.

శ్లో. సచ భోజనరేంద్రశ్చ దానోత్కర్షేణ విశ్రుతౌ,
సూరీ తస్మిన్ క్షణే తుల్యం ద్వావాస్తాం కవిబాంధవౌ.

భోజరాజు క్రీ. శ. 996-1051 నడుమ నున్నవాఁ డని కొన్ని శాసనములఁ బట్టి యేర్పడుచున్నది. 'స్మిత్' మహాశయుఁడు ఇరువురు భోజులఁ బేర్కొనుచు, ఘూర్జరాధిపతి యగుభోజుఁడు 840–890 లో నున్నవాఁ డనియు, మాళవాధిపతి యగుభోజుఁడు 1018–1060 లో నున్నవాఁ డనియు నుడువుచు నీ భోజుఁడు విద్వాంసుఁడును విద్యాపోషకుఁడునై యుండె నని చెప్పియున్నాఁడు. మఱియు, ఆనందభూపాలుఁ డనునతఁడు ఘూర్జరప్రభు వగుభోజుని సంతతిలోనివాఁ డని మాత్రము వ్రాక్రుచ్చి యున్నాఁడు. "రాజతరంగిణి" ననుసరించి మనకవీంద్రుని యాశ్రయుఁ డగుఅనంతభూపాలుఁడు 1020–1080 లో నున్నవాఁ డని తెల్ల మగుచున్నది. సంస్కృతవాఙ్మయచరిత్రకారుఁ డగు 'మేగ్డనల్' మహాశయుఁడు కథాసరిత్సాగర బృహత్కథామంజరులఁ గూర్చి ముచ్చటించుచు నేతద్గ్రంథకర్తలగు సోమదేవ క్షేమేంద్రులు



సమకాలికు లని నుడివి, క్షేమేంద్రుఁడు బృహత్కథామంజరిని 1037 ప్రాంతమున రచించె నని తెలిపియున్నాఁడు. కావున సర్వవిధముల క్షేమేంద్రకవి నేటి కెనిమిదివందలవత్సరములకుఁ బూర్వ మున్నవాఁ డనుట నిశ్చయము.

వంశాదులు.

క్షేమేంద్రుఁడు త్యాగభోగపరాయణుఁ డై బ్రహ్మవేత్త యగుప్రకాశేంద్రపండితుని పుత్త్రుఁడు. సర్వమనీషి బిరుదాంకితుఁ డైనగంగకోపాధ్యాయుని శిష్యుఁడు. వ్యాసదాస బిరుదాంకితుఁడు; బ్రాహ్మణుఁడు, అందును శివభక్తుఁడు. ఈ యంశములు తత్కృతులలోని యాద్యంత పద్యములఁ బట్టి తెలియుచున్నవి.

శ్లో. ఆసీత్ప్రకాశేంద్ర ఇతిప్రకాశః కాశ్మీరదేశే త్రిదశేశ్వరశ్రీః,
అభూత్ గృహేయస్య పవిత్రసత్ర మచ్ఛిన్నమగ్రాసనమగ్రజానాం,
తస్యాత్మజః సర్వమనీషిశిష్యః శ్రీవ్యాసదాసాపర పుణ్యనామా,
క్షేమేంద్రఇత్యక్షయకావ్యకీర్తి శ్చక్రే నవౌచిత్య విచారచర్చాం.
(ఔచిత్యవిచారచర్చ)

ఈ కవీశ్వరుఁడు పరమతద్వేషము లేనివాఁడును, కేవలగుణగ్రహణపారీణుఁడు ననుటకు ఈదర్పదలనమె తార్కాణము.

ధనవిచారములో నుదాహరింపఁబడిన నందోపాఖ్యానము జైనవాఙ్మయములోని దని విదితమయ్యెడిని,

శ్లో. శ్రావస్త్యాం సార్థవాహోఽభూదర్థనాథ ఇవాపరః,
నందోనామ నిరానందః కీర్తనే నార్థినామపి.

ఈ శ్రావస్తి, బౌద్ధయుగమునాటిది. బుద్ధుని సమకాలికుఁడగు ప్రసేనజిత్తుఁ డీపట్టణమును బాలించెను. ఆకాలమున నిది ప్రసిద్ధనగరములలో నొకటి. ఈనగరము క్రమముగ పదునొకండవశతాబ్దినాటికి క్షీణదశకు వచ్చినట్లు తెలియుచున్నది. ఈవిచారమునందె వ్యాధిగ్రస్తుఁ డగు చండాలబాలునినోదార్ప జినేంద్రుఁడు సాక్షాత్కరించినట్లు చెప్పఁబడియున్నది. ఆసందర్భమందలి వర్ణనము నరయుఁడు.

శ్లో. భవభ్రమాసక్త పరిశ్రమాణాంరాగాదిదోషైరుపతాపితానాం
ఆశ్వాసనేనాఽమృతసోదరేణ లింపన్నివద్యాం ద్యుతిచందనేన
దృష్ట్వాత మాపద్గత ముగ్రరోగభగ్నంనిమగ్నం వ్యసనే విఘ్నం
వ్యాలంబతార్ద్రః కరుణారసేనతత్తాపశాంత్యైభగవాన్ జినేంద్రః.

గుణగ్రాహ్యైకపారీణుఁ డనుటకు ఈగ్రంథమందలి మొదటి పరిచ్ఛేద మగు కులవిచారమె దృష్టాంతము. "గుణాఃపూజాస్థానం గుణిషు నచలింగం నచవయః" అనిచెప్పిన భవభూతి మహాకవికంటెను నితఁడు విశాలహృదయుఁ డని చెప్ప నగును.





వైదుష్యము.

ఈకవీంద్రుఁడు తర్క వ్యాకరణ మీమాంసాది శాస్త్రపారీణుఁడు. సాహిత్య చక్రవర్తి. ప్రతిభావిశారదుఁడు. ఆపాతమధురమై భావగర్భిత మగుశైలిని నీతిజ్ఞానవైరాగ్య బోధకము లైన వివిధవిషయములఁ గావ్యబద్ధములుగ నొనర్చియున్నాఁడు. ఈమహాకవి దాదాపు ముప్పదిరెండు గ్రంథముల రచించియున్నట్లు తెలియుచున్నది. రామాయణమంజరి, భారతమంజరి, బృహత్కథామంజరి, కలావిలాసము, సమయమాతృక, కవికంఠాభరణము, సువృత్తతిలకము, దర్పదళనము, సేవ్యసేవకోపదేశము, చారుచర్య, దశావతారచరితము, దేశోపదేశము, నీతికల్పతరువు, పద్యకాదంబరి, శశివంశమహాకావ్యము, చిత్రభారతనాటకము, రాజావళి, మునిమతమీమాంస, వినయవల్లి, మొదలగు నవి. ఇందు మునిమతమీమాంసాదు లగుకొన్ని గ్రంథములు నామమాత్రావశిష్టములై తత్కృతములగు నౌచిత్యవిచారచర్చాదికృతుల నుదాహరింపఁబడిన శ్లోకములఁ బట్టి యవగతము లగుచున్నయవి.

దర్పదళనము.

ఇది యొక సాంఘిక గ్రంథము. ఇందలియంశము లొక పక్షమునకుఁగాని యొక జాతికిఁగాని చేరక యెల్ల

కాలము సమన్వయించునవి యై యున్నవి. నీతికిని ప్రాపంచిక జ్ఞానమునకు నీగ్రంథ మొక గని యని చెప్పవచ్చును. దీనికి "నీతిపదవి" యనియు నామాంతరము గలదు. కుల విత్త విద్యా రూప శౌర్య దాన తపో విచారము లను నేడు పరిచ్ఛేదములతోఁ గూడి, యుక్తియుక్తముగను ఉదాహరణ పూర్వకంబుగను జర్చింపఁబడిన వివిధాంశములతోఁ నొప్పుచున్నది. ముఖ్యముగ నీగ్రంథము కులవిత్తవిద్యాదులయెడ గర్వము తగదనియు, దర్పమెల్లవిధముల వినాశకరమనియు, అట్టిది లేకయుండుట క్షేమంకర మనియు, అను నంశముల ననేక దృష్టాంతములతో బోధించును. ఇందలి యుపాఖ్యానము లన్నియుఁ దఱుచుగ మహాభారతము నుండియే గైకొనఁబడి నవయ్యు విషయానుగుణ్యముగఁ బెక్కుమార్పుల నొంది యున్నవి.

ఆంధ్రీకరణము.

అపూర్వకల్పనలతోఁ గూడి ప్రౌఢతమములైన ప్రయోగములతో నొప్పారు నీకవిశేఖరుని గ్రంథములఁ దెనుఁగు చేయుట కొంతవఱకుఁ గష్టదాయకము గాక పోదు. ఈదర్పదళనము పెక్కు వ్రాతప్రతుల సాహాయ్యమునఁ గావ్యమాలాసంపాదకులు ప్రకటించి యుండు





టచేతఁ గా నొప్పు కొన్ని భాగములలో పూర్వాపరవిరోధము, పునరుక్తిలోనగునవి యుండుటయుఁ దటస్థించినది. ఆయాభాగముల నట్లే తెలిగించి ప్రకటించుటవలని యుపయోగ మేమియు నుండ దను తలంపుతో మూలావిరుద్ధముగ నట్టివాని నర్హావిధమున మార్చుటకు సాహసించితిని. అందు విశేషముగ మార్పుఁ జెందినది ప్రథమపరిచ్ఛేద మగునొక్క కులవిచారము మాత్రమే. ఇందు నేనొనర్చిన సంస్కరణ మెంతవఱకు సమంజసమను నంశము బోధపడుటకై యీపరిచ్ఛేదమును గూర్చి యించుక ముచ్చటింపఁ దలఁచితి.

విషయవిపర్యాసము.

ఈ కులవిచారమందలి యితిహాసమునకు మాతృక భారతమందలి యానుశాసనిక పర్వములోని, 'ఇంద్రమతంగ సంవాద' మను నుపాఖ్యానము. ఈయుపాఖ్యానములోనిసారాంశమునకును క్షేమేంద్ర ప్రతిపాదిత విషయమునకును మిక్కిలి విరోధము గలదు.

'విమలకర్మగుణయోగమున నవుల జాతులు మాటన్
జనియించినవానికి బ్రాహ్మణ్యము దొరకొనదో?'

అని ధర్మజుఁడు ప్రశ్నింప నింద్రమతంగ సంవాదమును దృష్టాంతముగఁ జెప్పి భీష్ముఁడు 'బ్రాహ్మణ్యము పెర జనులకుఁ బొంద నశక్య' మని నుడువును.

"గుణములు గలవాని కులమెంచగానేల, గుణము గలిగెనేని కోటిసేయు" నని చెప్పిన వేమనయోగివలె

శ్లో. గుణప్రభావే విచ్ఛిన్నే సమాప్తం సకలంకులం,
గుణాధీనంకులం జ్ఞాత్వా గుణేష్వాధీయతాం మతిః.

అని నుడివిన మన కవిశేఖరుఁడును దన భావమునకు విరుద్ధముగ నుండు భారతములోని యితిహాసమును గైకొని పెక్కువిధములుగమార్చి, తదనుగుణముగఁ బాండవులు, కర్ణుఁడు మొదలగువారి జననమునుగూర్చి యుదాహరించుచుఁ దుదకు "కులముకన్న గుణమె ప్రధాన" మని నిరూపింపఁదలఁచెను. కనుక ఈభావము ననుసరించియే విషయప్రతిపాదన మావశ్యకముగదా! ప్రకరణమధ్యములో,

దయాదరిద్రం హృదయం వచః క్రకచకర్కశం,
యోనిసంకరజాతీనాం ఏతత్ప్రిత్యక్షలక్షణం.

ఇట్టి శ్లోకములు కొన్నిగలవు. ఇయ్యవి యాతని భావసౌధమున కశనిపాతము లనఁదగియున్నవి.

మఱియు భారతములో 'క్షత్రియాదులచేతనుం బట్టుపడని బ్రాహ్మణ్యశార్దూలంబుతోడి మేలంబు దక్కుము. నీకు నొక్కవరం బిచ్చెదం గైకొమ్ము.' అని యితిహాసాంతమందలి యింద్రుని వచనము. దర్పదళనములో నుపాఖ్యానము కడపట నుండు శ్లోక మిది.





శ్లో. బ్రాహ్మణ్యబద్ధాశః చచార సుచిరం తపః.
సహస్రాక్షవరాత్ప్రాప దేవత్వం నతు విప్రతాం.

పై విషయమును బట్టి కవీంద్రుని యుపక్రమోపసంహారము లనుగుణముగ లేవని కనుగొనవచ్చును.

మఱియు భారతములో మతంగుఁడు తన జననదోషమును గర్దభివలన విని నట్లు వర్ణింపఁబడి యుండ, మన కవి 'తేజోనిధి' తనజన్మదోషమును తల్లివలననే స్పష్టముగ వినినట్లు వర్ణించియున్నాఁడు. ఇం దేది యుచితమో చదువరులే గ్రహించెదరు గాక. నేనిపట్టున కవీంద్రుని ప్రధానాశయమును గైకొని యనౌచిత్యమున కవకాశము లేకుండునట్లు కొన్నిమార్పులఁ జేయ సాహసించితిని. మఱియు, ఒక్కొక్కపరిచ్ఛేదమును జదువఁబోవునపుడె యందలి విషయము పాఠకున కవగతమగుటకై ప్రకరణాదిని భావబోధకములైన ప్రాచీన పద్యములఁ బొందుపఱచితి. ఈనారచనమందలి గుణదోషముల నిర్ణయింపఁ బాఠకమహాశయులె యర్హులు. చెప్పఁదగిన యంశములు పెక్కులున్నను విస్తరభీతిచే విరమించితిని.

అపూర్వములగు నంశములతోఁ గూడి వివిధకల్పనలతో నొప్పారు నీగ్రంథము నెంతసులభముగఁ దెనిఁగించినను సామాన్యపాఠకుల కంతగఁ బ్రయోజనకారి కానేర

దనియు, ఇట్టి గ్రంథమును విద్యాశాలలోఁ బ్రధాన పాఠ్యముగ నుపయోగించుటవలని లాభ మపారమనియుఁ దలంచి తదనురూపముగఁ గొంతవఱకు భాషాజ్ఞాన దాయకం బగుశైలిని యీగ్రంథమును రచించితిని.

కవితాసామ్రాజ్యపట్టభద్రుఁ డగుమహాకవి క్షేమేంద్రుని ప్రతిభాసాగరము నుండి వెలువడిన యొక తరంగమునకుఁ బ్రతిబింబమైన యీగ్రంథమును,గుణగ్రహణపారీణు లగు పాఠకమహాశయులును, భాషాభివృద్ధినిఁ గాంక్షించు విద్యాధికారులును మిక్కిలి యాదరింతురను నావిశ్వాసమునకు దయామయుఁ డగురామచంద్రమూర్తి తోడ్పడుఁగాక.

చిత్తూరు.
20-2-27

ఇట్లు,
సుజన పండిత విధేయుఁడు,
గొల్లపూడి శ్రీరామశాస్త్రి.

---

## శుద్ధపత్త్రము.

| పుట. | పంక్తి | తప్పు | ఒప్పు | పుట. | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|---|---|---|---|
| 12 | 2 | ♦కర్ణుఁడు | ‡కర్ణుఁడు | 48 | 12 | ఫలమిమే | ఫలమేమి? |
| 13 | 17 | మొసంగ | మొసంగఁగల | 55 | 9 | నకుంబలు | నకుంబలె |
| ,, | 11 | డై మొనర్చి | డై లాఘవ | 61 | 13 | శంకిఁచి | శంకించి |
| 14 | 10 | చదుపు | చదువు | ,, | 18 | మన్నకడ | యన్నకడ |
| 20 | 16 | రించుఁజెట్ట | రించుచెట్ట | 67 | 20 | మత్యో నేని | మయ్యో నేని |
| 22 | 4 | పశ్చాత్తపు | పశ్చాత్తప్తు | 68 | 15 | చి త్రరుపు | చిత్తగువు |
| 27 | 11 | నుగుఁగూడు | మసకూడు | 69 | 5 | గమునం | గములం |
| 33 | 19 | యగుఁబ్రేయ | యగుప్రేయ | 72 | 15 | మారాజు | యారాజు |
| 37 | 8 | లగుఁదొలి | లగుతొలి | 96 | 10 | నిన్సారము | నిస్సారము |
| 44 | 3 | పడివాడ | పిడివాద | 98 | 9 | గడిపలక | గడ్డిపలక |

# విషయసూచిక.

---



---

# గ్రంథారంభోద్దేశము.

---

ఉ. ఏయది దర్ప సర్పముల
  నీగుటచే దళితాంతరాయమై
స్వీయరుచిం దనర్చు ; ఘన
  శేవధి యెయ్యది సత్యముక్తికిన్ ;
ఏయది ఘోరసంవరణ
  హేతి నడంచు శమామృతంబుచేఁ
బాయక యావివేకమును
  భక్తిమెయిం బ్రణుతింతు నిచ్చలున్.

---

చ. అరయగ వంశముఁ ధనచ
  యంబును విద్యయు రూపశౌర్యముల్
సిరివిడిదానముం దపము
  పెంపును నాఁ జను నేడు ధారుణిన్
నరులకు దర్పరోగ జన
  నంబులు గావున నట్టిరుగ్ణతన్
గరము మృదూక్తిభేషజ ము
  ంబున రూపఱఁ జేయఁ బూనెదన్.

# దర్పదళనము.

## కులవిచారము — ప్రథమపరిచ్ఛేదము.

—(—)—

### కులవిచారము.

ఆ. గుణములు గలవాని • కుల మెంచఁగా నేల?
గుణము కలిగెనేని • కోటిసేయు,
గుణము లేకయున్న • గ్రుడ్డిగవ్వయు లేదు.

(వేమన.)

వివేక మింతైనలేక 'కులముకుల' మని విఱ్ఱవీఁగువారి కీగరువపుఁబిశాచి యెచ్చటనుండి దాపరించినదో కదా! పుట్టుపూర్వోత్తరంబులఁ దడవఁబోయితిమేని నొక్కొక్క కులమూలము పద్మమూలంబుపగిది దోసపుటడుసుతోఁ గూడినదిగనే కానఁబడుట నిక్కువము. మంచితత్తడికింబలె మంచినడవడిక కలవానికిని కులముపట్టుదల యక్కఱ మాలినపని. సాధు వైనతండ్రికిఁ గొఱమాలినకొడుకు పుట్టుటయుఁ దఱుచుగఁ గలదు. ఒక్కవంశముననె తాత పలువిద్దెలఁజదివి, పెక్కుజన్నముల నొనర్చి తద్దయుఁబేరు మోసియుండ, మనుమఁడు పండితపుత్త్రుఁడై కల్లునంగడుల గుత్తకుఁదీయుచు లోకమున నేవపుమనుగడంగడపుచుండు





టలేదా? అట్లైన నాకులపుమరియాద యేరినిబట్టి యుండవలయునో యోజింపుఁడు. తద్దయుం దలపోసితిమేని గొనములగొనబునం జేసియ కులముగొప్పతనము నొప్పెసలారు నని తెల్లమయ్యెడి. ఎన్నఁడు గుణగౌరవంబు గడతేఱు; ఆనాఁడె కులముబెట్టును మట్టుపడిన దని యెన్నఁదగును. గొడ్డుపసరము పాడియావునకుఁ బుట్టియు గౌరవంబునకు దూరమగునట్లు మంచికులమునఁ బుట్టియు నప్రయోజకుఁడు పొగడికకు దవ్వులవాఁడె యగు. ఎటుచూచినం గులముపస గొనములవస మనుట యెఱుకపడుటచేఁ గులమద ముజ్జగించి, నడవడిఁ జక్కపఱచుకొనుట యెల్లరకు నేమంపుఁదెరువయి తనర్చు.

మఱియు సంతాన మింతులమూలమునఁ గలుగుచుండునంతవఱకుఁ బురుషులకుఁ గులమ్మనునది 'కుందేటికొమ్మ'నుట బాగు. ఏవంశమునన్నైన నొకపడంతుక యించుక త్రోవఁదప్పి చరియించియుండిన నద్దోసము కులమునకంతకు మచ్చందెచ్చు. ఇంతయేల? రఘురాజులు * రెంటఁజెడిన త్రిశంకువంశపువారు. గురుతల్పగమనునకుఁ

* త్రిశంకు మహారాజు సశరీరస్వర్గమును బడయఁగోరి వసిష్ఠునిఁ బ్రార్థింప నతఁడది యశక్యమని నిరాకరించె. ఆవలనారాజు వసిష్ఠుని పుత్త్రులకడకుఁబోయి మునిని దూషించుచు దనకోర్కి నెఱవేర్పుఁడని

గూరిమికుమరుఁడు బుధుఁడు. ఇతండె * చంద్రవంశపువారికి మూలపురుషుఁడు. •కర్ణుఁడు కానీనుఁడు. ‡పాండుసుతు

వారిని వేడుకొనెను. వాసిష్ఠులు జనకదూషణ మొనర్చిన యారాజును చండాలత్వ మొందుమని శపించిరి.

(రామాయణము - బాల - 57 సర్గము.)

* అత్రిముని యశ్రుకణములనుండి సోముఁడను వాఁడుద్భవించె. అతఁడు తపోమహిమంబున సర్వలోకముల నేలుసామర్థ్యము గలిగి యుండ నతని వైభవంబునుగాంచి బృహస్పతిభార్యయగు తార యాతనిఁ జేరెను. ఇదికారణముగ దేవాసురులకు యుద్ధముతటస్థింప బ్రహ్మ తారను మగల బృహస్పతి కిప్పించె. తారాసోములకు జనించినవాఁడే బుధుఁడు.

(హరివంశము - పూ - భా - 3 అ.)

• శాపోపహతుఁడగు పాండురాజునానతిమెయికుంతీదేవి తనకు దుర్వాసోముని యుపదేశించిన మంత్రప్రభావమువలన, యమ, వాయు ఇంద్రుల నారాధించి వారివలన ధర్మభీమార్జునులఁబడసె. మాద్రియుఁ కుంతివలన నామంత్రమును బడసి పతినియోగమున నాశ్వినులనారాధించి నకులసహదేవులను బొందెను.

(భారతము - ఆది - 5 అ.)

‡ బాల్యమున కుంతీదేవి దుర్వాసోమునియుపదేశించిన మంత్రప్రభావమును దెలియఁగోరి సూర్యునారాధించెను, ఆదేవుఁడు సాక్షాత్కరించి నీయభీష్టమేమని యడుగ నామెయత్తఱిఁ దప్పించుకొననవకాశము లేక నీయట్టిపుత్త్రుని నొసఁగుమనియె. అతఁడిచ్చితినని చెప్పి కన్యాత్వ భంగము లేకుండ ననుగ్రహించి యంతర్ధాన మొందె. ఆవలనామె యితరులకుఁ దెలియకుండ బిడ్డనుగని లోకాపవాదభయమున నదిలోఁ బారవైచె. అతఁడే కర్ణుఁడు. (భార - ఆదిపర్వము.)





లకుఁ దండ్రులు పలువురు. పేరు మ్రోగిన కులముల గుట్టుఁ బరికింప నిట్టులున్నది. ఇఁక నూరుపేరు లేనికులములఁ దడవంబూని యాయాస మొందనేల ?

తొల్లి ప్రాఁబల్కులఁ దుదిముట్టఁ జదివి, కర్మఠుఁడైన శ్రుతనిధి యనుపేరు గలయొకవిప్రుఁ డుండెను. శ్రోత్రియకుటుంబమునఁ బుట్టి యున్నలమిన్న యని వాసికెక్కిన ముక్తాలత యనునామె యతనియిల్లాలు. ఆదంపతులకు మిగులఁజదువరియైనముద్దులకొడుకొకఁ డుండెను. తేజోనిధి యనుపేరఁ బఱగునాతఁడు రూపాదులం దసమానుఁడగుట నన్వర్థసంజ్ఞుఁ డయ్యె. అతఁ డొకపరిఁ బండితగోష్ఠినివైతండికుండై యొనర్చి లాఘవ మొందుటనుగూర్చి తండ్రియాలించి యతనిరావించి యొంటరిపాటున నిట్లు నుడువఁ దొడఁగె.

“కుమారా! మదగజముకరణి మత్తుఁగొని వెకిలివై యొడలెఱుంగక పెద్దలఁ దృణీకరించి భంగపాటొందనేల? గరువంపులోయఁబడిన వెంగలుల కాశ్రయ మొసంగ వెరవరుదని యెఱుంగవో ? అకటా ! అణఁకువనెల్లఁ బోనణఁచి సాధుజనులసంగతిఁ గంటగించు నదియగు నీకొలమువిద్దెలవలని కావరము నీకేల యలవడెను? బిడ్డా ! హెచ్చరికతో నాలింపుము. కులమనునది పలు

తెఱఁగుల నలఁగుచుండు. చదువులెల్ల జగడమునకె జతపడుచుండుట నిజంబు. ఇంకఁ గలిమియనిన బలిమిని నైన నిలుకడలేనిది. కనుక నిన్నిపు డలముకొన్నిన మదము తెలివిలేమిని గలిగినదని తెలియుము. సజ్జనులపజ్జ మెలఁకువతో మెలంగుటయె మంచికులమునకును మంచిగొనమునకుఁ దార్కాణము. ఎఱుకగలవారి కక్కటికంబె యర్థమగు విద్దెయు, నిలుకడయె నలుఁగుడులేని నగెమును, సద్గుణంబె సత్కులము నై వెలయును. శాంతమానసులకు భాగ్యమనుభవయోగ్యమై పరగు. కులము దైన్యరహితమై చెలఁగు. చదువు మదమును సదమద మొనర్చునది యై తనర్చు. ఎట్టివానికేని నీసు దోసమునకును, మిట్టిపాటు మట్టుపడుటకును, తాలిమి తామరతంపమునకును, నెపములై నెగడుచుండు. ఈవికాఁడైన నిరుపేదయుఁ గొడిసెకాఁడైన కులీనుఁడును, శ్రీతుఁడైన పిసినారియుఁ బొగరుఁబోతైన పండితుఁడును సమానులన వినమే ?

గర్వితుని నెయ్యము కయ్యమునకును, ఈగి లాగుకొనుటకును, చదువు సరసులఁ బరిభవించుటకును దత్తఱపడుచుండును. మంచివానికి మచ్చరుండును, పిసినిగొట్టునకుఁ దిరిపగొట్టును, ఎడ్డె కెల్లరును నొల్లనివారగు





దురు. ఇచ్చగొండికి మచ్చునకైన మచ్చరీఁ డుండఁడు. కనుక దుడుకుఁదనము దిగనాడి యడఁకువతోఁ బ్రవర్తింపుము.

కులముపస, పలుకుసొంపు, ఒడలియొప్పిదము, కలిమిబలిమి, మొదలగువానివలనఁ గలిగిన మదపుమ్రాఁకును మొదలంట మొలకయందె పెల్లగించినవాఁడు పెంపుఁ బేర్మిలఁ బడయఁజాలు. తనయా! యెంతో యొదుగుఁబడి గలవాఁడవైనను మంచిగుణములయం దించుకైన మచ్చిక నుజ్జగింపకుము. నిండుకుండయు గుణము తునిగినంతనె కూపమునఁ గూలుచున్నయది. కలగూర పెఱుకపడని కులమునందును, కంటికగపడుచునే కడతేఱు కనకమునందును, క్రయవిక్రయ రూపమగు విద్దెయందును, కాలకబళ మగురూపమునందు నభిమానముంచుట వెఱ్ఱితనము.

కుమారా! నేనిట్లు నుడివియు నాపలుకులు పెడచెవులనిడి యెప్పటియట్లు గరువతనమున మెలఁగువాఁడవేని, నీదోస మావల నిన్నిడుమలపాలు చేయునని నమ్ముము.

సిరికొలని కేనికయు, గౌరవసౌధమున కశనిపాతమును, చెడుత్రోవ పట్టువడుట కొజ్జయు, పరుల యుంగి

తమెఱుక పడుటకు నవజ్వరంబును, నడవడిచెలువజోతికి మొయిలునైన గర్వము సకలగుణగణంబుల సమయించుటకు ముఖ్యకారణంబని వేఱ చెప్పవలయునా? కుల విత్త విద్యాదులవలని యభిమాన మస్థిరమును దుఃఖోన్ముఖంబుఁ గాదేని యందఱు కాదరణీయ మేల కాకయుండు? "వక్తలలో నాకు దీటగువాఁ డెవఁడు? పాండిత్యమున నేనుబెట్టినది భిక్ష. చక్కదనంబున నన్ను మించినవాఁడు గలఁడా? కవితాప్రస్తావమునఁ గనిష్ఠిక నధిష్ఠించుటకు నాకంటె నర్హుఁడెవఁడు? ప్రతిష్ఠాసందర్భమునఁ బ్రతివాదిభయంకరుఁడనైన నన్నుఁజెప్పి వేఱొకనిపేరెత్తవలనుపడునా?" అని మదపిశాచమెల్లరమానసంబుల నావేశించి యాడించుచుండు. విచారింపఁ గలిమి కలకాలముండునది కాదు. శరీర మపాయముల కాకరము. ఇంక భోగములన్నవో మించులపగిది క్షణభంగురంబులే యగు. కనుక వీనివలని గర్వము వ్యర్థంపు టభిమానమునఁ గలిగిన దనుట నిక్కువము."

తండ్రి యిట్లు వేవిధముల నొక్కిచెప్పునపుడా తేజోనిధి యొయ్యారముగఁ గనులుమూసి, తెఱచుచుండి తుదకు నీయుపోద్ఘాతము సరకుగొనని మదపుటేనుంగుపోలె నచ్చోటు వాసె.





తెలిసినవారు తమయెడఁ గనికరించి హితముగఁ జెప్పు సమయమునఁ బొగరుఁబోతులకు నిట్టూర్పులుచెలఁగఁ గాలనేల వ్రాయుచుండుటయు, మొగము గంటుపెట్టుకొని కోరచూపులఁ జూచుచుండుటయు, అడపఁదడపఁ జెమ్మటఁ దడసిన ఫాలతలము నరచేతఁదుడుచుకొనుచుండుటయు, గాలిసోకినవిధమున ముందువెనుకల కూగుచుండుటయు సాజంబులు కదా!

పదఁపడి యొక్కనాఁడా తేజోనిధి మిత్రునింట జరుగుశుభకార్యమునకుఁ బో నుద్దేశించి, మంచిగుఱ్ఱములు పెక్కులున్నను జవసరిశీలనోత్సుకుండై గర్వంబుమెయి నొక్కచలువగుఱ్ఱము నధిరోహించి బయలుదేరెను. అతఁడట్లగుతఱిఁ గొంతవడి కాగాడిద యీడిగిలఁబడ, వైశంబ గమ్యస్థానంబుఁ జేరునుల్లాసమున నద్దానిఁ గశాభిఘాతములఁ జక్కాడసాగె. అట్టితఱి విధివశంబున సకలసత్త్వ సమభావముఁ గలిగి విజితేంద్రియుండై సామాన్యవేషమున నొప్పు నొక్కమహాపురుషుం డనతిదూరమున నేగుచుండి, యాదృశ్యమును గాంచి, చిత్తము తల్లడిల్ల నొక్కత్రుటిలో నచటఁబొడసూపి యిట్లనె. "ఓయీ! అగ్రజన్ముఁడ వయ్యు శాస్త్రవిరుద్ధముగ ఖరవాహనము నెక్కుటయు గాక, మీఁదుమిక్కిలి నోరులేనియాజీవము

నన్నేలఁ జెండాడెదవు? కట్టా! నీ కొట్టిన దెబ్బలఁ జేసి కాయమునఁబడిన గాయముల వెలువడిన నెత్తుటివరదలు కన్నీటి వెల్లువఁ గలసిపాఱఁ బాపమీ జంతువు దయామయుండగు నా జగత్పితతోడ నెట్లు మొఱవెట్టుకొనుచున్నదో చూడుమా! పెరల మేనుల నొంచునపుడు తమ మేనులు సోఁకిన మాత్ర నెట్లగునని తలంపవలదా? "అహింసాపరమోధర్మ" యనెడినుడిని నీటిపుచ్చి నీ విట్లు చరింపఁదగునా?" అని పలుకునవసరమున మొగముఁ జేవురింప వేఁడిచూపుల రాలు నిప్పులు కుప్పలుగొన న త్తేజోనిధి యొడుపుడిప్పిన మహానాగంబువడువున నుగ్రుఁడై కటకటంబడి, నివురుగవిసిన నిప్పువలెనుండు న య్యోగిపుంగవునిఁ జురచురఁ జూచుచు "ఓయీ! బుద్ధిమంతుఁడా! ఇన్ని మాటలనేర్చియుఁ బిలువని పేరంటమున కరుగుట సిగ్గు చేటని యెఱుంగవో? ఈ శ్రీరంగనీతులఁ జెప్పుమని నిన్నెవరైన బొట్టుకాటుకఁ బెట్టి పిలిచిరా? జోలిమాలినపని పయిపెట్టుకొనునతఁడు మేకుఁ బెఱికిన కోతివలె ముప్పుఁ జెందునని వినలేదో? ఈ నాయానంబునకుఁ బోలె నీకును వయసు ముదిరినది; కాని యుపయోగమేమి? ఇంతటనైన నీ గ్రంథము కట్టిపెట్టి నోరుమెదల్పక యిటనుండి వెడలుము." అని వాక్రుచ్చె. ఇటఁ డిట్లు కాఱులు పలుకుచున్న నించుకైన నా యోగి





పుంగవుఁ డుల్లమున ఖేదము నొందఁడయ్యె. చలముచెలుములు నిందాస్తుతులు మొదలగు ద్వంద్వములయెడ మహాత్ములు సమబుద్ధి గలవారుకదా. అంతట నా మునివరుఁడు హాసభూషితముఖుం డగుచు నతని నాపాదమస్తకముఁ దిలకించి, "వత్సా! పుట్టుకయందు బలెఁ గర్మములయందు నుబలితుండ వైతివి కదా!" అనుచు నచ్చోటు విడిచి చనియె.

పిదపఁ దేజోనిధియుఁ దనవాహనము నదలించుచు నా పలుకుల సరకుగొనక తన త్రోవఁబట్టె. కాని కొంత దవ్వరుగునప్పటికి నా ఋషిశ్రేష్ఠునివచనము లాకృతిఁ దాల్చి యెట్టయెదుటఁ బొడసూపి యతని మనసును గలగుండుపెట్టసాగె. మూర్తిమంత నుగు సైరణకరణిఁ గన్పట్టు నా దయామయుని యాకారము స్మృతిపథంబునఁ బర్వినంతనె యొడలుర్లులన నతఁడు తనతొందరపాటునకుఁ జిత్తమున నుత్తలపాటుఁ జెందె. క్రమముగ నా యోగివరుని తుదిపలుకులు ములుకులై యెడఁదనాటఁ బరిపరివిధంబుల విచారింపఁ గడఁగె. తనజన్మము దెద్దియైనఁ గొఱఁత కలుగనిది యేమహామహునోట నట్టి కొఱపలుకు వెడలదని యతఁడు చివఱకు నిశ్చయించుకొనెను. తత్క్షణమె మానధనుఁ డగున త్తేజోనిధి కయ్యాది

హృదయశల్యమై వేధింపఁ దొడఁగె. మానముతోడ ధైర్యమును వీడిఁబోవ నతనికత్తఱి మిన్ను విఱిగి పైఁబడినట్టులయ్యె. లోకమే పాడైనట్లు కనఁబడె. అతఁడట్టె కేలకు దండమును బదిలపఱచుకొని కలరూపెఱిఁగి కాని జలపానమైనఁ జేయఁగూడదని పంతముపట్టి, తన వాహనము నట్టెవిడిచి, శరవేగమున నింటికిఁజని, తల్లినిఁజేరి యేకాంతమునఁ దావిన్నది విన్నవించి, 'సత్యస్థితిఁ దెలుపవేని నీవిటు చూచుచుండగనే దేహత్యాగ మొనరించెద గాక' యని యామెపాదములంటి పలికెను.

ముక్తాలత కొడుకుమాటల విన్నంతనె పట్టుపడ్డ మ్రుచ్చుపగిది నివ్వెఱపోయియు, హఠవాది యగునతని సాహసోద్యోగంబుఁ గనుఁగొని వెఱఁగుపడి, తనపాపము నేటికి బ్రద్దలైనందులకు లోలోన నేడ్చుచుఁ దప్పించుకొనునుపాయముఁగానక యధోముఖియై యూరెలుంగున నిట్లు నుడువసాగె.

"కుమారా! మగువ లొనరించుఁజెట్టలిట్టివని నుడువ నెవరితరము? వారి విచేష్టితము కడుంగడు దురవగాహమును, సంసారంబుకంటె సాశ్చర్యంబు నగును. గజకర్ణాగ్రము నశ్వత్థపల్లవము మెఱుపుతీవ చంచలములండ్రు వీనికంటెఁ జంచలతమము స్త్రీమనం బని తెలియు





ము. తిరుగుఁబోతులు మగని సుగుణగణముల గణింపరు. కులము వీటిపోవు ననియైనఁ గొంకరు. గౌరవము వీసరవోవు నని వెనుదీయరు. వస్తువాహనంబుల కాసపడరు. చూపఱచూడ్కికిఁ జిక్కరు. మనసుపట్టినచోఁ గత్తులబోనులైన వారికొకలెక్కలోనివి కావు. మనుజుల కుసురుల నొసంగువారును దీయువారు నతివలే కదా. వారు భీరువులేయయ్యు నొక్కొక్కతఱి ఘోరవిషాగ్నిజలాదులనైనఁ బిరుతివియక యెదుర్కొనఁజాలు సాహసముగలవారు. పూవుఁబోఁడులేయైనను వజ్రకఠోరహృదయలు. ముగ్ధలైనను విదగ్ధులఁ గను బ్రామఁ జాలుదురు.

"అది యట్లుండుగాక. బిడ్డా! రహస్యోదంతములఁ జర్చింపఁదగునా? శరీరములువోలెఁ గులములును సంవృతములై కదా రాణించు. సిగ్గుచేటగు నొక్కయకార్యమునుగూర్చి చెప్పుమని నన్నిట్లు నిక్కచ్చి చేయఁదగునా? చదువరివయ్యు మొండిపట్టున నింటిగుట్టు రట్టుసేయఁ బాల్పడదవేల? 'తనతల్లిలోపమెఱిఁగిన మనుజుఁడు చింతిల్లు నెపుడు మానసమందున్' అన వినవో? ఈ నామాటల మఱచిపొమ్ము. లోకసహజమగు నిట్టిదోసఁగును మనసునఁ బెట్టి పండువంటికాఁపురముఁ బాడుసేయఁ దలపెట్టకుము. ఇంతకుమించి నేఁ జెప్పఁజాలఁ."

ఆ తేజోనిధి తల్లివచనసరణిఁ దలపోసి, తా ననుకొని నట్లె మునివచనం బమోఘంబని నిశ్చయించి, తన కదివఱకుండు నాభిజాత్యంపు గరువము మిథ్యాభిమానజనితం బని యెఱింగి మిక్కిలి పశ్చాత్తప్తుఁడయ్యె. ఆవలఁ జలపాదియగు నతం డెట్లైన నిజజన్మ దోషమును బాపుకొని కృతార్థుండు కాఁదలంచి, అప్పుడ కదలి యుత్తరదిశకుఁ జనిచని యొక్కచో నిరాహారుండై వేల్పు వేల్పునుద్దేశించి నిష్ఠతోఁ బెద్దకాలము తపమొనర్చె. అంతమున నతఁడు సలుపు నుగ్రంపుఁదపమునకు మనసున మెచ్చి తెఱగంటిదొర సాక్షాత్కరించి వర మడుగుమనుడు నా తేజోనిధి నిటలతటఘటితాంజలియై "దేవనాథా! మత్కులకళంకమును బాపుము.' అని వేడుకొన నాఖండలుఁడు "వత్సా! నిరుపయోగమై సాధింపరానికోర్కెఁ గోరితి వేల? అంతకంటె వేయిమడుఁగు లుత్తమమై పెరల కందరాని దేవత్వమునె యనుగ్రహించితిఁ గైకొనుమా' అనినుడివి సమాధానపఱచి యంతర్ధానమొందె. ఆ తేజోనిధియె సురపతివర ప్రసాదముచే ఛందోదేవుఁ డనునభిధానమున వన్నె కెక్కి యేటేట నొక్కదివసమున సచ్ఛీలప్రాప్తికై స్త్రీగణంబులచే నేఁటికిని పూజింపఁ బడుచున్నవాఁడు.

కనుకఁ గాలసర్పముంబోని కులదర్పమున కెల్లరును దవ్వులవారు కావలయు. శమదమాది సద్గుణోపేతులకు





మంచినడవడియే విశాల మైనకులము. ఎవ్వని కవివేకరాశి జననియు, భవసాగరము తండ్రియుఁ దృష్ణ భార్యయుఁ గానేరవో వాఁడెపో కులీనుఁడును గుశలియు నగును.

ఇది కౌండిన్యగోత్రపవిత్ర
గొల్లపూఁడి - శ్రీరామశాస్త్రిప్రణీత మైన
దర్పదళనమునఁ - గులవిచార మను
ప్రథమపరిచ్ఛేదము.

# దర్పదళనము.

ధనవిచారము – ద్వితీయపరిచ్ఛేదము

—(—)—

## ధ న వి చా ర ము.

ఉ. మాడలు సంతరించుకొని
మచ్చిక నెవ్వరికీఁ గలేక ప
ల్పీడలు మేనులం బొరయఁ
బెక్కురు-చోరులు బాధపెట్టఁగా
గోడని యేడ్చుచుం భ్రమలఁ
గుందు శరీరుల నేను మెత్తునే ?
చూడ సమస్తకర్మపరి
శుద్ధులకిత్తును గాక మోక్షముల్.

[గట్టుపుత్రిభువు]

మెడను గట్టుకొన్నను సమయము వచ్చెనేని మించు పగిది నున్నట్టుండి యంతరించు సర్థముఁగాంచి మానవు లేల గర్వమూనవలయు? ప్రాణపదముగఁ గాచువిత్తము నశించుటయుఁ గాపుగడ లేనిధనము తిరముగ నుండుటయు మనము గన్నులారఁ గనుచుండుట లేదా? లోభివానిపై కమెంత తామరదంపముగ నున్న నాత్మార్థముగఁ





గాని, పరార్థముగఁగాని యుపయోగపడుచున్న దేమో కనుఁడు. ఆలోచింప విత్తము వెఱ్ఱివానిచేష్టలఁ బోలిన దనియె తెల్లమయ్యెడి.

మనోరథసౌధములఁ గట్టఁదలఁచి యాపిరాడక యహరహము పఱువులువాఱుచు 'ధనముధన' మని పలవించువారికి మరణచింతయు నుండదుకాఁబోల్కు. కాంతి దక్కియుండుటయందును, సొమ్ముఁ గప్పుపెట్టుట యందును, సంసారకష్టములఁ గుడుచుటయందును బిసినికిని పేదకును గొంచెమేని తారతమ్యము గలదేమో యోజింపుఁడు. 'చా' వనునది యొక్కటి యున్నదని యైనఁ దలఁపక ముల్లెమూటఁగట్టుటయందె కాలమును వెళ్లించినయతెనియనంతర మాయాస్తి ననుభవించువా రతని పిసినితనము నిందించుచుఁ బంచుకొందురు కదా! ఇంతకంటె శోచనీయ మొండేమి యుండు?

పిసినిగొట్టులకు వాటిల్లు నిక్కట్టులెన్నియని నుడువవచ్చు? ఉన్నచో ఔఱింగించిన నొరు లపహరింతురను జంకును, అట్లని తెలుపకున్న నేలపా లగునేమోయను చింతయు డెందమున నందడింపఁ బ్రాణములఁబాయు సమయమున వారికీధనపిశాచము హృదయశల్యమై నొప్పించెడి. పిసినారి ప్రాణోత్క్రమణకాలమునఁ దన

చుట్టుమూఁగి విలపించు చుట్టములమోముల నడియాసఁ గన్నీరు చెవులకొలకులునిండఁ దిలకించుఁగదా? తాను చెమటఁదీసి సేకరించిన దయ్యుఁ దన యనుభవంబునకు దవ్వై, పడఁపడి తనయంతమున కెదురుచూచువారి పాలఁబడునది యగుధన మెట్టిపగవానికైనను వలదు.

ఏ వారికిఁ జదువరితనము జగడమునకును, కలిమి కక్కుర్తికిని, ప్రజ్ఞ పరవంచనమునకును, గొప్పతనము గుణహీనతకును, నెపములై యొప్పు; అట్టివారికి వెలుఁగుఁ జీఁకటిగనే కదా పరిణమించు ధనముపేరి యుప్పునీటిఁ గ్రోలుటం జేసి యొదవిన పెనుదప్పి యేఁకిఁగాని యొడలితోనె యాఱవలయు. పిసినివానిమే నొకప్పుడేని సరస పదార్థసంబంధము లేనిదగుట సారహీనమై శుష్కించుఁ గావ? లోభి రొక్కము దుండుమక్కువం జేసి సంతతము పలుశంకలకు లోనగుచుండుకతమున సుఖనిద్రయనునది లేక యాకలి మందగించి యజీర్ణరోగమున కెరగాకుండఁ దప్పించుకొనఁగలఁడా? అకటా! దైవవశమున దరిద్రుఁడు పడుపాట్లకంటెఁ బ్రియముతోడఁ బిసినారి పడుపాటు లిట్టివనికాని, యిన్ని యనికాని, లెక్కింప నావేయినోళులవానికేని తరముగాదు.





'శ్రావస్తి' యను నగరమందు మిక్కుటంపులోభమున జక్కులఱేనిఁ బోలినవాఁడయ్యుఁ బెఱలకుఁ బేరెత్తుటకైన మనసుగొల్పనివాఁ డగునందుఁ డనుపేరుగల బేహారి యొకఁడుండెను. ఆతఁ డందఱయెడ ననూయాపరుఁడై నల్లత్రాచుపగిదిఁ దల్లడఁబెట్టుచుండెడివాఁడు. ఆపిసినిగొట్టు పగలంతయు బండారమునుండి నాణెములనెన్నికపెట్టుటయందె ప్రొద్దుపుచ్చుచుఁ బ్రాణము నిలుపదను భీతి మాపులమాత్ర మరకడుపున కయిగాక యాహారమును గొనుచు దినములెట్లో గడపుచుండెను. ముల్లెముడి విచ్చనైన నిష్టపడని యతనిసంసార మసారమగుఁగూడు కుడుచుచుండుటఁ గళాకాంతులేలోకమున లేక యుమ్మలికంబు ప్రోవైనయట్లగపడుటలో నబ్బురమేమి కలదు? తలఁదాచుకొనుటకైన ననువగువసతిలేక సుఖానందంబులకు దూరమై నిర్దీపమగునతనిగృహము యమలోకసదృశమనుట హెచ్చుపలుకని యెట్లనవచ్చు? ఊపిరాడ నీయనియుబ్బసమును, కడిఁగొన నీయనికడుపుశూలయు, పీవగించుకొనఁ దగినయొండు తెవులును నాయులిపికట్టెకు బాసటలై యతనిబండారమునుఁ బదిలపఱచుచుండె.

ఆలోభికి దైవచిత్రమున, సొగసులదీవియై పున్నెములపంటయనఁదగి గోనములప్రో వగు 'మతి' యను పేరుగల యన్నులమిన్న యర్థాంగియయ్యె. మగనికెఱుఁక పడకుండ నాయతివ యతిథుల సత్కరించుచుఁ బిదప నానీచుఁడొనరించునిక్కచ్చిచే నిడుములపాలగుచుండును. ఆదంపతులకు 'చందనుఁ' డను నొకతనయుఁడుండెను. తల్లిచాలునఁబుట్టి సద్గుణమూర్తి యని వన్నెకెక్కియుఁ దండ్రిచాటున నుండుకతమున నతఁడు చీఁకటికిఁ జిక్కినచెందొవకరణిఁ దననైజమును గనుపఱుపఁ జాలకపోయె.

ఒక్కనాఁ డానందుఁడు తనయింటివాకిట బిచ్చముఁగోని నిలిచియున్న భిక్షువునుగనుఁగొని తామ్రముఖుఁడై తటాలున లోనికేగి తనయిల్లాలిని నెత్తురు పాఱమర్దించి, ఆదుర్మదుని సంస్పర్శనంబున మేన నంటినయఘమును గన్నీళ్లచేఁ గడుగుచున్నదియుఁబోలె నుండునామె నుపలక్షించి యిట్లు వదరసాగెను.

"నిర్భాగ్యురాలా! నాయింట క్షామదేవతవై చాపరించితివి. పంతముతో నన్నుఁ జోగినిఁ జేయఁ బొల్పడిన నాపాలి దురదృష్టదేవత వీవెచటనుండి చేరితివో! ఉన్న కొంచెము జలగడిగి కొంపఁగొల్లఁబెట్టితివేని, పిదపఁ బిడి





కెడు ముష్టిపెట్టువాఁ డెవఁడు? మగనిఁ గనుబ్రామి మగువ కొల్లలాడఁదలపెట్టెనేని యాయిల్లక్కఱకు వచ్చుట కలలోనివార్త. "ఆడుదానిచేతియర్థమును మగవానిచేతిబిడ్డయు బ్రతుక' దనునుడి నేటిదా? ఆడుకూఁతు రఱమఱలేక యర్థము వ్యర్థముఁ జేయసాగునేని మగవానిమరియాద మంటఁగలియుట కేమిసంశయము? ప్రాణమునకుఁ బ్రాణమైచూచినంతమాత్రమునఁ దృప్తినొసఁగఁజాలుసొమ్మును వమ్ముచేయు శుంఠలు బ్రతుకుఁదెరువుఁ బాడుచేసికొనువారలే కదా!

ఉండియులేనివాఁ డిలలో లేనివాఁ డనియు, గతించియుఁ గలవాఁ డున్నవాఁడె యనియుఁ బెద్ద లనునది యనుభవసిద్ధమైనమాట; కావున దారిద్ర్యము మరణమును ద్రవ్య మాయువు ననుట ముమ్మాటికి నిజంబు. ధనవంతుఁడధముఁడయ్యు నతనిమాట నందఱు నాదరింతురు. కలిమిని బట్టియే కులగౌరవముగాని కేవలకులం బేరికి వలసియుండు? "కులము గల్గువారు గోత్రంబుగలవారు, విద్యచేత విఱ్ఱవీగువారు, పసిఁడి గల్గువారి బానిసకొడుకు" లని వెఱ్ఱులై చెప్పిరా? ఇంతయేల? ప్రాణముబోయినపిదపను డబ్బుగలవాని నాదరంబున మూఁపునవహించి మోయుచుండుట యందఱెఱిఁగిన యంశమే కదా! కలిమి పెంపుఁ

జాట నిది యొక్కటియు చాలదా? ఇహమునఁ బేదతనమున నెన్నియేని యిడుములఁ గుడుచుబడుగు పరమునమాత్ర మేమి సౌఖ్యమును బ్రాముకొనఁ జాలు?

తెలివిలేనిదానా! కడుపుఁగట్టి గడించినయన్న మింతైన నాలోచనము లేక యర్థులవాతఁగొట్టి యేల నేలపాలుగావింపఁ దలపెట్టితివి? "అర్థవంతుసొమ్ము నాసింతు రర్థులెయర్థికీయ సొమ్ము వ్యర్థమగు" నని చెప్పగానైన వినలేదా? దేనికై పడరానిపాట్లుపడి కన్నకాళులనెల్లఁ బట్టుకొందురో; అట్టివిత్తము ప్రాప్తమైనపు డద్దానిఁ బదిలపఱచుకొనని పందలెందైనఁ గలరే? కనకమృగము కనఁబడినంతనె "కలదు లే"దను విచారము లేక కాంతనుదిగనాడి కాకుస్థుఁడుగూడఁ గానలఁబడి పఱచినట్లు గొప్పనిదర్శనము గనఁబడుచున్నదికదా! భగవానుఁడే యట్లు పసిడిపావనమునిమెంచియుండ నింక నద్దాని సరకుగొనని మూఢమతుల నేమనవచ్చు? విచారింపఁ బురుషులకుఁ బుత్రదారాదిసంబంధము ధనమూలకంబె యగు. లేమిడి తటస్థించెనేనియాలు బిడ్డలుసయిత మసరాని మాట లనుచుండ నింకనన్యులమాటఁ జెప్పనేల? కనుక నే "ధనమూల మిదం జగత్త" నుట.





ఆలోభి తనయిచ్చచొప్పునఁ గాసు ఖర్చుపడనిమాటలిట్లే కరువు పెట్టుచుండ నాకర్ణించి యాసతీలలామ తనపెద్దతనము పెంపెసలార నిట్లుగ్గడింపఁగడఁగె.

"సజ్జనులు దానధర్మముల సలుపుటకుఁగానె తద్దయు యత్నమున ధనము సంపాదింతురు. ధర్మహీనుల ద్రవ్యసంగ్రహము పాపసంగ్రహమనియె చెప్పనగును. ఏవిత్తమువలనఁ జిత్తక్షోభాదు లగునాధివ్యాధు లంకురించునయ్యది యాసించుటకుహృదయవ్యాధిగాని సిరి యనఁదగినదా? భోగసౌఖ్యములకెడఁగలిగించుకలిమిరోగ మెక్కుడైనచో రాజవైద్యమునఁగాని యయ్యది యుపశాంతిఁబడయఁజాలదు. లోభబుద్ధిమెయి నెన్నఁడైనఁ దనయింట మేలెఱుంగనివానియనంతర మతనియాస్తి ననుభవించెడివారి మేలిండ్లు మేళతాళముల మెఱయుచుండుట లేదా?

•

నాథా! గాలికుప్పెత్తునఁ గొట్టుకొనిపోవునూక నూడ్చి తెచ్చి యుగ్రాణమున నిండించి యుప్పొంగుచుంటివి; కాని యందుఁగలయెలుకలు కలుఁగుల కీడ్చుకొనిపోవు కనకరాసులఁ గనఁజాలవైతివికదా! త్రుటిలో రూపుమాయు నీరొక్కముం గని యూఁపఁ బడనేల? ఇయ్యది యూఁగిచే నెసఁగు ననియు నుపద్రవంబుల కూన

రిల్లుననియు వినలేదో? ధనమునకు దానాగ్నినృపతస్కరు లనువారు నలువురు దాయాదు లుండ్రు. చేఁదోడువాఁడోడుగ మెలఁగు నాసోదరులఁ బెద్దవాని నెవ్వరైనఁ బ్రోసిరా జనిరయేని తక్కిన మువ్వురుఁ గుపితు లగుదు రని తెలియుము. కనుక సర్వవిధముల నెవ్వరికేని యెప్పుడైన ధనలోభము మిగుల ననుచితంబె యగు.

మఱియుఁ దమకడుపునఁ బొడమినవారె ధనాశ మెయిఁ దలిదండ్రు లనుకనికరమైన లేక కాఱియఁ బెట్టుచున్నయిక్కలికాలమున, మ్రుచ్చులగములు మోసై మోసము చేయుచున్నయిక్కలికాలమున, నేలఱేఁడులు నయితము నీతిదూరులై పరవిత్తాపహారణంబె పావనంబుగ నెన్నియున్న యిక్కలికాలమునఁ గనకరాసులవలనఁ గాంచఁదగిన కర్జమేమి? దానమననేమో యెఱుఁగనివానికిని, తినినతిండి నైనఁ జీర్ణించుకొనఁజాలనివానికిని, జంజాట మింతైనలేనివానికిని, దురన్నదుర్దానంబులకు దోసిలొగ్గి కక్కుర్తిమై గడించిన దానినైనఁ దగినవిధమునఁ గర్చుసేయ బుద్ధిపుట్టనివానికిని, వృద్ధికాసించి, యున్నధనమంత నొరులకొప్పగించి పత్త్రములఁ గాంచి సంబర మొందువానికిని, భారహేతువగునాధనరాశితోడి ప్రయోజన మేమి? స్వామిద్రోహాది సాహసంబులనైన





సలిపి విత్తము సేకరించియు నద్దాని వెలికి దీసి వెచ్చింప నెరవులేనివానికిని, చెడుగులఁ జెట్టఁబట్టి చేయరానిచెయ్వు లొనరించుచు సొమ్ము వసూలుచేయువానికిని, పెంపునకుఁ బిడుగైన యాధనమువలని ప్రయోజనంబేమి? ఆస్తికాఁ డనిపించుకొనఁదలఁచి కట్టె క్రిందఁబడువఱకుఁ బరదేశములఁ బలుపాట్లఁ బడుచు నార్జించువానికిని, ప్రాతచింపులతోడ బానిసవలెఁ బెక్కుకష్టములఁ గుడుచుచుండుటయగాక పట్టుమని పట్టెఁడన్నమేని పొట్టకుఁ దినియెఱుంగనివానికిని, కాయశోషకంబగునాకాంచనమువలని లాభమేమి? కట్టుకొన్న పెండ్లము తనపాలి రాకాసియై యింటగట్టు పెట్టుచున్నను మనసునఁ బెట్టక, చూచినవాఁడు నగుదురని యైనలేక కౌతుకంబున నెడచేతఁ బెడచేత ధనముఁ బ్రోగు చేయువానికిని, అశేషభోగభాగ్యముల ననుభవింపుచుపొంగు శిష్యులఁ జేర్చుకొని డంబముతో డబ్బుసంపాదించువానికిని, పరిహాసభాజనంబగునాధనముతోఁ బ్రయోజన మేమి? ఉన్నంతలోఁ దృప్తిపడి నిశ్చింతచే నెగడువానికిని, తృణకనకములఁ దుల్యముగనెంచి విషయసుఖవిముఖుఁడైనవానికిని, భండారమును భర్తిచేయఁగల ధనకుంభములవలని ఫలమేమి? ప్రాణతుల్య యగుఁ బ్రియసిగాని, ప్రాణాధికుఁడైనమిత్త్రుఁడుగాని, ప్రాణాభిన్నుఁడౌ

తనయుఁడుగాని తన్నువిడిచి చనినపుడు పలువెతలఁ బరిత
పించువానికిని, చుట్టములెల్ల మడిసి పలుకుఁడోడైన లేక
పల్లటించుచు బ్రతుకుపై రోసినవానికిని, నిప్పచ్చరంబున
నెఱయౌవనము నీఱగుడు జవసత్త్వములు సన్నగిలినతఱి
వినుటకు వీనులును, గనుటకుఁ గన్నులును లేక, ముదిమి
తనమున ముప్పుగాని యొక్కచో మూలుఁగుచుండువా
నికిని, దీర్ఘవ్యాధిపీడితుఁడై తినినమందు లెల్లఁ దనపట్ల
వ్యర్థము లగుడు నసువులు వెడలలేదే యని విసుఁగుకొను
చుండువానికిని, రత్నాచలము దొరసిల్లియు మనశ్శాంతి
నొడఁ గూర్పఁగాఁ జాలునా!

పుడమిలోఁ బేదలు పేర్మితో నుండుటయు, కలిమి
కలవారును గడగండ్లఁ బడుచుండుటయుఁ దలపోయ, శరీ
రధారులకుఁ గలుగు కష్టసుఖము లీశ్వరాయత్తము లను
ట తేటపడుచుండఁ బ్రాణముల వేసటఁ బెట్టియైన నెక్కుడ
గురొక్కమును సేకరింప నాయత్తపడ నేల? కోటికిఁ బడి
గెత్తి కోరినకోర్కెలెల్లఁ గూర్చుకొని కులుకుచున్నవాఁ
డయ్యు, మృత్యువు దాపరించి మూర్ధముఁ బట్టి లాగుతరు
ణమునఁ దనయాస్తినంతయు నడ్డుపెట్టియైనఁ గాసంత సేపు
తన్నుఁ గాపాడుకొనఁగలఁడా?





నాథా! ఈనాపలుకులఁ బెడచెవినిడి యెప్పటి యట్ల
యీనీధనరాశిఁ గనుగొనుచు గాలిసోకిన పగిది గాసిసొం
దుచుండకుము. లోభాంధకారమున మించులకరణి
మెఱయు నీకలుములెల్లఁ గనులు మూసి తెఱచునంతకె
కనఁబడకుండఁ బోవుననుట మది మఱవకుము. నారాజ
కలిమిని రాపాడు రాజ్యవైభవమెల్ల రహితమగుడుఁ
బ్రాభవముతోఁ బరిఢవిల్లు పాండవులు నయితె మనువుల
పాలు గాలేదా? దేవనాథుఁడంతటివాఁడొకప్పుడు పదభ్ర
ష్టుఁడై నిజతేజము బీఱుపోవఁ దామరతూఁడులోఁ దాఁగి
యున్నట్లు తెలియుచున్న దికదా! విచారణము సేయఁ గన
కముమీఁదియాశ యెట్టిదిట్టనైనఁ గలగుండు పెట్టు ననుట
నిజము."

ఇట్లు భార్యచే బహుభంగులఁ బ్రబోధితుండయ్యుఁ
నాసన్ధుఁడు తనయులిపిగొట్టుతనము నుజ్జగింపఁడయ్యె.
"పుట్టుకతో వచ్చినది పుడకలతోఁ గాని పోదనుట పొల్ల
గునా? ఆ కక్కుర్తికాఁడు నానాఁటికిఁ దెంపులేని తెవులు
కతమునఁ దికమక లాడుచుండియు, విత్తము వెచ్చించి
మందైనఁ దినుటకు మనసురాక యున్నట్టుండి యుగ్రాణ
మునను యుసురులఁ బాసెను. లోభులోకుల కొసఁగ
కయుఁ దమకడుపునకైనఁ దినకయుఁ జిరకాలమునుండి

ప్రీతికై సేకరించిన ధనమును విడిచిపో నిష్టములేక యా షికంబుల విధమునఁ దా మున్న చోటనె తద్దయుఁ దల్లడిల్లి తనువువిడుతు రనుట యట్టిదియ కాబోలు.

ఆనందుఁడు పరలోకగతుఁ డగుడు నతనియర్థము లోనియర్ధ మవనిపాలునిఁ జెందె. 'పాపిసొమ్ము పార్థివులపా' లనుట సాజముగదా! పైతృకమిల్లు పరులపాలయ్యె మిగిలినదానిలోనె మిక్కుటంబుగ వ్యయపఱచి నందుని నందనుఁడైన చందనుఁడు పితకుఁ బేరిమిఁ బెఱజగముచెయ్వి లొనరించె. అయ్యేదనుఁ బిసినివాఁ డగునానందుని పేరు పేర్కొన్న మూదేవిముసించు ననువారు కొందఱును, ఆయులిపికట్టె యూపిరితో నున్నంతకాల మూరికుక్కలు నయితే ముద్దుగుడుచుకొనె ననువారు కొందఱును, ఆపాపి బ్రతికినంతకాలము పట్టుమని పట్టెఁడన్నమైనఁ గడుపునకుఁ దినినవాఁడుకాఁ డనువారు కొందఱును, గుణనిధియైన యాచందనుఁ డాకాళకముపునఁ దప్పఁబుట్టినాఁ డనువారు కొందఱును, ఇంతటనైన నాపాపిసొత్తు కొల్లబెట్టుట కొడుకునకుమే లనువారు కొందఱును, ఎన్ని కొంపలనో కూల్చి తుద కాతొత్తుకొడుకు మూటఁ గట్టుకొనిపోయిన దే మనువారు కొందఱును నై, పురవాసులందఱు పుయిలోడక తమతమ వెక్కసంబుల వెళ్లఁ బోసిరి.





చందనుని పసులకొట్టము పొంత "ఖండిక" యను పేరఁబఱగు నొక్కకడజాతిది పెద్దకాలమునుండి కాఁపురము చేయుచుండె. ఆబిడ యుపరవయసున నొకయాఁటిబిడ్డ నరుదుగఁ గనెను. ఆశిశు వఱపొఱడును బుట్టుగ్రుడ్డియు నగుటయేకాక పొక్కులప్రోవనఁ బొసఁగుచుండె. ఆబాలు నభాగ్యవశమున మాతృక్షీరము పరిక్షీణమగుడుఁ జుట్టుపుఁగాంతలు శునీక్షీరమున నతనిఁ బెంచుచుండిరి. ఎగుడుదిగుడు లగుఁ దొలిపుట్టువులచెయ్దముల వైచిత్ర్యమిట్టిదియ కాబోలు. చెడుగవులునకుఁ జేరినపురుగులఁ బొరికొని తినఁగును దలపించు నాయభాగ్యు నానగరమున నొక్కఁడుఁ బూరిప్రోగున నుంచి తల్లి కూరిమి పేరిమిం బోషించుచుండెను. మమకారమెట్టివారినైన మల్లడిగోనఁజేసి మరపించుఁగాదా! ఆపిన్నాతఁ డించుక పెద్దవాఁడై సుడుగాడులందె సుడివడఁ దిరుగుచుండి యచ్చటి పిశాచములను బెట్టిదుఁడయ్యె. కేల నొక్కకోలఁగొని తన్నుఁ గనినంతనె యూరివారెల్ల నోశరించుకొనుచుండ నాతెవులుగొట్టొకతూరి యొకతెన్నునఁదరలెనేని యాతెరువునఁ దెగువఁజేసి తక్కటివారు తరలఁ దలఁకుదురు.

ఇట్లుండ నొక్కనాఁడా చందనుని మందిరమున నతని జనకుని యాబ్దికము జరుగుచుండునవసరంబున, విప్రులో

సలిలము గోవిందసంకీర్తనంబుల నాలించి యాకడజాతి దుష్ట్రీ డాకకంచముఁ జంకనిడుకొని కబళమునకై వచ్చి యచ్చట నిలిచెను. పాఱులేతెంచు బాటకడ్డముగ నున్న యాబుడుతనిఁజూచి చండనుండుగ్రుఁడై పనివాండ్రఁబిలిచి "యీపాపిని మెడఁబట్టి గెంటుఁ" డని పరుసముగఁ బలికెను. తమయధికారి యెదటున కదరిపడి యతని సేవకులలో నొక్కఁ డాయనాథబాలునిఁ గట్టెతోఁగొట్ట నతఁడు గిర్రున దిరిగి పక్షివలె నేలఁగూలెను. కాయమునఁ బడిన గాయమునుండి నెత్తురు చిప్పిలుచుండ నుంత తడవు సొమ్మసిలియుండి, పిదప మిగిలిన కష్టముల ననుభవించుటకోయన మరల నసువులఁబడసెను. మఱుగున నున్న యీ మాలెత కొడుకుకూయిడుట చెవిఁబడఁ జయ్యన సమీపించి రక్తమునఁ దడిసిన తనయునితలను గన్నీటఁ గడుగుచు నార్తయై యిట్లు పలవించె.

"కట్టా! ఈ కడగండ్లమారిపై నక్కటికమించుకైనలేక దేవుఁ డేచెనంటి యిట్టిచేష్ట యొనరించెనో కదా! తెప్పలుగొట్టగు నీదిక్కులేనివానిఁ గనికరించుటకు మాఱు చెండుకొని తినుట కేవాడుగునకుఁ జేతులాడెనో! కనిసంతాన కడుపు బిడ్డలగు నితనికష్టములఁ గన్నులారఁ గనుగొనియు, ముప్పులకు మూలమగు నీమొఱకుం దనమ్ము





నొనరింప నెవ్వనికి మనసుపొడమునో! ముందుజన్మమున నితఁడెట్టి ఘోరంపు దోసఁగుల నొనరించెనో, ఇప్పుడిట్టి క్రూరంపు వెతలఁ గుందుచున్నవాఁడు. బిడ్డా! కడుపుచ్చిన నేల యేడ్చెదవు? ఇంచుక యోర్చుకొనుము. ఎవరికిఁగాని కర్మఫల మనుభవింపక తీరునా?"

ఇట్లా ముదుసలి యచట మూర్ఛయున్న మనుజులమనములు కఱగునట్లాక్రందన మొనర్చుచుండె. అంతశ్శత్రువుల నడఁపఁజాలక యనారతం బలమటించు ననదలకు నిజద్యుతిచందనంబున నుపశాంతి నొనరించువాఁడును, సంసారాబ్ధి సంచరించుకతమున నాయాసచలితులైన సాధుజనుల నిజసూక్తిసుధాసేచనంబున నోలించువాఁడును, అనాథబంధువును, అపారకృపాసముద్రుఁడు నగు జినభగవానుఁ డచ్చోట నాసమయమున నావిర్భవించె. పదఁపడి యాపుణ్యమూర్తి రోగమునరొల్లు నా రోఁతగొట్టునెడల నుల్లము పల్లవింప నతనిఁ దెవులుఁ దీర్చుఁదలఁపునఁ బ్రియముతోఁ జేరఁదీసి మేనెల్ల నిమిరెను. కరుణాపయోధి యగునా భగవానుని కరస్పర్శమాత్రమున నతఁడు వెక్కసం బగు వెతను వీడి చయ్యన సౌఖ్య మొందెను. సర్వావములగు సజ్జనవరేణ్యుల సంగడము సంకటంబుల నన్నగిలఁ జేసి సంతసంబును సంతరించుఁగాదా!

చందనుఁ డట్లు సాక్షాత్కరించిన జినేంద్ర భగవానుని సందర్శించినంతనె వేవేగ నచ్చటికిఁ జనుదెంచి, నెన్నుదురుపుడమిసోఁక నతని యడుగుఁదామరల కెరఁగి భక్తితాత్పర్యములు పెనఁగొనఁ బరిచర్య లొనరించె. అంతట జినేంద్రుఁడు ప్రియమెలర్ప నిరుకేల నతని గ్రుచ్చియెత్తి యిట్లనియె.

కుమారా! 'దేహి' యని నీయున్న యెడకేతెంచిన యాదీనునికోర్కెఁ దియ్యని మాటలఁ దీర్పవలసియుండఁ గరుణమాలి యెంతయు నకార్యమొనరించితివి. ఇట్టికొద్ది కానియెడ నీ డెందమేలఁ గూర్మిఁ గురియదయ్యె. సాధుజనులు సకలసత్త్వములయెడ సాశతముఁ జూపుదురు. నిష్కారణవైరమూని తమ్మేఁ గారియఁబెట్టు కట్టిడులయందైనఁ గలుచపడరు. ఈకుఱ్ఱఁ డిట్లు కుందువడుటకు ముందు పుట్టువున సలిపిన మొప్పులే మూలములని తెలియవో? ఈకష్టజన్ముఁడు తొలిపుట్టువునఁ గక్కుర్తికాఁడై యొక్కొక బళమైన నోరుల కొసఁగని కతంబున నిప్పుడిట్లు వెక్కసంబులగు వెతలఁగుందుచుఁ గుడువఁగూడైన లేక యలమటింపవలసినవాఁ డయ్యె. "పెట్టనివారికిఁ బుట్టని దేసాక్షి" యను నానుడి వినవో? ఇతఁడు మఱి యెవం డని తలంచితివో! నీతండ్రి యగునందుఁడే సుమా!



మునిపుట్టువున నీతఁ డెంతటి మొఱకు[ఁడు]గనున్న నంతకు ముందు జన్మమున ముక్తినాశించి మువ్వున సువర్ణదాన మొసఁగె. అది కారణంబుగ వెనుకటిపుట్టువున విత్తవంతుఁ డయ్యె. చావుతఱి సద్గతిఁగాంక్షించి దానము సలుపు వాని కనంతరజన్మమున ననుభవము లేనియర్థము ప్రాప్తమగునని ప్రాఁబల్కులు పలికెడి. లోభంబునకు లోనైనవారు పరోపకారార్థమొక్కింతయేని ద్రవ్యము వ్యయపఱుప నిష్టపడకయుండి తరువాతఁ దమచెయ్వుల కతంబునఁ దల్లడిల్లెదరు.

జినేంద్రభగవానుఁ డీవిధముగ వాక్రుచ్చి ప్రియముతో నాచందనునకు దోసములఁ గడవఁబెట్టంజాలు నాచారముల నుపదేశించి యంతర్ధానమొందె.

కనుక నెవరికిఁగాని నిజధనసమృద్ధిఁ దలచి దర్పమూనుట తగదు. దానభోగంబులకు దవ్వులనుండు ద్రవ్యము మిక్కిలి దుఃఖప్రదం బనియె యెంచనగును.

ఇది కౌండిన్యగోత్ర పవిత్ర
గొల్లపూడి - శ్రీరామశాస్త్రి ప్రణీతమైన
దర్పదళన మను గ్రంథమున ధనవిచారమను
ద్వితీయ పరిచ్ఛేదము.

# దర్పదళనము

## విద్యావిచారము - తృతీయపరిచ్ఛేదము.

---

### విద్యావిచారము.

ఉ. జానుగ భూతికిం దొడవు
సజ్జనభావము; శౌర్యలక్ష్మికిన్
మానము; నీతి విద్యకు; శ
మంబు సుబుద్ధికి; విత్తవృద్ధికిన్
దానము; దాల్మి శక్తికిని;
ధర్మనిరూఢి కదంభవృత్తియుం;
బూనికతోడ సర్వగుణ
భూషణ మెన్నఁగ శీలమే సుమీ.

[భర్తృహరి]

జ్ఞానదాయకం బగువిద్య గరువమునకుఁ గారణమ య్యేనేని మబ్బుమాటున నున్నవే వెలుఁగుచాయచంద మున నయ్యది యప్రకాశంబునకే నెపమగుఁ గదా! అలవాటుచొప్పున మఱుపుగఁ బక్షులనయితము పలుకు చుండఁ శరీరముఁ జంపుకొని చదివినచదువుఁగని మనుజుఁ





డేల మిన్నుఁ జూడవలయు? విద్యకలిమికి వినయమును, కలి మి బలిమికి నీగియు, మతివిశేషమునకు మంచినడవడియు ఫలములై తనరు. విద్దెకలవాఁడె సుద్దములేక చులకనకుఁ జోలయ్యేనేని యెగుడుదిగు డగునెడఁద గలయాపండిత మూర్ఖునకుఁ బదివేలవందనములు. చదువు నేర్చియు మలి నత మాసినమనసు గలవాఁ డయ్యేనేని, జలకమాడియు దుమ్ముఁ బైఁజల్లుకొను మదపుటేనుంగుఁబోలిన మతిహీ నుఁడె యనందగినవాఁడు.

బిడియమున సంసారిణివలె వినయమున విద్దె విలసి ల్లుటయుఁ బిసినితనమున సిరివలెఁ గనుకుట్టుఁదనమున నయ్యది యణఁగుచుండుటయు నలవడుచుండును. మంచి గానములు మచ్చరులపేరి శోధకులవలన శుద్ధిఁగావింపఁ బడి తేఁడులయొడ్డోలగంబులఁ బరీక్షింపఁబడకమున్న పవి త్రములై పొగడికకుఁ బాత్రములైనట్టులు, మహారాజుల యాస్థానములపేరి యంగడుల నమర్పనంతవఱకె చదు వు సంతసముఁ గొల్పునదియై గొప్పతనమునకు గుఱియ గుచుండును.

కవిగాయకు లడియాసమెయి సకలాలంకారశోభిత మైన పలుకుఁ జేడియను బనుపుఁజెలినిఁబోలెఁ బరసంతో షైకప్రయోజనగఁ బచరించుట యెంతయుఁ బలుచఁదన

ము. పలుకనేర్చిన పండితులు కుతర్కంబులం గుత్సితము లయిన తమజాణతనంపుంబలుకులం జేసి ధర్మాధర్మములం దాఱుమాఱు గావించుచున్నవారుకదా! పడివాదమునం బేరుమ్రోగిన తార్కికులు సాధుతేజముల సమయించుం దలంపునం గటికవారి వాండికటారులపగిది దమపరుసంపుం బలుకులం బఱపుచుండుటయుం దెల్లము. చదువులయ్యాలె తమనడవడినిం జక్కంబఱచుకొననేరక యీసుపెంపునం బాడిందప్పి "సర్వంనాస్తి" యనెడి మతమును నెలకొల్పువా రగుదురేని యట్టివైషమ్యకారిణి యగునావిద్యవలన వారి కుపయోగ మేమి? పెఱలపెద్దఱికంబు తనడెందమున శల్యమై దందడిపెట్టుచుండ, నిజగుణస్తవమున నొరుల గుణములం గప్పిపుచ్చి, ఉడుగని మచ్చరంబున నిచ్చలు గాటంపుటూర్పులెసంగం గెంపారినకనులు గలవా రగు చదువరులచదువు, కోడెత్రాంచుల తలలలోని మానికంబులవలె మనుజులమనముల మల్లడిం గొనంజేయుంగాదా? ఈరసంబునం గ్రాగి యహంకారమున హతమైనవిద్దె యాయుస్సుతోనె యడుగంటు నని యార్యులనియెదరు.

తొల్లి రైభ్యభరద్వాజు లనునిరువురు నిరాబారు లొక్కవనమున నొద్దికతో వాసము చేయుచుండిరి. అందు





రైభ్యునకు విద్యావివేకసంపన్నులైన యిరువురుకొడుకులును, భరద్వాజునకు యవక్రీతుండను నొకతనయుండు నుండిరి. తల్లిదండ్రులగారాబమునం బెరిగిన బిడ్డలు తఱుచుగం జదువుసంధ్యలు మాని రాలుంగాయలుగ నుండుటయె వాడుక కదా! విద్వాంసులైనరైభ్యపుత్త్రుల కబ్బు గారవముంగాంచి, విద్యావిహీనుండౌభారద్వాజుం డీర్ష్యాళువై, చదువుల నెల్లనసాధించి గారవంబున వారిని మించవలయు ననుపట్టుదలతో, గంగాతీరమున కరిగి యింద్రునింగూర్చి యుగ్రపుందపము సలుపసాగె. దేవరా జీతని తపస్సును మనస్సున మెచ్చుకొనక యడ్డుపెట్టందలంచి యతని కగపడి యిట్లనియె.

"ఓయీ! ఇట్లేల వ్యర్థపుం దపమునం దనువుసొంపెల్లం బొలివోవంజూచెదు? ఒజ్జలపజ్జ నలవఱచుకొనక చదువులెట్టిండులకైన సాధ్యము లగునే? సర్వజ్ఞుండగు కృష్ణపరమాత్మయు సాందీపనియొద్దం జదువుకొనె నని వినమా? గురుముఖంబున నభ్యసింపక విద్యం బడయ గోరుట యాకాశపుష్పముం దలందాల్ప నుంకించుటని తెలియవో? అని నుడివి వెండియు నిట్లనియె.

కుమారా! విద్యాభ్యాసమున కర్హ మగుబాల్యము చనినపిదప, నిష్ప్రయోజనంబగు నీకీపట్టుదలవలని యువ

యోగమేమి ? నీవిత్తఱి బెఱితలంపుల డిగనాడి విద్యాఫలంబులయెడఁ జిత్తము హత్తింపుము. శమదమాది సద్గుణంబులు గలిగియుండుటయుఁ గామక్రోధాదు లగుచెడుగుణంబులు లేకయుండుటయు విద్యాఫలంబు లని యెఱుంగుము. తాలిమిలేని పలుకుఁదీవ మచ్చరముపేరి వెచ్చనొచ్చినదై యహంకారముసేరి యశనిపాతమున నడుగాఱుచున్నయది. ఈసుకాఁ డితదులలగ్గున కెగ్గుసేయఁ దలపోసియె యగ్గలం బగువిద్దె నభ్యసింప నాయత్తపడుచుండు. సైరణపంట గలవిద్యాబీజమునుండి వివిధఫలముల నాశించి వెంగలులు వెఱ్ఱిపోకలఁ బోవుచుందురు.

సర్వవిధముల నొరులకుఁగాని, తనకుఁగాని సుంతయైన మేలొనఁగూర్పఁజాలని పొత్తముల మొత్తమున కీడగు "భారవిద్య"వలనఁ బడయఁదగిన ఫలమేమి ? నేర్పుపెంపున నెల్లవిషయముల నెగుడుదిగుడుగ నొవరింపఁజాలు "క్షుద్రవిద్య" వలనఁ జొప్పడునదేమి? ఒడ్డోలగంబులఁ బరగుణంబులనుగ్గడింపున నూఱుటఁజెందు "ధృష్టవిద్య"వలనఁ గాంచఁ దగిన దేమి? తనయాచరణమునకు దూరమై యలవాటుచొప్పున నన్యుల నలరింపఁ జేయఁజాలిన "శుకవిద్య" వలని యుపయోగ మేమి? విజ్ఞు





లయొద్ద మౌనమువహించి మొఱకులపజ్జఁ దనవాక్పటిమఁ జాటుచు, శిష్యుల కొకప్పుడైనఁ జెప్పనొప్పనియాత్మని "శరవిద్య"వలని లాభమేమి ? స్వలాభమును గోరి పరులగౌరవముఁ గప్పిపుచ్చుచు, విలుచుటకై విత్తవంతుల యొద్ద విరివిగఁ బఱపునట్టి "పణ్యవిద్య" వలని ప్రయోజన మేమి ? సంకటంబుల నవమదమొసర్చు సంసారవారిధి దాఁటింపఁజాలక, డెందమును డిందుపఱచు "మోహవిద్య"వలన ముంగలఁబడునదేమి ? పురుషార్థములనైన లెక్కింపక యవధి లేనియభ్యాసయత్నమునఁ గాయమును గాసిలఁజేయు "కష్టవిద్య" వలనఁ గనఁదగిన ఫలమేమి? వివేక వైరాగ్యముల కనువగుమతిని సాధింపఁజాలని "జడవిద్య" వలనియుపయోగ మేమి? ఆచారంపుటభిమానమునఁ బరనింద కాకరమై నర్థిలు "దంభవిద్య" వలని ఫలమేమి ? ఈసుదోసమునఁ దీరనితెవులు గల్పించి నిద్రాభంగమునకు నెప మగు"శూలవిద్య"వలనఁ జూఱఁగొనఁ దగినదేమి? పర కవితావిశేషములఁ గైకొని స్వకపోలకల్పితంబు లనిచాటునాతని "చౌరవిద్య" వలని యుపయోగమేమి? అభ్యాసాభావమున నసత్సాహరహితయై పండితపరిహాసమునకుఁ బాత్రయగుచు మొఱకొఁదనమున కాలవాలయగు "మందవిద్య" వలని ఫలమేమి? సిరిగలవాని యక్కలోభమును, కావితాలుపు విషయపాం

భయు నడగింపఁ జాలని "అలీకవిద్య" వలన నందఁగూడిన ఫలమేమి? రాజునొద్దఁజేరి మంతనంబునఁ గొండెములు చెప్పమరగి లాతుల కెగ్గొనరించునాతని "దోషవిద్య" వలనియుపయోగ మేమి? ఏకాంతమున నుత్సాహమున నుప్పతిలి సదసులలో బలిమినినైన బయల్పడని ప్రతిభాశూన్య యగు "మూకవిద్య" వలనిలాభ మేమి? శ్వానములచందమునఁ బిండార్థులై యొక్కచోఁ బడి వాదమునఁ బెనఁగువారి "వధవిద్య" వలన వాటిలుఫలం బేమి? కంఠస్థ యయ్యు సమయమున నుత్క్రమణకాలమందలి యూపిరివలె నడుకాడించు "మృతవిద్య" వలని లాభ మేమి? సాధుమృగములసమయింప సాధనమై లోభమును బెంపొందించు "లుబ్ధవిద్య" వలనిఫల [illegible]మే మంచు మాఁకుల నేమఱించుచు వేళ్లువెల్లంకులవేదుఱుఁ గలిగించు "వ్యాజవిద్య" వలని యుపయోగ మేమి?

విద్వేషమునుండి విద్వాంసుని, విషయసుఖములనుండి సన్న్యాసిని, పాపమునుండి పార్థివుని, క్రోధమునుండి విప్రుని, వారింపఁజాలు విద్యయె యుత్తమ విద్య యనఁ బఱఁగు. వెంగలులకేని వివేకముత్పాదించుటయె విద్యాగుణంబు. లాతిగుణమున నొప్పునది బ్రతుకుఁ దెరువు తెలివనియె యెంచనగును. చెవిటికి సంతునాద





ముకరణియు, అవిటికి నందక త్రైవిధమునను, శవమునకు సింగారంబువపువునను, పాలసున కబ్బినవిద్దె నిష్ఫలం బైచును. కామక్రోధములకు శీలమును, లోభమోహంబులకు విద్యయు, మదమాత్సర్యములకు మనసును లోఁబడియుండువారిమనుగడ నిష్ప్రయోజన మనియె చెప్పనగును. శరీరనాడుల సమయించు శబ్దశాస్త్రపఠనమునఁగాని, మేధస్సు నడఁగించు మీమాంసాశాస్త్రవిజ్ఞానమునఁ గాని, తత్త్వమునకు గవ్వగు తర్కశాస్త్రచర్వణమువలనఁగాని, కామోద్రేకమున కాకరం బగు కావ్యపరిశీలనంబునఁ గాని, కలుగుపరమపురుషార్థ మేమి? విచారింప సంకటంబులఁ దొలఁగించి, శాంతము నెలకొల్పుచు, సంతతసౌఖ్య మొడఁగూర్చునది వైరాగ్య మొక్కటియే యని విశద మయ్యెడి. కనుకనే 'వైరాగ్యమేవాఽభయ' మ్మని వేత్తలనుట.

వేల్పుటొడయఁ డిట్లు వివరించియు నయ్యావక్రీతుఁడు తన నియమమునుండి చలింపఁ డయ్యె. మానధనుల పంత మెప్పట్టుననైనఁ దప్పింప నశక్యము కదా! అంతట నావృద్ధశ్రవుఁడు వృద్ధబ్రాహ్మణరూపమున నేగుదెంచి, యూమునితనయున కనతిదూరమున నొక్కచోఁ గూరుచుండి యిసుకపిడికిళుల గంగాతరంగిణి సేతువుఁ గట్టఁ

దొడఁగె. పనికిమాలిన పని నుపక్రమించి యాయాసపడుచున్న యావృద్ధు నవలోకించి, పక్కున నగియు నాయవక్రీతుఁడు మనసున జాలిపొడమ నతనిడాసి యి ట్లనియె.

బ్రాహ్మణోత్తమా! నిష్ఫలం బగునిట్టిపనికి సమకట్టి యేల యిడుమ్మలపా లయ్యెదవు? తెలిసినవారు ఫలశూన్య మగు కర్జమున కాయత్తపడ రని విందు. అడ్డుపడిన పర్వతరాజముల సయితము మూఁచముట్టుగఁ గూలఁద్రోయు నీయేటివరద కిసుకముష్టుల వంతెనఁ గట్టవచ్చిన నిన్నేమనఁగవచ్చు? ఇంతటనైన నీవెఱ్ఱిమాని మరలి పొమ్ము.

నావుడు దరహసితము తనమోమునకుఁ దొడవు గాఁగ నాపుడమిసురుఁ డల్లన నిట్టు లనియె. "ఓయీ! 'పరోపదేశకాలే తు సర్వే వ్యాససమా నరాః' అనునుడి నీవంటి బుద్ధిమంతులఁబట్టియె వచ్చినదని తలఁచెద. నీపరోపదేశపాండిత్య మరయ నాకెంతయు నబ్బుర మయ్యెడి. గురువులేక విద్యల సాధింపఁ జలముఁబూనిన నీవంటివానికిని నన్నుఁ జూచిన నవ్వు వచ్చుచున్నది కాఁబోలు! "గురువు లేక విద్య గుఱుతుగా దొఱకదు, అజునికైన వానియబ్బకైన" అని యితరులు





చెప్పనప్పుడైన వినలేదో! బుద్ధిమంతుఁడా! ఇంతటనైన నాత్మదోష మెఱిఁగి యీకర్జము మానుము."

దిట్టతనము గ్రక్కదలించు నావృద్ధుని పలుకువరుస నాకర్ణించి నిరుత్తరుం డయ్యు, ఆమునిపుత్త్రుఁడు మీఱిన పంతమునఁ దన సంకల్పమునుండి చలింపఁ డయ్యె. అంత నాముబ్బురవుతు యవక్రీతుని మాననిమనోనిశ్చయమునకు మనమున సమ్మతించి, యతని యభిమత మనుగ్రహించి మఱుఁగువడియె.

చదువులసరస్వతియైనయాజడదారితనయుఁడు సంతసంబున నిజాశ్రమంబునకుఁ జనుదెంచి, జాణతనము మెఱయ జరిగినసమాచారమును జనకునకు విన్నవించె. భరద్వాజుఁడు పుత్త్రునివిద్యాప్రాప్తి కంతరంగమున నలరియు, అతనిప్రల్లదనముఁ గాంచి కంటగిలి ఖిన్నచిత్తుఁడువోలె విన్నఁదనముదోఁపఁ గ్రన్నన ని ట్లనియె.

"కుమారా! 'తపోబలంబునఁ జదువుల సాధించితి' నని పంతమునఁ బలుకుచుంటివి; కాని యీపథము హితకరము గానిదగుట మిక్కిలి వగచెద. కోపనుఁడైన రైభ్యునికొడుకులు క్రొవ్వఁగొని యున్నవారు. అభినవపండితుఁడ వయిననీవు వారున్నయెడ కేగితివేని మెప్పులఁ జొప్పడఁజేయు కలహము సంప[illegible]

శ్రోత్రపండితుఁడు శ్రావ్యమై నోరులయుత్కర్ష చెవిఁ బడినంతనె శిరఃకంపనముఁ జేయు. తలతిక్కమెయిఁ దత్త్వమును దాఁటుమాటుగఁ దలఁచి, సదస్సులఁ గయ్యమునకుఁ గాలుద్రవ్వుచుండు. చిత్తమునఁ గోపాగ్ని యెడపక కనలుచుండుటచే, విడువక వేఁడినిట్టూర్పుల వెడలించుచుండు. తీవ్రజ్వరితునకుంబలె నూతనపండితున కుద్భవించువికార మెంతయు వైషమ్యకరము అట్లగుట నీవు రైభ్యాశ్రమంబునకుం జని యతని పుత్త్రులతోడ శాస్త్రవాదము సలుప సమకట్టితివేని, ఆమునివలనఁ గీడువాటిల్లుటం దలంపుము. ప్రకారాంతరంబున విద్యాలాభమును బడసి యిట్టి విపత్తునకు గుఱియగుదు వేమోయనియు నామనము శంకాకులిత మయ్యెడి. నా పలుకులఁ బెడచెవి నిడక యెల్లెడల శాంతచిత్తుఁడవై మెలఁగుము".

ఇట్లాయవక్రీతుఁడు పెక్కురీతుల బోధింపఁబడియు నడపదడప రైభ్యుని పర్ణశాల కరుగుటయు, అతనిపుత్త్రులతోడ శాస్త్రవాదముల సలిపి వారిం బరాభవించుచుండుటయు మానినవాఁడు కాఁడు. రైభ్యతనయు లొక్కతఱి యవక్రీతుఁడొనరించు నత్యాచారమునకు మనసుల వగచి రోసపుటుసకమున వేఁడిచూపుల నాలునిప్పులు కన్నులుగాన గబ్బితనమునఁ గాఱులు పలుకునతనిఁ గాంచి





యిట్లనిరి. "ఓయీ! ప్రాయమున నేమి? పాండిత్యమున నేమి? కొండికవాఁడ వయ్యు సమ్మానింపఁదగినయమ్ముల, గూళతనమునసరకుగొనక సారెసారెకు జగడము లాడుచున్నాఁడవు. ఈ యకార్యకరణంబున నీకాయువు నశించుట సత్యము." ఆమును లిట్లు వక్కాణింప నామాటలీఁటె లగుచు వీనుల నాటుకొన నాతఁడు రెట్టించినరోషమునఁ దనవెంగలితనము విడువఁడయ్యె. పొగరుఁబోతు లెదుటివారి తెలివితేటలఁ గాని, కోపతాపంబులఁ గాని లెక్కసేయరుకదా!

ఇట్లుండఁ గ్రమ్మరుచుండు కొదమతేఁటుల చాలునకిడగుచిగురుఁబోఁడుల భూరివిలాసములకుఁ గారణమైన వసంతకాల మేతెంచె. పత్త్రములఁ ద్రోయుచు సుమనస్సుల రజస్సునఁ గనుఁగవలఁ గలుషితంబులఁ గావించు మందమారుతము విద్వేషులైనపండితులవిధమున విహరింపసాగె. కోయిలగుంపునకుఁ గవిమండలికిఁబోలెఁ దేనె లొలుకు తియ్యనిపలుకులఁ బంత మేర్పడెను.

అట్టితఱి నొక్కనాఁ డాయవక్రీతుఁడు రైభ్యుని యుటజమునకుఁ బోవునప్పటి కాజడదారిరాయఁడు కొడుకులఁగూడి స్నానార్థము సరిత్తటమునకుఁ జనియె. అపుడతనికోడలు, వలరాజురాణిని రచ్చకీడ్వఁజాలుతాని

గలసు ప్రభ యనునామె, పర్ణశాలదాపున నడయాడుచు లేములకనుంగవయొయ్యారము నభ్యసించుచున్నదా! యనిపేర్తుకు లనుకొనున ట్లోరచూపులఁ బచరించుచుఁ బువ్వులఁ గోయుచుండె. యవక్రీతుఁ డాయొప్పులాడి నవలోకించి యొయ్యన డాసి యామెయందమున కంతరంగమున నబ్బురపడుచు, ఱివ్వఱివ్వన మరుండుఱువ్వఁ బువ్వటమ్ముల నెమ్మనంబు సొమ్మసిల మేరమీఱి కొంకుకొసరించుకయు లేక యాకులకాంతతోడఁ దనకోర్కె నిట్లు చెప్పఁ దొడఁగె.

“పూవుబోఁడీ! పువ్విల్తున కనువయి, దర్శనమాత్రమునఁ దల్లడపెట్టు నీచెలువము చిరకాలపరిచితము పోలె నాచిత్తమును జందిలిపాటుఁ జెందించుచున్నయది. కులగౌరవముఁ గూలఁ ద్రోసి, చదువుసంధ్యల సరకు గొనక, పెద్దలపెన్గోపమునకుఁ బిఱుతివియక నాయెద నీయెడఁ దగులుకొనుటఁ దలఁప, ముందువుట్టువుపేర్మి ముడిరె యిందులకుఁ గతమని యెంచెద. ఈచిలిపితనమున నయ్యోడు చెట్ట తొట్టతొదుటఁ బొడఁగట్టుచున్నను, మది జనించినయభిలాష మఱపఁజాల కున్నవాఁడ. మరునిబారిఁ బడినమనసు మఱలింప, నిత్తముగాని విద్దెగాని వర్తనముగాని మఱేవిధముగాని సమ





ర్థము గాఁజాల దనుట నీవెఱుంగని యంశముగాదు.”

అనుడు సగ్గలం బగునడలున నొడ లదరిపడుచుండెఁ బర్ణశాలకుఁ బోవ నుద్యుక్త యగునాతలిరుబోఁడినిఁ దారసించి యతఁ డామెపైఁటకొంగును బట్టుకొనెను. మదవుటేనుంగునకుఁ జిక్కినయనఁటిబోదెమాడ్కి నిర్జనస్థలంబున మత్తుఁ డగునాయవక్రీతు బారిపడిన యాకోమలాంగి నిలువున నీఱయ్యె, నెమ్మనంబున నిబ్బరమూని చేసన్న నతని చెయ్దము వారించుచు నిట్లు చీకొట్టఁగడఁగె.

“విడు విడువుము. పొచ్చెము లేనినీపుట్టువునకుం బలుసొచ్చె మగునాశీలమునకును సొద్దు తేకుము. పలుబామలఁబడి పొందినవిద్య కీయుక్కివ మొప్పునేమో యొకించుక యోర్పుఁబూని యోజించుకొనుము. శీలవసనము నవ్వులజ్జ నిల్లాలినిఁ బోలె విడనాఁడి, పాణిచే బరకాంతలపయ్యెఁటకొంగుఁ బట్ట నీకుం బాడియే! అల్లదే చూడుమా! నిజముగా నాకమండలువును నీచెడుతలంపెఱిఁగి చిత్తముత్తలపాటుఁ జెందుటంజేసి కానోపు నబ్బురంబున కోయన నెత్తుమొదగల్గి యెట్లు చూచుచున్నదో! ఓయీ! దీనిఁ దిలకించితివా? ఈనీ కర్షముంగన్ను సిగ్గున మోముపంచి యీ నీ జపమాలసయితము [illegible] కాంబోలు నేలఁగూలినది. పలుకుఁ జేడియ [illegible]

బల్కులఁ బవిత్ర మగుపండితునినోట నిట్టి చెడుపలుకు రాఁ జెల్లునా ? తన్నుఁజెందిన యెట్టివారలకైనఁ గన్నతల్లి వలె హితముఁగఱపు నీ తపోవనంబును నీ కిట్టికూళతన మెట్లు కూర్చెనోకదా ! ఎగసిపాటున కిక్క యగుఁగూరావనము తత్తడికరణి శిథిలాత్మకుని సర్వవిధముల నధోగతి పాల్సేయునని మది నరయుము. చెడుత్రోవఁబట్టెన చిత్తమును ద్రిప్పఁ జాలనిచదు వేమిచదువు? అన్నిఁట మంచి చెడుగుల నరయఁజాలు మేటిచదువరితన మెక్కడ ? అకార్యముల కాటపట్టగు మొఱకుఁదన మెక్కడ ?

ఇట్లు చిలుకకుఁ జెప్పిన ట్లెంతచెప్పిన న్వెడచెవి నిడి యాచెనఁటి, తనచేతలఁ జాలింపమింజేసి యాచిలుకల కొలికి చింతాక్రాంతయై యెట్లైనఁ దనశీలముఁ గాపాడు కొన నెంచి తన చిత్తమున నిట్లు చింతించె. "ఇపుడు వాటిలిన యీయిఱుకుమడినుండి తప్పించుకొని ధన్య నగుటకుం దగిన దారి కనఁబడదు. ఒంటరిగ నీతుంటరికిఁ జిక్కితి. తుంటవిల్తుఁదూపులఁ దుంటుదుకుఁ జెందినవాఁ డెట్టిదంటనైనఁ జేయఁ దలఁకఁడుకదా ! వలపుకాండ్ర మలపుటకుఁ జల్లనిమాటలే చాలినవి." అని తలఁచి యాతెలివికత్తె యాతిరుగుఁబోతుం దెరలఁ జేయఁదనవిన్నాణమ్ము మీఱఁ దిన్నని పలుకుల నిట్లు విన్నవించె.





"ఓయీ ! ఇత్తఱి నీచిత్తమున హత్తిన పొక్క డగు మక్కువ నిక్కమొకో" యని యెద నరయఁదలఁచి యింతవఱ కెక్కసక్కెము లాడితి. సందియము డిందుపడియె. జలకమాడఁ గొడుకులతోడ నదికరిగిన మామామ మగిడి వచ్చువేళ యైనది. మంతనంబున మనమిట్లు మాటాడుచుంటిమేని మచ్చరీఁ డగునతనివలన మాటవచ్చును. ఇంక నిచట నొక్క నిముస మైన నిలువక యిలు సేరుము. నీ యెడఁబాటున కిచ్చగింపవలసి వచ్చెఁగదా యని నెమ్మనంబున నెంతయు నొచ్చుకొనెదను. ఇఁకనైన నీప్రేయసియెడం బ్రేముడినిఁ బ్రిదుల నీయకుము."

ఆ మెచ్చులాఁడి యాడినయిచ్చక మంతరంగమున నిశ్చయ మనియె యెంచి యామత్తుఁడు మెత్తగిలి మగిడి పోయెను. వలపుకాండ్ర కందరానిదియైన నలుపముగనే కనఁబడునుగాదా ?

ఆవల నగ్నికల్పుఁ డగునా రైభ్యుఁ డరుగుదెంచి యగ్నిభవనముముందట నుండ, సుప్రభ సమీపించి పొక్క టగ్గిపాగచేవలెఁ గన్నుఁగవ నశ్రుకణములు రాల నుల్లమున నిండినఖేదము వెల్లివిరియ డగ్గుత్తికతో నిట్లు వాక్రుచ్చె. "మామా ! మీ రింటలేనితఱి మీనెచ్చలి

కొడుకు యవక్రీతుఁడు మచ్చరిత్తుఁడై యలుసొచ్చి యింటిపాటున నున్న నన్నొన్నియ్యానఁ దారసిల్లి యిచ్చమెయి నిశ్చకము లాడి శీలముఁ జెఱుప నిక్కచ్చిచేసె. అత్తఱి ననవ నగుసొమెులు వినువారు లేమిం జేసి యేమి చేయఁ దోఁచక యప్పటిముప్పు నెట్లైనఁ దప్పించుకొనఁ దలఁచి పలుకుదోసంబునకుఁ బొల్పడి యాపందపలుకుల కనుగుణంబుగఁ బలికి పనిచితి."

అనుడు విపత్సూచకం బగునుల్కాపాతంబున మిటారించు మింటి తెరువరిమాడ్కి రైభ్యుఁ డాకోఁడ అఁగామి నాకర్ణించినంతనె యుగ్రుఁడై, లలాటఘటితం బైనకుటిలం పుభ్రుకుటి చూపఱు కళు కొదవింప, వల్మీకంబులోపలి మహాభుజగేంద్రుఁడు వోలె రొప్పఁ దొడఁగె. తెలిసినపెద్దలకుఁ దిన్ననయుండె తెలివితోఁచు. వల్లదప్పినచో నల్లమున నొల్లమియుఁ బుస్తకంబున విద్దెయు నుండుట సాజముగదా!

అంతట నాముని యగ్గలం బగు దాపజ్వరంబునం బలెఁ గనుగవ జేవురించి జడలాపాదమస్తకము వణఁకుచుండ 'అన్నన్నా! పాపి భరద్వాజుండు కొడుకునకుఁ బరకాంతల భంగపఱుచు చదువుఁ జదివించెఁగా భళోభళి,' అని పదపడి [illegible] కోపమున నొక వ్రాలవెన్త





లకుండుటం జేసి యప్పుడె మారణక్రియఁ జేయఁబూని యగ్నిసదనముఁ జొచ్చెను. అతఁడు మించిన రోసమున వెచ్చనూర్చుచు రాఁజిన నిప్పువలె విరాజిల్లు నొక జటను ద్రెంపి, కనలుసింగపుజూలననొప్పు నద్దాని నగ్గియందుంచెను. ఉంచినదే తడవుగ నందుండి యొకయందకత్తె యావిర్భవించె. అట్టులె మఱియొక జటం బెఱికి హోమముఁగావింప, ముమ్మొనవాలుఁదాల్పగు నొక్కరక్కసుం డుద్భవించె. అట్లుపుట్టిన యాపొలసుదిండు లిరువు రమ్మునీంద్రుముందట నిలువఁబడి యంజలిఘటియించి "మాకు ముదలయేమి? ఎవ్వని సమయించుటకు మమ్ముల సృజించితిరి? మీయాసెల వయ్యేనేని ముజ్జగంబులనైన బూదిగావింప సంసిద్ధుల" మనుడు "మీ రిప్పుడె పోయి పాలసుం డగునా భారద్వాజు భస్మముఁ గావించి రండు" అని యాముని యానతిచ్చెను.

•

ముస్ముందు నా పొలంతుక మునిపుత్త్రునికడకేగి వలపుఁబలుకుల నాతనిని వలలోఁ వైచుకొని కయిలాటమున నతనికరమునను్ండు కమండలువుఁ గయికొనెను. పిమ్మట నారక్కసుఁ డమగులిడుట సవని యుదిరపడ నరిగి యపవిత్రుఁ డగు నా యవక్రీతు నొడిసిపట్టఁ జంకించె. అతఁ డది కని నివ్వెఱపోయి యయ్యాదనల

నసువులఁ గాచుకొన నాదరువులేక యాలమటించుచుఁ బఱువులువాఱి జనకుని పర్ణశాలం బ్రవేశించునంతలో నాగృహపాలకుఁ డపరిశుద్ధుఁ డగునతని నడ్డగించె. వెన్నంటి వచ్చునాదానవుఁ డత్తఱిఁ దడవులేకయె యతనిఁ దారసిల్లి యీఁటెపోటున నసువుల హరించి చనియె.

ఆవల భరద్వాజుఁ డేతెంచి చెన్నుతఱిఁగియుండు నిజాశ్రమముఁ జేరఁబోవుచుఁ "బ్రతిదిన మేను బత్రపుష్పాదులఁ గొని పఱతెంచునంతకుఁ బ్రజ్వరిల్లు నగ్నులు నేఁడు నిశ్చలములై కాంతిఁ బాసియుంటఁ గతమే మైయుండు" నని సంశయించుచు నురియాడు చిత్తమున నాశ్రమము డాసె. అతని సందియంబునకు సూటిగఁ బర్ణశాలపజ్జఁ గొడుకుశవము పడియుండె. అతఁ డది కనినంతనె యదిరిపడి మొదలునఱికిన మానువలె మేదినిఁగూలి మూర్ఛిల్లె. తరువాతఁ గొంతవడికిఁ దెప్పఱిలి జరిగినవృత్తాంతమును దాసునివలన నాలించి, అశ్రుపూరము గనుఁగవలోఁ గ్రొంగిగొనుచు డగ్గుత్తిక నిట్లు పలికె. "బిడ్డా! సాకతముమీఱ సంరక్షింపఁబడుచుండియు సదోషమై వినాశోన్ముఖం బగుశరీరము విడిచి యుండనియట్లు నిన్విడిచి నిముసమాత్రమేని నిలు





వఁజాల, కఠోరహృదయుఁ డగునా రైభ్యుఁడును గాలాంతరంబునఁ గొడుకుకతముననె కాలగతి నొందుఁగాక." అనుచుఁ బుత్త్రశోకముం బట్టఁజాలక యతనిచితిలోనె చొచ్చెను. కాటిలో నున్నవారినైనఁ గడుపుపొక్కఁ గాసిలఁజేయుఁ గాదా!

పిమ్మటఁ గొంతకాలము చనుడు రైభ్యునిపుత్త్రులగు నర్వావసుపరావసులు బృహద్ద్యుమ్నుఁ డనునొడయఁ డొనరించుయాగమున యాజకులుగ నియమింపఁబడి యాతని మన్ననలనొందుచు నతని జన్నమును జేయించుచుండిరి. ఒకపరి పరావసువు సంజచీఁకటివేళ నడవిత్రోవ నాశ్రమంబున కరుగుచుఁ బులిచర్మముఁ గప్పుకొని పొదలపొంతఁ బఱతెంచు జనకునిఁగాంచి, శార్దూల మని శంకించి, సంకోచింపక చేతనున్న బడియచే నతనితలపైఁ బాదెను. తత్క్షణమె యాతాపసి తనయునిఁ దలఁచుకొనుచుఁ బ్రాణములఁ బాసె. ఆవలఁ బరావసువు నిజమెఱిఁగి తనతొందఱపాటునకుఁ గుందుచుఁ దండ్రి కళేబరమున కగ్ని దరికొల్పి, పాపశంకితుఁడై మగిడి వేవేగ మన్నకడకరిగి యావద్వృత్తాంతమును విన్నవించె. అర్వావసువు పితృమరణమునకుఁ బెల్లుగఁ బరితపించి యనుజన్ము ననునయించుచు నిట్లనియె.

"వత్సా! వగవకుము. దుర్వారమగు విధిచేతకు నడ్డపడ నేరికి వశము? దైవము ప్రతికూలం బైనచో మనుజుని జతనము తాఱుమాఱు అగుట తథ్యము. పరాకున నీ వొనర్చిన యీదోసఁగును బ్రాచితంబునఁ బోఁగొట్టుకొన నగును. నీకై నేనె యీకొలపాతకముఁ బాపఁగల వ్రతము సలిపి వచ్చెద. నీ విచటనుండియె యీయెకిమీని జన్నమును దిన్నఁగఁ జేయించుచుండుము." అని నుడివి యతనివీడ్కొని యాయర్వావసువు తమ్మునకుఁదొడరిన దోసముఁ దొలఁగింపఁ గల వ్రతముఁబట్టి యెల్లతీర్థములఁ గ్రుమ్మరుచుఁ గొలఁదికాలంబునకె నేమము నిర్వర్తించి తేనియజ్ఞశాలకుఁ జనుదెంచుచుండె. దోసకారి యగునాపరావసువు తవ్వులనుండియె యన్నను దిలకించి తనడెందమున నిట్లు తలపోసె.

"యాగము ముగియ నున్నది. పార్థివుఁడునాకొసఁగు పసదనంబునఁ బంచుకొనుట కై మా యన్న క్రన్నన నేతెంచెడి. నాదురదృష్టదేవత గాకపోయిన నిన్నాళ్లనుండి యెన్నియేని నోములనోఁచుచు నన్నెన్నియో యిక్కట్టులఁ జిక్కుకొనియుఁ జెక్కుచెదరకుండ నిట్లేతఁ దుసురుల మసలు లేమి?"





అని కొంతవడి వగచి తలపంకించి 'దైవము నాపాలిటఁ నుండవలయుఁగాక యిప్పటికిమాత్రము మునిఁగిపోయిన దేమి?' అని యూచలపాడి పరసర సార్వభౌముని కడకుఁబోయి "ధరణీశ్వరా! తండ్రినిజంపిన తలకొట్లమారి యగునాతోఁబుట్టువు నిశ్శంకముగ యాగశాలం బ్రవేశింప నున్నవాఁడు. తడవులేకయె యతని దవ్వులఁ దఱిమివేయుట శ్రేయస్కరము" అని వాక్రుచ్చె. ఆకల్లరిఁ డాడినపొల్లుపలుకుల నాహా జల్లమున నమ్మియే నేఁ మెఱుఁగని యాయర్వావసుని నెట్టన నిట్టకు రాసిక నెట్టించె. పుడమిపాలుఁడు పుట్టుగ్రుడ్డులపగిదిఁ దమ తలఁ దాకునదియైనఁ దలపోయక సంతతము పరులమాటలఁ బట్టియె పోవుచుఁ బిమ్మటఁ బెల్లుగఁ బల్లటించెదరు.

దుండగీఁ డగుతనసోదరుఁడు నిష్కారణ వైరమూని తన్నట్లు నెట్టించినను, స్వచ్ఛహృదయుఁ డగునాయర్వావసు వావంతయేని డెందమున మ్రందఁ డయ్యె. విపర్యయంబులకు దైవంబె కారణం బనియెంచి సజ్జనులు స్థైరణం బూనుదురు. తనసైదోడొనర్చిన యపకృతిని సుంతయైన మనసునఁ బెట్టనియామునితనయుని యెడ జన్నమున కేతెంచిన విబుధవరులు సంతసించి నెసరునెక్కొన నతని కిట్లనిరి.

"సజ్జనవరేణ్యా! నీతాలిమి కెంతయు నంతరంగ ములమెచ్చితిమి. మామనసుల నానందవార్ధి నోలలా డించిన నీ కెందు మే లొనఁగూడుఁగాక. మదిఁ మెచ్చినవర మడుగుము." అనవుడు నామునిపుత్త్రుఁ డా తెఱఁగంటి దొరలకెరఁగి వినయముదోఁప నిట్లనియె.

"దేవవరులారా! అక్కటికమునకాకరంబులరైన మీరలు కనికరించి వర మనుగ్రహింపెద మని పలికితిరి. ఈనాకోర్కెఁ గొనసాగింపుఁడు. నా జనకుని కనుఁ లుగ్గిచేఁ గసిమసంగిన యవక్రీతుఁడు తనకైనకీడు తలఁ పునకు రాకయుండఁ దండ్రితోడ నసువులఁ బడయుఁ గాక. పరావసుకతంబునఁ బ్రాణములఁ బాసిన మత్పి తయుఁ గొడుకుఁగీడుచేత రోయనివాఁడై జీవముల నొం దుఁగాక.' నావుడుఁ జదలకాఁపులు 'తథా' స్తని నుడివిచ నిరి అప్పుడె యవక్రీతభరద్వాజరైభ్యులు సజీవు లైరి.

ఇట్లడవికాఁపులు సయితము మిట్టిపాటున విద్యా వివేకములు రిత్తలగుడుఁ గామక్రోధవశులై వంతలనొంది యుండఁ బసిఁడిమదమున మాసిన విద్యయెవ్వనికి శాంతి మొనఁగూర్పఁ జాలు? చదువరులు కోపతాపముల విడిచి సర్వవిధముల శాంతచిత్తు లగుట కాయత్తపడ





లయి. కనలుపెంపునఁ గలఁకఁబాఱి, బింకముపేర్మిఁ బొంకము చెడినకనులు గల కబోదులకు విద్యాదీపము వెలుఁగు నిచ్చుట కలలోనివార్త. సత్పురుషుల కలోభం బె పెంపగు విత్తము. హింసలేమియె తరమగు తపము. మోసములేమియె మేటియగుచదువు. *సోఁకుటొజ్జ విద్దె పాలసులఁ గాచుటయందె పంతమూని పసఁజెడ్డి చనె. ◆ వేల్పుటొజ్జకొడుకగుకచుని చదువు నెపమున నిష్ఫలంబై యొప్పె. స్వచ్ఛహృదయులును శాంతమన స్కులు నగు సజ్జనవరేణ్యుల డెందమును నీరసము పేరివిసమున నొప్పకలిసర్పము డాయ వెఱచు.

ఇది కౌండిన్యగోత్ర పవిత్ర
గొల్లపూడి శ్రీరామశాస్త్రి ప్రణీతమైన
దర్పదళనమున విద్యావిచార మను
తృతీయపరిచ్ఛేదము.

* మహామహిమోపేతుఁ డగుశుక్రాచార్యుఁడు సర్వశాస్త్ర పారంగతుఁ డయ్యు భోగభాగ్యములఁగోరి దుష్టచరితు లగుదానవుల నాశ్రయించి యుండుటచే నాతనివిద్య ఫలశూన్య యయ్యె.

◆ బృహస్పతిపుత్త్రుఁ డగుకచుఁడు దేవతలప్రార్థన మంగీకరించి శుక్రాచార్యునికడ శిష్యుడుగఁ జేరెను. అతని భక్తితాత్పర్యములకు మెచ్చి శుక్రుఁడు మృతసంజీవనీవిద్య నుపదేశించెను. ఇట్లుండ శుక్ర పుత్త్రిక యగుదేవయాని కచుని మోహించి విఫలమనోరథయై నీవిద్య నిష్ఫల యగుఁగా కని శపించె. (భారతము. ఆది. 3 ఆ.)

# దర్పదళనము.

## రూపవిచారము - చతుర్థపరిచ్ఛేదము.

—(—)—

### రూ ప వి చా ర ము.

చ. అనుదినముఁ గ్షీణించుఁ బర
మాయువు సూర్యుని రాకపోకలన్,
ఘనబహుకార్యభారములఁ
గాలము పోవుట గానరాదు, సం
జనన జరామయంబులును
జావును జూచి భయంబులేదు, దు
ర్జనభువనంబు మోహమది
రారస విహ్వలమయ్యె నయ్యయో!
(భర్తృహరి.)

వేవెల్గుంగున విలసిల్లు తమ్ములకరణిఁ బ్రాయమునఁ బరిఢవిల్లుమనుజులు తమమవ్వము వసనంబువన్నియ చాడ్పున 'మూనాళ్లముచ్చ' టని యెఱుంగక మురియుచుండుట యవిచారమూలకము. తీర్పని చిత్తరువుచెన్నఁ బొసఁగు బుడుతనియొడలు వసంతమున దిరిసెనపువ్వు





వలెఁ బరువమున వఱలుచున్నయది. నిండుచందురుచందమున నెలప్రాయమున నలరుమోముఁదమ్మి, కాలము గడచుకొలఁది నడ్డదిడ్డముగ నలముకొన్న వెండ్రుకలఁజెన్ను దఱిఁగి శైవలదూషితం బగుపద్మంబుపగిదిఁ గనఁబడుచున్నది కదా! ధూమమునఁ జిత్తరువును, నీహారమునఁ దామరయు, అసితపక్షమునఁ జలివెలుఁగును, గ్రీష్మమున సీతువును డిందుపడువిధమున, ముసలితనమున సోయగము రూపఱుచున్నయది. నానాఁట జవసత్త్వముల నుడుపుచుఁ బడుపుచేడియఁ బోలుముదిమి జుట్టుఁబట్టుకొని నరుల రూపధన మపహరించుచుంట కన్నులఁగట్టిన ట్లగపడుచున్నయంశమేకదా! వింతవింతకర్జములఁ బొనరించు విన్నాణమున దుర్జయమై తనరారుకాలము కంటికగపడకుండ మానిసిసొంపు మాయముచేయుచున్నయది. సవేగచక్రభ్రమణంబుమాడ్కి నేమఱించుచుఁ బ్రొద్దుపోకయు నేరికిఁగాని యెఱుక పడనేరదు. నిన్నమొన్నఁటి బుడుతఁడు యువకుఁడై యంతలోనన మంచమెక్కి మడియుచుంటం గనులారఁ గాంచువారముకాదె?

మనుజుల చతుర్విధావస్థలఁ బరువంబె కరము సుఖకరము. అయ్యది పడుచుఁదనపుఁజేష్టల నష్టమయి రోగముల కాకర మయ్యెనేని సోయగంబున కింకఁ జో

ఒక్కఁడా! వనటకడలి మగ్నుఁడై నిద్రాహారములు లేమి బక్కచిక్కినతఱిఁ జెల్వము చెల్లపాలనుట కేమి సంశయము? విధివశంబునఁ జెఱఁబడి, వికలచిత్తుఁడై ధూళిధూసరితకాయమున నొప్పుసమయమున నందమే చందమున నుండునో యరయుఁడు. అల్పుల యండ నెల్లపుడు పరువులువాఱు బానిసీనిరూపము నెట్లు నిరూపింపవచ్చు? గ్రహచారదోషమున మర్దితుఁడగుడుఁ బెదవులుచిఱికి పండ్లువిఱిగి ముక్కుమొగము చదరమై పిశాచరూప మేర్పడినతఱిఁ జక్కఁదనము సన్నగిలినదే కదా.

మఱియు ధైర్యస్థైర్యములుఁ దెలివి తేటలు లేనియాతని సొబగున్నను నిర్గంధకుసుమమునకంటె గౌరవ ముండునా? శంకరవాహనాదిపదములఁ బరిహసింపఁబడుచుఁ జదువరులపజ్జఁ బోతురాజువలె నాసీనుఁడగు నతని సోయగము చిత్తరువు సింగారమును బోలినదే కదా. చీలికపేలికలు జీరియాడ సిగ్గు బిడియముల దిగనాడి కంటఁబడినయాతని వెంటఁ దగిలి పండ్లిగిలించి చేతులు సాఁచుబడుగుసౌరు శవరూపమును మించినదెట్లగు?

ఘటికాంగుళులఁ దనరుదివారాత్రములపేరి కేలుఁగవ నొక్కట వయోరూపములఁ గాలుఁడు కబళించు





చుంట తలఁపునకువచ్చునెడ నెట్టిదిట్టలకైన నొడలు ఝల్లన కుండునా? మధువును మఱపించు రూపము నెడతెగక కాలషట్పద మాస్వాదించుచుండుటఁ దెలిసి దర్పంబు విడనాడు టెల్లరకు శ్రేయస్కరము.

ఒక్కతఱిఁ దెఱగంటిదొర వేల్పుగాణలగము నంగూడి కొలువు దీరియుండ నచ్చర లాటపాటలలతనిఁ గొల్చుచుండిరి. వృత్తులఁ గైశికి కరణిఁ దెఱగంటియన్నులమిన్న యగునూర్వశి చంద్రపద్మముల సఖ్యముఁ జాటు నెమ్మోమున నెగడుచుండె. ఒడ్డోలగంబున నున్న దేవత లాపువుఁబోఁడి యొయారములఁ దిలకింప నోఁచినతమకన్నుఁగవల ధన్యతమంబులుగఁ దలఁచిరి. జాణతనమున దేవరాజు నెదుట నృత్యము సలుపు నా మించుఁబోఁడి సభాసదుల కంఠహారముల వెలుఁగు రతనములఁ బ్రతిఫలించుటఁ దలంప, ఏకకాలమున నందఱ డెందముల బందిఁ గొన నెంచె నా యనుపగిదిఁ జూపట్టుచుండె. అంచ లాయంచయాన నడల కళుకుఁ జెంది దేవవిమానముల డాఁగినవి. ఆయెమ్మెలాఁడిబెళుకుఁజూపుల కులికి పిఱికిమెకము జింకతాలుపు నండఁ జేరె. నట్టువసలుపు పట్టున నాకులుకులాఁడి క్రొమ్ముడినుండి జాఱి మేనం జిక్కుకొని యున్న

కలునసర విూరసించు వేల్పుసానుల వీక్షణమాలవలెఁ గన్పట్టుచుండె. ఆయాటకత్తె పంతమున నృత్తము సలుపుతఱుణమునఁ బెరిగిన కంఠహారముల వెడలి మేనఁ బర్విన ముత్యములు ముఖచంద్రనిర్గతంబులగు నమృతకణములా యన నుల్లసిల్లె. అలరువిల్తుఁ డావిరి భ్రోడి యాటపాటలఁ గనుఁగొను నవసరంబున గగుర్పుఁజెంద నావాలక మవలోకించి యతనివాల్గంటి యీనడింపున నిట్టూర్చు పుప్పొడినెపంబున నమమఁ దెరను గల్పించె. వేఁగంటి కంటియుబలాటమును వీక్షించి యతనిమచ్చకంటి మచ్చరంబునఁ గేలఁగీలించిన పద్మగుచ్ఛముఁ గదల్చి కొండమతేఁటుల మూలమున నిరులుక్రొన్నెఁ జేసె. ఆకాంతాలలామరూపంబునకుఁ బరవశు లైనమనుజవరులు నయుత మాసమయమునఁ దెలిగంటులై నగడిరి. ఆయొప్పులాఁడి యొయ్యారముంగని మైమఱచిన యాశ్వినేయుల యయ్యాదనున సంఘర్షణం బేర్పడ నం దొకఁ డిట్లు వాక్రుచ్చె.

"ఏమి! యీయొయ్యారియొప్పిదము! కావితాల్పులును గలఁకఁబాఱిన డెందములతోఁగాఁ గనఁబడుచున్నవారు. ఈక్రాలుగంటి నునువాలుఁజూపులఁ దేలియాడఁ జాలినవాఁడె ధన్యతముఁ డనఁదగినవాఁడు కదా. ఈ





లతాంగి తళుకుబెళుకులఁ దిలకించునపుడు, చక్కనయ్యన్న తనదుచక్కఁదనమునెల్ల నోరులెఱుఁగకుండ నీమెయెడ నిల్లడగనుంచెనా యని తోఁచెడి. కయ్యమునమేను విడిచిన యేమహాహాదారుఁ డీముద్దుగుమ్మ ముచ్చటకు మురియుచున్నవాఁడో!"

అనపుడు రెండవ యతఁడు మోమునఁ జిఱునవ్వు చిగురొత్త నిట్లు పలికె.

మగటిమికిఁ దోడవై, మన్నీలకెల్ల మిన్నయై యన్నలమిన్ననా నెన్నఁ దగునూర్వశీమత్తకాశినికి ననుఁగుకాఁడై తనదువిమలయశమున దిగంగనామణులకుఁ గౌశేయసౌఖ్య మొడఁగూర్చుచు నివ్వటిల్లు భూలోకచంద్రుఁడైన పురూరవస్సును మఱచితివి కాఁబోలు. మరుని మఱపించు నాపుడమిఱేని సొబగునకు మరులుకొని నీసొగసులాఁడి వేఁగన్నులసామియెదుట నిత్తఱినిట్టులు నట్టువ సలుపుచున్నను జిత్తమున నా మొకిమీని హత్తించియున్నదనియే తెలియుము. చక్కఁదనమునఁ దన్ను ధిక్కరించినవాఁ డగుటఁ బచ్చవిల్తుఁ డావన్నెకానియెడ మచ్చరుండై తన యుల్లాలియెదుట నతనిపేరెత్తుటకైన నిచ్చపడకుండును. తొలుదొలుత నాఱేని యురపదియమ్ములఁగైకొని మఱల నతనిచేఁజిక్క

నీయొక్క పంచబాణుఁ డనువిఖ్యాతిఁబడసిన యీమరుని
సామర్థ్యంబుఁగన నెంతయు నచ్చెరువయ్యెడి. ఆజాను
బాహుఁడును నొయ్యారములగనియుఁ బంటవలఁతినిబా
హుపీఠమున నుంచి లాలించువాఁడు నగునాభూభృల్ల
లాముని దనచిత్తమున నత్తుకొనియు నీవుపుఁబోఁడి యెట్లు
నృత్య మొనరించుచున్నదో కదా! మనకక్కఱలేని పని
యైనఁగానిమ్ము. ఆరాజచంద్రు నీక్షించుట పుట్టువుఁగ
న్నఫల మనియెంచెద. ఎట్టివారి కట్టిపుణ్యముల ప్రోవుఁ
దిలకించుభాగ్య మబ్బును!"

అశ్వినికొడుకు లిట్లనుకొని మిక్కుటంపుఁ దమ
కమునఁ బురూరవస్సు నవలోకింపఁ గృతనిశ్చయు
లగుచు సురరాజును గొలువుఁ జాలించె. వా రంతటఁ
దమ దొరయొద్ద సెలవుఁగైకొని నేలకుడిగ్గి యొక్క
గడియలో నారాచపుట్టువు రాజధానిం దారసించి వేల్పు
లగుట దావారికులు మిన్నకుండ వేవేగ మారాజు
నంతిపురముఁ జొచ్చిరి. తలయంటుజలకమాడ వాసన
నూనియ మేన నలఁదుకొని యుండు నాభూపాలుఁ
డత్తఱి నమృతంపు వెన్నకలయిక నలరు చుక్కలతే
నిచందమునఁ జెన్నెసలారుచుండె. ముక్తాహారశూన్య
మగు కంఠమువలె భూషణరహితము. లగునతనివీనులు





మిగుల యొప్పిదములై తనరారుచుండె. అలంకారవిర
హితంబయ్యు నతనిదేహ మయ్యెడనున మిగుల గొన
బుమిగిలి యుండె.

అశ్వినీదేవతలపుడా సన్నెకానివన్నెచిన్నెలఁ గన్ను
లారఁగాంచి యపూర్వశ్రీసోయగంబు మనసునకురా నలువ
జాణతనపుఁజెయ్దమును వేనోళ్లఁబొగడిరి. భూమీశుఁ డా
శ్వినేయులఁ గనుగొనినంతనె ససంభ్రమంబుగ నెదు
రొక్కని తోడితెచ్చి యుచితాసనాసీనులఁగావించి కేలు
మోడ్చి యచ్చపుఁడెందమున నాగమకారణం బడుగ వా
రిట్లనిరి. "రాజా ! భూలోకచంద్రుఁడ వనఁదగిన నీలోక
మోహనకరమగు చెలువుఁ దిలకింప నేతెంచితిమి. చతు
ర్ముఖుని జగములఁబుట్టించు చాతుర్యమరుదుగ నీయందె
కంటిమి. నెలచందురు డిందుపఱచు నీవదనామృతాంశుం
గాంచి సొబగుచవిఁగొల్లలి మిక్కిలి తనివిఁ జెందితిమి.
ఇంకఁ జెప్పెడిదేమి!" అనవుడు నాపంటవలంతిరాయఁడు
చిర్నగవుమోమునఁ జెంగలింప గారవంబున వారల
కిట్లనియె.

"పుణ్యాత్ముల రైనమిమ్ములఁ గన్నులార గాంచుట
నాపుట్టువు సఫలమయ్యె. జన్మశతములసలిపిన పున్నెముల
పంటంగాని మీయట్టిమహానుభావులు కొలదివాండ్రున్న

యెడకువచ్చుట పొసఁగదు. అసారసంసారమునఁ దీర్ఘసే
వనము, సాధుసంగతియు, గురుసేవోత్సవంబు ననునవి
యెసారతమములై తనరుచుండు నభ్యంజన మొనరించు
కతమున సేమంపుఁదెలుపగు భవత్సేవావిధినిఁ జక్కఁగఁజే
యఁజాలనైతిఁగదా యని విచారించుచున్నవాఁడ. నా
యెడ నక్కటికమూని యించుక సేపు యాగశాల నలంక
రింపుఁడు. ఇంతలో జలకమాడి యేతెంచి దేవరయాడి
గమొనర్చి ధన్యుండ నయ్యెదఁగాక." అనవుడు భూషణ
భూషితుండగుభూపాలచంద్రు నుపలక్షింప నాసపాదము
వల్లెయని యాదేవర లట్లు కావించిరి.

అవనిపాలుఁ డతిరయంబునఁ దీర్థమాడి భూషణా
లంకృతుఁడై, బ్రహ్మవర్చస్సునఁ బరిమేష్ఠింబోలు పురో
ధశ్శ్రేష్ఠుం బురస్కరించుకొని యాయశ్విను లున్నతావు
నకువిచ్చేసి భక్తిమెయిఁ గైచాఁపులొసఁగ వానాదరం
బునఁ జేనిమోముచందురుఁ దేరిగొనఁ జూచినపుడ తమ
మోముదమ్ములు వాఁడఁబాఱ ననతశిరస్కులై మిన్న
కుండిరి. రాజేంద్రుండు భక్తితాత్పర్యంబుల నాజేజేల కు
పచరించుచుండె. అత్తఱిఁ బురోధసుండు వారియునికిం
గనియబ్బురపడి 'మహాత్ములారా! ఉన్నట్టుండి మీమోము
లువాడుసూపి విన్నఁదనముఁ జెందఁగతమేమి? మాయెడ





దోసమేమేని కల్గెనా యని కొంద ముత్తలపాటునొందెడి."
అనవుడు వారిట్లనిరి. "మావిన్నఁదనమునకు మీనేరమి
కారణం బని యెంచవలదు. మీయెడ దోసంబువీసంబేని
కానరాదు. అన్నింటినొక్కతెప్పపాటునఁ దల్లక్రిందుగఁ
జేయఁగల కాలమహిమంబు స్మృతిపథంబునఁ బర్వ నచ్చె
రుపాటునొందితిమి.

నీరాడఁబోవుతఱి మాకనులఁబడిన యీభూపాల
శేఖరునిరూప మింతలోఁ గాలమువాతఁబడి రూపుమాసె.
దినేంధనవనము సూర్యాగ్ని నెరియుచుండ వెలువడు
కాలధూమంబున రూపచిత్ర మంతకంతకు మాసిపోవు
చుండుట తెల్లము. 'యద్దృశ్యం తన్నశ్య' మను నై
యాయికోక్తికి నిదర్శనంబై స్వప్నగతచిత్రముంబోని
రూపంబుఁగని దర్పమూనుట కవకాశ ముండునె? జరా
భరంబున నందమును, తెగుళ్ళుల నొడలును, కాలమున
నాయువును, డిందుపడుట నెఱిఁగిన యెవ్వాఁడు మిట్టిపడఁ
జూచు? ఒక్కత్రుటిలో నెల్లజగము వేఱువిధముగఁ
జేయఁగల సూక్ష్మాతిసూక్ష్మం బగుకాలమహిమంబు
తలఁపునకువచ్చినంతమాత్రమున శరీరము గగుర్పుఁ
జెందెడి. అన్నన్న! స్నానమొనరించుటకు ముందున్న
చేనిలావణ్య మింతకే కాలసర్పంబు వాతఁబడి వె

న్వెంట నుత్తర క్షణోచితం బగువిధం బేర్పడుట కేమన వచ్చును?

విచారింప, మనుజులవయోరూపంబులు ఘటికాయంత్ర జలధారవలెఁ గ్రమముగఁ గొదవ పడుచునే యుండుట విదితము. దీవియచాయాపర్యాకరణి నొరులెఱుంగఁజాలని యట్లు నివ్వటిలు కాలంబు నేర్పఱుప నేరికింగాని శక్యముకాని కార్యమే యగు. కాలమహిమంబునఁ గాదె వెలుఁగుఱేఁడు వఱువాత బుడుతఁడుగను, మధ్యాహ్నమున వయసుకాఁడుగను, సంజవేళ ముదుసలిగను నగుచున్నవాఁడు? దెసల కొనలకుఁ గడలుకొనియుండు సంద్రము లాకసమంటు నలలతోఁగూడ నడఁగారుచున్నయవి. మింటితెరువరి కడ్డమువచ్చు సిగరముల నొప్పారు కులపర్వతంబులుగూడఁ గూలుచున్నయవి. దిగ్గజంబులతోడఁ బుడమియు గూలఁబడుచున్నయది. ఆలోచింప సర్వంబు నేకాహుతిగఁ గైకొనుచు నెడపక పరుగిడుచున్న కాలమహిమ యిట్టిదని నుడువ నసాధ్యమనియె చెప్ప నగును.”

ఇట్లు పలికి యాయుశ్శ్రీదేవత లవనీశు నానతిఁగొని దివంబున కరిగిరి. పురూరవస్సు దేవవరుల వచనామృతం-





బుఁ గ్రోలి తనపొంకపుఁ గావరముఁ దుదిముట్టవిడిచి తాలిమిమెయి మెలఁగుచుండె.

దూరాలోచనము సేయఁగడఁగితిమేని రూపదర్పమెరికిఁగాని మేలొనఁగూర్పఁ జాలదనియె తోఁచెడి. ఈసొబగులు పుట్టుకలపేరి మబ్బులలోని మెఱుపులఁబోలిన వని తలంపఁజను. ఇంతయేల? తామరసంబు వేకువ మిగుల నలఁతిగనుండి క్రమముగఁ బెరిగి పెద్దమొగ్గయి, పిదప విప్పారిన ఱేకుల నుల్లసిల్లుచుండి కొంతవడి చనుడు వాడ్పాటి యించుక పయిర గాలిసోకినంతనె ఱెక్కలువీడి యా దినంబుననె యడుసునఁబడి మ్రగ్గుచుండుట ప్రత్యక్ష నిదర్శనంబు కదా.

తొల్లి *యయాతిఱేఁడు తలవనితలంపుగఁ దన వయోరూపములు పొల్లగుడు క్షణంబున ముదితనంబు నొందె. సోయగంబున వలఱేనిఁ గ్రేణిసేయు †నలసార్వభౌముఁడు

---

* నహుషునిపుత్రుఁ డగుయయాతిరాజు దేవయానినిఁ బరిణయమయి సుఖముండియు నామె చెలియగు శర్మిష్ఠయెడ బద్ధానురాగుఁ డయ్యె. ఈయవమానమును సహింపనిదై దేవయాని తన తండ్రికెఱింగించె. శుక్రాచార్యుఁడు సక్రోధుఁడై “జరాపీడితుండవు” కమ్మని రాజును శపించె.

(భార. ఆది. 3 ఆ.)

‡ నలసార్వభౌముఁడు జూదమున సర్వస్వమును గోలుపోయి యడవులఁ గ్రుమ్మరుచుండ, కర్కోటకం బనుసర్పము దవాగ్నిపీడిత

త్రుటిలోఁ బిశాచరూపుఁ డయ్యె. *సౌదాసుని సౌరు నిముసమున నీఱగుట నెఱుఁగమా? ఇట్లు ముప్పాలకుమూలమై క్షణక్షణవినాశోన్ముఖం బగు రూపమును నమ్మి విఱ్ఱవీగుట మిక్కిలి యనుచితంబు. కావున క్షణభంగురంబులగు వయోరూపాదులమీఁది యాశ దిగనాడి

మై యారాజును శరణువేడెను. దయాళుఁ డగునతఁడు దాని నగ్నిబాధనుండి తప్పింప నది యతనిఁ గఱచెను. దాని విషసంబంధమున నాతఁడు వెంటనే విరూపుఁ డయ్యె.

(భార. ఆరణ్య. ౨ ఆ.)

* సుదాసునిపుత్త్రుఁ డగువీరసహుఁడు వేటాడఁబోయి శార్దూలరూపమునఁ దిరుగు రాక్షసుల నిరువురఁ గాంచి యం దొకనిని బాణముచేఁ గొట్టెను. అందులకు రెండవయాతఁడు గినిసి 'దీనికి దఁగిన శాస్తి చేయక మాన'నని రాజుతోఁ జెప్పిపోయెను. పదఁపడి కొంతకాలమునకు వీరసహుఁడు వసిష్ఠుని యాజమాన్యమున నొక యజ్ఞముఁ జేయ మొదలిడెను. ఆరక్కసుఁడు పూర్వవైరమును బురస్కరించుకొని యజ్ఞాంతమందు వసిష్ఠరూపముతో వచ్చి 'మాంసాహారమును బెట్టు'మని రాజును గోరెను. అతఁ డందుల కియ్యకొన మరల నారాక్షసుఁడె పాచకరూపమును దాల్చి మనుష్యమాంసమును వండి వసిష్ఠునకుఁ బెట్టెను. ఆముని యది వీరసహుని కృత్రిమమే యని తలఁచి కుపితుఁడై 'ఘోరరూపమును దాల్చి మనుజభక్షకుఁడవు క'మ్మని రాజును శపించెను.

(ఉత్తరరామాయణము. ౭ ఆశ్వా.)





శాశ్వతపదము నొంద యత్నము సలుపు టెల్లరకు శుభప్రదము.

ఇది కౌండిన్యగోత్రపవిత్ర
గొల్లపూడి - శ్రీరామశాస్త్రి ప్రణీతమైన
దర్పదళన మను గ్రంథమున రూపవిచారమను
చతుర్థ పరిచ్ఛేదము.

—(—)—

# దర్పదళనము

శౌర్యవిచారము — పంచమపరిచ్ఛేదము.

---

## శౌర్యవిచారము.

చ. తగిలి మదంబుచే నెదిరిఁ
దన్ను నెఱుంగక దొడ్డవానితోఁ
బగఁగొని పోరుసల్ల నతి
పామరుఁడై చెడుటింతెకాక తా
నెగడి జయింప నేరఁడది
నిక్కము తప్పదు ధాత్రిలోపలన్
దెగి యొకకొండతోఁ దగరు
ఢీకొని తాఁకిన నేమి భాస్కరా?

(మారనకవి)

"శత్రువిదళనంబున వాసికెక్కినవారిలో నేనె యగ్రగణ్యుండను. సేనల నడపుటకుఁ దగినగండఁడు నాకంటె లేఁడు. భుజబలంబున నొక్కట జగంబులఁ జేవలఁతిఁ





గొనుటలో నన్ను మించినవాఁడు గలఁడా?" అని యొడలిలో బలమున్నవారికెల్లర కవమానహేతు వగు నిట్టిఖిట్టిపాటుండుట సాజము. తనబలముఁ దిలకించి మనుజుండేలఁ ద్రుళ్లవలయు? శార్దూలాదిమృగములయెడ బెట్టిదంబగు బీరమగపడుట లేదా? వినయ వివేకాది సద్గుణవిరహితం బగుమగఁటిమిని నార్యులు శౌర్యంబుగఁ దలంపరు.

బాలునిశౌర్యము, మాతృతాడనాదులయం దనుపడుచుండును. ఓపిక లేని ముదివాని వాఁడిమి, ప్రాఁతకాలపు ముచ్చట లుగ్గడించుటయందె వాటపడుచుండును. ఇంకఁబొగరుఁబో తగుయువకునిపరాక్రమ మన్ననో, చంచలతమం బగుమనంబున కధీనమగుటం బ్రాయికంబుగఁ దబ్బిబ్బునకే లోనగుచుండు.

నిన్నటిదినంబున బెట్టిదము లగుపగతురపాళెముల నిశ్శంకముగఁ జెండాడినట్టియాతఁడె నేఁడు పాఱఁబోతగుచున్నవాఁడు. మిక్కుటపుమొక్కలంబున సుళువుగఁ బాకశాసను నంతటివానిఁ బారఁదోలి మించిన *వృత్రాసురుఁడు కాలాంతరంబున జడదారి యింటికోడి

---

* వృత్రునిబాధలఁ బడఁజాలక దేవతలు విష్ణువుతో మొఱఁబెట్టుకొన నాదేవుఁడు వృత్రేంద్రులకుఁ దొలుత స్నేహమును గల్పింపు

యగునాయింద్రునిచేతనె యొంటరిపాటున నీల్గవలసి వచ్చెఁగదా. గడనకత్తెవలెఁ జంచలతమం బగుపరాక్రమ మొక్కచోఁ గొలఁది కాలమైనఁ దిరముగ నుండనేర దని యేర్పడుచున్నది.

కనుసన్నల ముజ్జగంబుల నొక్కట శాసించినట్టి *కార్తవీర్యుని నవలీల నొక నిరాహారికొడుకు నుఱుమాడె. ఇరువదియొక్కమా అప్రతిహతంబుగఁ బుడమినిగాలించి నేలతాల్పుల నేలపాలుగావించిన యా గండ్రగొడ్డలితాల్పునె ‡కౌసల్య గారాబుపట్టి తనచిగురు

డని యానతిచ్చె, సమయమున సాహాయ్య మొనరించెద నని పలికె. విష్ణుని యాజ్ఞాప్రకారము దేవతలు రాయబారమునకై పంపిన మునుల వలనఁ బెక్కువరములఁ గైకొని వృత్రుఁడు ఇంద్రునితో సంధి కంగీకరించె. ఇట్లుండ సమయమునకై నిరీక్షించు నింద్రుఁ డొంటరిపాటున గనఁబడిన వృత్రునిఁజూచి తన వజ్రాయుధముచే ఖండించెను.

(భార. ఉద్యో. ౧ ఆ.)

* కార్తవీర్యుఁడు వేటాడఁబోయి జమదగ్ని హోమధేనువును బలాత్కారముగఁ దన పట్టణమునకుఁ గొంపోయెను. వనమునుండి వచ్చిన పరశురాముఁడు తండ్రివలన నావృత్తాంతమును విని యప్పుడె దాడివెడలి కార్తవీర్యుని వేయిభుజముల ఖండించి హోమధేనువును దీసికొనివచ్చి తండ్రికర్పించెను.

(భార. శాంతి. 3 ఆ.)

‡ వివాహానంతరము దశరథాదులతోఁగూడి రామచంద్రుఁ డయోధ్య కేగుచుండ శివధనుర్భంగమునఁ గుపితుఁ డైనపరశురాముఁ





కేలఁ గీలించిన యంపకోలచే గండడగించెఁగాదా? ఒడలికింతైన నలజడిలేక యువ్వెత్తుగ *వెండికొండఁ బెకలించి వైచిన దశగ్రీవుని నొక్కకొండత్రిమ్మరి తనచంక నిరికించుకొనియె. †నలు సంద్రములు ద్రిప్పి పలుబాములకుఁ బాలుపుచ్చె. అట్టి వాలినె ‡రామచంద్రుఁ

డెదుర్కొనెను. అంత దశరథపుత్త్రుఁడు పరశురాముని కరమున నున్న వైష్ణవధనువును గైకొని యాతని నిర్వీర్యునిగ నొనరించెను.

(రామా. బాల. ౭౫ సర్గము.)

* రావణుఁ డొకప్పుడు పుష్పకవిమానారూఢుఁడై పోవుచు మార్గమధ్యమున నున్న కైలాసమునుజూచి గర్వంబుచే దానిఁ బెకలింప యత్నించె. ఆతని బలోన్నతికాపర్వతము సంచలింప నీశ్వరుఁ డద్దాని నంగుష్ఠమున నొక్కెను. అత్తఱి నతనిచేతులు కొండక్రిందఁ జిక్కుకొన నాతఁడు ఖిన్నుఁడై శివుని వేవిధముల స్తుతించెను. ఆవల దేవదేవుఁడు దయాళుఁడై యారావణుని విడిచి పుచ్చె.

(రామా. ఉత్తర. ౧౬ సర్గ)

•† రావణుఁడు దిగ్విజయము చేయఁదలఁచి తిరుగుచు నొకప్పుడు సముద్రతీరమున సందెవార్చు వాలినిఁజూచి వెనుకనుండి చప్పుడు గాకుండఁ బట్టుకొన యత్నించెను. మహాబలాఢ్యుఁ డగునావాలి దశగ్రీవుని వాలకముఁ దెలిసి దగ్గఱకు రానిచ్చి కదలకుండఁ జంక నిరికించుకొని నాలుగుసముద్రముల జుట్టివచ్చి యావల విడిచి పరిహసించె.

(ఉత్తరరామాయణము. 3 ఆ)

‡ రామలక్ష్మణులు సీతాదేవిని వెదకుచుఁబోయి సుగ్రీవునితో మైత్రిఁ గావించుకొనిరి. ఆవల సుగ్రీవునిప్రార్థన మంగీకరించి

డొక్కబాణమునఁ గూలనేసె. సోఁకుమూఁకల యుక్కడఁగించి సురరాజ్యమును గాఁచిన రామచంద్రుఁడు గూడ నొక్కతఱిఁ *దనశిశువులయెదుట నిల్వఁజాలకపోయెనని వినమా?

చుట్టుమూఁగిన కర్ణాదియోధులు మొగములవ్రేలవైచి నిరాయుధలగు నారీవారముంబోలె నివ్వెఱపడి చూచుచుండఁ ‡రారాజుననుఁగుఁదమ్ముని మేనినెత్తుటి

---

యాతని కపకృతినొనర్చినవాలిని శ్రీరాముఁ డొక్కబాణముచేఁ దెగటార్చెను.

(రామా. కిష్కింధాకాండము)

* సీతాపరిత్యాగానంతరము శ్రీరామచంద్రుఁ డశ్వమేధయాగ మొనరింపఁదలఁచి యాగాశ్వమును భూమిపై వదలెను. శత్రుఘ్నరక్షితమగునాయశ్వము వాల్మీక్యాశ్రమపరిసరములకుఁ బోవునప్పటికి సీతాదేవిపుత్రులు దానిఁగాంచి కట్టివైచిరి. అశ్వమును విడిపించుటకై కుశలవకుమారులతో క్రమముగ శత్రుఘ్నాదు లెదుర్కొని మూర్ఛిల్లిరి. ఈసంగతి నెఱిగివచ్చినరామచంద్రుఁడును వారితో యుద్ధమొనరించి తమ్ములనె యనుసరింపవలసినవాఁ డయ్యె.

(జైమినిభారతము. ౬ ఆ)

‡ భీమసేనుఁడు దుశ్శాసనునితోఁ బోరి తన గదాహతిచే నతనిఁ గూలనేసి కరవాలమున నాతని ఱొమ్ముఁ జీల్చి కర్ణాదివీరులు నివ్వెఱపడిచూచుచుండ నందలి రక్తమును బానముచేసి తన ప్రతిజ్ఞను నెఱవేర్చుకొనెను.

(భార. కర్ణ. ౭ ఆ)





నొక్కపెట్టునఁ గ్రోలిన భీమసేనుఁడే యొకప్పు డొక *కొండచిలువ నోటికిఁ జిక్కి విడిపించుకొనఁజాలక పిఱికిపంద పగిదిఁ బలవింపఁజొచ్చె. అదియుఁగాక, కయ్యముల ముక్కాకలు దీరిన జోదులఁ బెక్కండ్రఁ గట్టి తెచ్చి చెఱఁబెట్టి మాఱులేని మసలు ‡జరాసంధునంతటి వానినే పిడికిటిపోటులఁ బిలుకుమార్చిన యాభీముఁడును †సూతతనయుని వాఁడిములుకులఁ బాఱిపడి తప్పించుకొనఁజాలక బలముఱి తుద కాతండె కని

---

* స్వర్గచ్యుతుఁ డగునహుషుఁడు అగస్త్యునిశాపమున కొండచిలువయై యొకచోటఁ బడియుండెను. ఇట్లుండ భీమసేను డొకప్పుడా మార్గమునఁ బోవుచుఁ దటాలున నాయజగరము నోటికిఁజిక్కి విడిపించుకొనఁజాలకయుండ ధర్మరాజాశ్చర్యపడి ఆసర్పమడిగిన ప్రశ్నలకు జబాబుచెప్పి తమ్ముని విడిపించె.

(భార. ఆరణ్య. ౪ ఆ)

‡ జరాసంధుఁడు లోకము నిడుమలపాలు గావించుచుండఁ గృష్ణభీమార్జునులు బ్రాహ్మణరూపములతోఁ నర్ధరాత్రమున నాతని గృహముఁ జొచ్చి 'మాలో నొకరితో యుద్ధమొనరింపు' మని కోరిరి. అతఁడు భీమసేనునితో మల్లయుద్ధముఁ జేయ నంగీకరించె. ఇరువురకు 13 దినములు ఘోరయుద్ధము జరిగెను. ఆవల భీమసేనుఁడు వాయుభట్టారకునిఁ బ్రార్థించి యధికసత్త్వసంపన్నుఁడై యాతని ముష్టిఘాతములఁ బరిమార్చె.

(భార. సభా. ౧ ఆ)

† కురుక్షేత్రయుద్ధమున భీముఁడు కర్ణునితోఁ బోరుచుఁ దటాలున నతినిరథముపై కుఱికెను. అంత కర్ణుఁడు, నిరాయుధుఁడై

కరించి విడువ, విడివడి బ్రతుకుమందలఁ గంటివనుచుఁ బఱచె. అంపవిద్దెయం దారితేరిన యా *సూర్యతనయుఁడును బాండవమధ్యముని ప్రతాపాగ్నికి శలభంబు గావలసి వచ్చెఁగదా. ఆవివ్వచ్చుండు నొక్కతఱి ‡దోపిడికాండ్ర చేతులఁబడి విడివడఁ జాలక భంగపాటు నొందె నని వినఁబడుచున్నది.

---

యలసియున్న భీమునిఁ గూర్చి నారాచముల నొవ్వఁజేసి చంప నుద్యమించియుఁ దాను కుంతీదేవి కొసఁగినవరమునుఁ దలఁచి యట్లు గావింపక పెక్కువిధముల నవమానపఱచి విడిచిపుచ్చె. (భార. ద్రోణ. ౪ ఆ)

* కర్ణార్జునులు చాలకాలము యుద్ధ మొనరించిరి. ఆపల నర్జునుఁడు కర్ణుఁ డేమిటఁ జావమికి మిగులఁ జింతించి 'అంజలిక' మను బాణమును గాండీవమునఁ గూర్చి యభిమంత్రించి శపథపూర్వకముగ నాతనిపైఁ బ్రయోగించె. అది మంటలుగ్రమ్మ వెలువడి కర్ణుని కంఠము నుదునిమెను. (భార. కర్ణ. ౨ ఆ)

‡ ద్వారకానగరము సముద్రమున మునిఁగిపోవ, అర్జునుఁడు యాదవాంగనలఁ దోడ్కొనివచ్చి యొక్కచో విడియించె. ఒంటరిపాటున నున్న స్త్రీగణంబునుజూచి కిరాతులు కవిసి వివిధధనాపహరణంబుఁ జేయమొదలిడ నర్జునుఁ డుగ్రుడై గాండీవ మెక్కుపెట్టి వారిపై బాణప్రయోగముచేసెను. బోయలా బాణముల లెక్కింపక యర్జునుపైఁబడ మహాస్త్రములు తోపమికి విచారించుచు నెట్లో వారియుద్ధతి నించుకమాన్పి శ్రీకృష్ణుని భార్యలను మాత్రము తోడ్కొని కురుక్షేత్రమునకుఁ జనియె.

(భార - మౌసలపర్వము)





గజకర్ణాగ్రంబు కరణి నత్యంతచపల మగుపౌరుషముకలిమి విచ్చలవిడి దాఁటులు వెట్టుచు నేరికినియెలుకైపడ నేరదు. కనుక నే డబ్బాటుగఁ బాఱుఁబోతులు పోటుబంటు లగుటయు, పోటుమానిసులు పిఱికిపంద లగుటయు జరుగుచుండును. తపోబలమహిమాతిశయమున *కాలయవనుఁడు కావరించి పైఁబడ నుంకింప గట్టుతాల్పు వడివడిపఱుగిడి యొక్క యడవికాఁపునందఁ జేరి యతని పడకయడుగున మడఁగియుండలేదా? ఇంక నొరుల మాటఁ దడవ నేల?

వాఁడిమిపోఁడిమి బీరువడినతఱిఁ దనకెట్టి యాశ్రయమున్నను నిష్ఫలంబె యగుననుట నిక్కువము.

---

* కాలయవనుఁడు నారదునివలన శ్రీకృష్ణుని పరాక్రమాదుల నాకర్ణించి మూఁడుకోట్ల మ్లేచ్ఛవీరులతోఁ గూడఁ బోయి మధురాపురము ముట్టడించె. కృష్ణుఁ డత్తఱి యాదవులనందఱ రహస్యముగ ద్వారకకుఁ బంపి తానుమాత్రము నిరాయుధుఁడై కాలయవనుని సమీపించె. అతఁడు కృష్ణుని గుర్తించి పట్టుకొనఁబోవ వేగముగఁ బఱువులు పాఱి ముచికుందముని నిద్రించు కొండగుహఁ జొచ్చి యతని తలగడ నొదిగియుండె. కాలయవనుఁడు మునినిఁ గృష్ణునిఁగఁ దలఁచి కాలితోఁ దన్నగా నాముని కుపితుఁడై యాతని భస్మముగావించె.

[హరివంశము. ౩ ఆ]

బాణాసురుఁడు‡ మృత్యుంజయుని ప్రాపునొందియు సోఁకుమూఁకలఁగొంగ నుడియడిదమున కెరగాకుండఁ దన్నుఁ గాపాడుకొనఁ గలిగెనా? పుడమితాల్పు లెల్లరును దన ముదలఁ దలఁదాల్చువారై తిరుగుచున్నను † శిశుపాలుఁడు తనశిరమును సిరిమగని నుడివాలునకు నూడిదగఁ బెట్టవలసివచ్చెఁగదా. ఇట్లు తొల్లింటి గడుసరులు

---

‡ ఉషామోహితుఁడగు ననిరుద్ధుని బాణాసురుఁడు నాగపాశబద్ధునిగావించె. ఈసంగతి నెఱిఁగి కృష్ణుఁడు బలరామాదులతోఁగూడఁ బోయి బాణుని నెదుర్కొనెను. అపుడు శంకరుఁడు దన కాంతరంగి భక్తుఁడగు బాణునకు సాహాయ్యముఁ జేయఁదలంచి కృష్ణునితో యుద్ధముచేయ మొదలిడెను. అత్తఱి బ్రహ్మ సాక్షాత్కరించి హరిహరుల కుండు అభేదమును వివరించి రాక్షసులు వధ్యులగుట నెఱుకపఱిచి] రుద్రునిఁ బ్రసన్నునిఁ జేసె. అంతఁ గృష్ణుఁడు సుదర్శనముఁ బ్రయోగించి బాణాసురుని వేయిభుజముల ఖండించెను.

[హరివంశము. ఉ. భా. ౧ ఆ]

† రాజసూయమున ధర్మరాజు భీష్మునియానతిచే లోకోత్తరుఁడైనకృష్ణునకు మొదట నర్ఘ్యమొసఁగెను. దానిఁ గని శిశుపాలుఁడోర్వలేక కృష్ణభీష్ములఁ బెక్కువిధముల దూషింపఁగడఁగె. అంతఁ గృష్ణుఁడు కుపితుండై శిశుపాలుఁ డొనరించిన యపకారముల నుగ్గడించుచుఁ జక్రాయుధముచే నాతనితలను దునుమాడె.

[భార. సభా. ౭ ఆ]





కావరంబుననె యడఁగిరని కనినపుడు పాలసుల మగపాడి యేపాటి దని పొగడనగును?

వెడఁగులయెడఁదలఁ జెడుగుఁదనమె తడపెట్టుచుండును. పలుగాకులు నయగారమునె గారవింతురు. తక్కువవారికి నోటిదురుసు మెండు. అడిగొంటులఁ జేరిన శౌర్యమిట్లు పలుతెఱంగులఁ బఱగుచుండుట తెల్లము. బుద్ధిహీనుని యెడఁగల మగఁటిమి కొఱమాలియుండుట యటుండ మీఁదుమిక్కిలి ప్రాణాపాయమునకుఁ గారణం బగును. శరభమృగము మేఘగర్జన మాలించినంతనె సింగమురవళి యని భ్రమసి, వెక్కసం బగు గంటుమోయి మింటికెగసి కుంటువడి మంటఁ గలియుచున్నయది. మదగజము కరిణీకరస్పర్శసౌఖ్యంబునకుఁ బరవశం బై యావజ్జీవదుఃఖభాజనం బగుబంధనంబున కెర యగుచున్నది.

కోఁడెత్రాఁచువిధమున నెల్లపుడు బుసగొట్టుచు నొరులఁ జక్కాడ మక్కువపడునట్టివాని మగఁటిమి కటికతనమనియె పేర్కొనఁబడును. శరణాగతులఁ గావ ననువుపడునదియె శౌర్యమనియు, అండఁ జేరినవాని యసువులఁ గాపాడఁజాలినవాఁడె పోటుమానిసి యనియుఁ జెప్ప నగును. పరులఁ బోరిగొనఁ బరికించువాఁడు పోటరి

యనుట పొరపాటు. బింకమునఁ బొంకము చెడని బీరమును, దోసమున వీసరవోని మానసంబును, చలమునఁ గలంగని చదువుకలిమియు, శ్రేయస్కరంబులై నెగడు. కొఱగాని కొడుకువలనఁ గులమును, మాత్సర్యంబు పెంపున మంచిగుణమును, కట్టెఁడితనంబునఁ గలిమియుఁ బొలిపోవునట్లు గరువతనమున మగఁటిమి యడఁగుచున్నయది.

రత్నాకరమేఖల యగువసుమతి కొడయఁడై శౌర్యమునకు నిలయ మగుడంభోద్భవుం డనునొక్క రాజశ్రేష్ఠుఁ డుండెను. ఆతఁడు శత్రువీరుల నోడించి నిష్కంటకంబుగ రాజ్యపాలనం బొనరించువాఁ డయ్యు, ఉద్దికాఁ డెద్దడి యైనకతమునఁ గయ్యపుకోర్కి మనమున సందడించి యెడపక యతని నడలఁ జేయక మానినది కాదు. అపజయంబన నెఱుంగని యాధీరుం డతిక్రాంతమర్యాదుఁడై యక్కఱతోఁ గనఁబడినవానిఁ జీరి 'నాతోఁ బోరుసలుపఁజాలిన పోటుమానిసి యెందేని కలఁడా?' అని యడుగుచుండెడివాఁడు. చేతులతీఁట తీవరింపఁ గావరంబునఁ గన్నుగానక యెల్లర నెల్లిదపఱచు నానేలఱేని నొక్కతఱిఁ బొగరుఁబోతుల విఱుఁగుఁబాటు నెమ్మెయి నైన నఱఁపఁజూచు నారదమునీంద్రుఁడు





తారసిల్లి యిట్లనియె. "రాజా! నీకు దీటగుపోటుబంటు ముల్లోకముల గాలించినను గానఁబడఁ డనుట నిజము. అయిన నరనారాయణు లనెడి తపసు లొకవేళ నీతో నాలము సేయ నర్హు లేమో యని నా కొక సందియము. ఆతపసికన్నాకులిపుడు బదరికావనంబున నుగ్రంపుఁ దప మొనరించుచున్నవారు. నీతో వారు కయ్యమున కియ్యకొనిరేని నీమనోరథము సఫల మగును. నాయఱమరయుఁ గొఱవడును."

నావుడు నాయొడయఁడు మొగమున జగడపువేడ్క చిగురొత్త సంతసంబున నుబికినరెట్టలఁ దట్టి తేపకుఁ దిలకించుచు నప్పుడె వెడలెను. తడవులేకయె యతఁడు తపోవనముఁ దారసించి పగటిజోతివలెఁ బరిఢవిల్లు నరనారాయణుల నందుఁ బరికించి, పెద్దకాలమునుండి తద్దయు మనసును నొగులఁ జేయు బవరపుఁదమిని వెలిఁబుచ్చెను. దవ్వులనుండి క్రొవ్వుమైఁ జవ్వకుఁ గాఁ దము చెంతకే తెంచిన రాజుపై నానరుఁడు కేఁగన్నులఁ బఱపి కేరడంబునకు జాడ యగునలఁతినగవు మొగమున మొలకెత్త నిట్లనియె.

"రాజా! నీయట్టి గడుసరికి వాఁడిమగలగు రాచవారితోడి దురము కరము శోభాకరము. యుద్ధమునఁ

గలనైనఁ దలఁపని మాయట్టి జడదారులను బోరునకు రమ్మనుట యవ్వనుజేశ వసంతమాడఁ దలఁచుట యని యెఱుంగవో? ఇంతటనైన వచ్చినత్రోవఁ జెచ్చెర విచ్చేయుము."

ఆజడదారిసింగ మిట్లు వాక్రుచ్చినను నారాజకుంజరుఁడు దనపట్టు విడువఁ డయ్యె. అంతట సిద్ధుఁడు మచ్చరమిచ్చఁ బెచ్చుపెరుగ నతనియుబలాట మడగింప నిశ్చయించి కఱుకుటమ్ముల నోనేసె. కనలుటగ్గినిఁ గ్రేణిసేయు నాయమ్ములెమ్ములఁ గ్రమ్మి యేర్చుచుండ, జగము లడలించిన పొగరుటడవి బూదియగుడు నాపుడమితాల్పు తనకువాటిల్లిన యోటమికి మది వితాకుపడి బిగువు దిగనాడి యాతనినె శరణు వేఁడెను. ఎట్టితటినైన శరణన్నవానిఁ గావఁ గంకణముఁ దాల్చిన యానరుఁ డతని యెడ దయాళుఁడై బాణప్రయోగమును మానెను. అంత నాయెకిమీఁ డేపుతోడ నెడదం బాదుకొనియున్న బవరపువేడ్కయు దూరమగుడు వంచినతల యెత్తకుండ నూరిఁ జేరి యున్నచో టెఱుఁగకుండఁ గాలము గడపుచుండెను.

కనుక నట్టిపేరిమి గలవానికేని కావరము కేరడంబునకె కారణంబగును. ఇనుము తనయెడఁగలిగిన చిలు





ముచేతనె చెడునట్లు శౌర్యవంతుఁడు దనయెడ రక్కొనిన నిక్కుచేతనె తక్కువపాటు నొందెడి. తన గౌరవము పదిలముగ నుండ నెంచిన మానధనుఁడు దర్పమునకు దవ్వులవాఁడు గావలయు. గర్వరహితమగు శౌర్యముతోఁ బఱగుచు 'పరోపకారార్థ మిదం శరీర' మనునుడికి గుఱియైన సజ్జనులె పున్నియంపుఁ జవిఁ గ్రోలి స్రగ్గని కీర్తికాయము ను గాంచఁ గలుగుదురు.

ఇది కౌండిన్యగోత్ర పవిత్ర
గొల్లపూడి శ్రీరామశాస్త్రి ప్రణీతమైన
దర్పదళనమున శౌర్యవిచార మను
పంచమపరిచ్ఛేదము.

—(—)—

# దర్పదళనము.

దానవిచారము - షష్ఠపరిచ్ఛేదము.

—(—)—

దా న వి చా ర ము.

శా. అన్యాయార్జిత మైనవిత్తమునఁ జే
యంబూను దానంబు మూ
ర్ఖన్యాయం బది; దానఁజేసి ఫలపా
కం బేమియుఁ లేదు ; యు
క్తన్యాయార్జిత మించుకంత యయినం
గాలంబు దేశంబు స
మ్మాన్యం బై తగఁ బాత్రయోగమున సా
మ్యం బై ఫలించుం దుదిన్.

(తిక్కన సోమయాజి.)

మత్తగజముచాడ్పున దానశీలుండనై యాచకుల పాలి చింతామణి యనందగిననేనె యశస్కాములలో నగ్రగణ్యుండ నని మిట్టిపడు వానిదానము బూదిఁ జేసిన హోమంబుపగిది నిష్ఫలంబయగు. లోకులమెప్పువడ





యుటకుఁగాని యింద్రుఁడవు నీవు చంద్రుఁడ వీవటంచుఁ జేయు ముఖస్తుతుల కుప్పొంగికాని చివర కాముష్మిక సౌఖ్య మాసించియైన విత్తము నెదఁ జల్లువాఁ డిచ్చిపుచ్చుకొనువర్తకులలోఁ బరిగణింపఁదగినవాఁడు కదా. అట్టివానికి దానాభిమాన మేలకో తెలియకున్నది.

అనాదరంబున సలుపునీగి చవుటఁ బెట్టిన విత్తులే చందమున నిరుపయోగమే యగు. పెరలగౌరవము రూప అఁ జేయునుద్దేశమున నొనరించు దానఫలము వానికిఁ గాక యీతని నెట్లుచెందును? మహావిషువత్సంక్రాంతి లోనగు పర్వములఁగాని, కురుక్షేత్రాది దివ్యస్థలంబులంగాని యాత్మోపకారార్థ మొసఁగు దానముచే నహంభావ మూను టెందులకు?

ఇంతయని నుడువకయు నొరుల కెఱుకపడనీకయుఁ బ్రతిఫలం బించుకేనిఁ జిత్తమున నాసింపకయు నితఁడ తఁడని పక్షపాత మూనకయు నిక్కడక్కడ ననుస్థల నిర్దేశమునకుఁ గడంగకయుఁ గేవల పరార్తిప్రశమనంబె ముఖ్యముగఁ దలఁచి చేయుదాన మిసుమంతయైన నీసు లేనిదై యింపుపెంపెసఁగు.

ఆలుబిడ్డల సౌఖ్యమునకై భోగభాగ్యము లభిలషించి యుత్సాహమునఁ జేయు "లోభదానము" వలనియుప

యోగమేమి? శల్యపరీక్షచే యాచకుల నెంతయుఁ జీకాకు
పెట్టి యొసఁగు "కష్టదానము" వలని ఫలమేమి ? కొం
డంత యాసతో దవ్వులనుండి వచ్చి వాకిటఁ గాచుకొని
యున్న యర్థులఁ దృణీకరించి యక్కఱ లేనివారికిని
బ్రతిమాలి బలవంతముగ నిచ్చు "దగ్ధదానము" వలన
లాభమేమి? తొలుత గంపెడాసఁ జూపి తుదకే గోరం
తయో చేతనిడి పనుపునట్టి "కూటదానము" వలనఁ గా
ని, అర్థిమన మాకసమంటునట్లుపలోపచారము లొ
నర్చి కడపట "శుష్కప్రియంబులు శూన్యహస్తము' లన్న
ట్లు నిస్సారమును నిరుపయోగమును నిష్ఫల్యంబు నగునే
కొంచెమో పండ్లిగిలించుచుఁ జేతనిడు "దంభదానము"
వలనఁగాని యగు ప్రయోజనంబేమి ? రేపుమాపులు కా
ళ్లఱుగఁ ద్రిప్పి పిదపఁ గనికరించియుఁ బాపిమనసు వెను
కాడ నియ్యవలసి వచ్చెనే యని యేడ్చుచు నిచ్చు, "బలా
ద్దానము" వలని యుపయోగమేమి? జీవితంబున దానమ
న నెఱుంగకయుండి, రాజచౌర్యాది విప్లవంబుల నొక్క
టి రానున్న సమయమున 'నళ్లేల పోవలయు' నను తలంపు
నఁ దెగువఁ జేసి యొసఁగు "శల్యదానము" వలని ఫలమే
మి ? అనుభవించుట కక్కఱకు రానిదియు, ఒరుల కిచ్చు
టకు పయోగపడనిదియు, విలుచుటకేని వెలపోవనిదియు





నై యనర్హంబును. అనీప్సితంబును, అసమంజసము
నగు "వంధ్యదానము" వలన లాభమేమి ? అప్పిచ్చుట
కుం బలె నర్థిని బలువిధంబులఁ బరిశోధించుచు, మా
టలపెంపున మాటిమాటికి నానఁగొల్పి మలయఁ జేయు
చుఁ దుద కెట్లో యిచ్చునట్టి "యాచ్యదానము" వలని
ఫలమేమి ? సమాన ప్రతిపత్తి గలవారియెడఁ బక్షపాత
ము వహించి యిచ్చు "రాగద్వేషదానము" వలన నుప
యోగమేమి ? ఆసతో నేగుదెంచిన యాచకుని నప్పుల
కాపునడిగి పుచ్చుకొమ్మని పంపుచుఁ జివర కెట్లో యఱ
కొఱగ నిప్పించునట్టి "కలిదానము" వలన లాభమేమి ?
తనకు మేలుచేయునది కాని, ఒరుల కీడుఁ బాపునది కాని
కాక గ్రుడ్డిగవ్వకేని సరితూఁగని "స్వల్పదానము" చే
నగు ఫలంబేమి ? గ్రహచారము చాలనపుడు తద్దోష
శాంతి కొనరించు "భయదానము" వలన ఫలమేమి ?
పుట్టి బుద్ధెఱిఁగినది మొదలు ముష్టిచెట్టున కన్నగ నుండి,
శరీరము చల్లఁబడి పిలుపుపైఁ బిలుపు వచ్చుచున్నతఱిఁ
బరము తలంపునకు రాఁ జెదిరిన మనసుతోఁ జేయు
"మోహదానము" వలన లాభమేమి ? కాలవశమునఁ
బెనుముప్పునకుఁ జిక్కి గండకత్తెర యైన తరుణమునఁ
దప్పించుకొనఁ జాలక చేయు "బాష్పదానము" వలని

యుపయోగ మేమి? చదువు చెప్పినగురువునకుఁగాని, తనయిల్లు కనిపెట్టుకొని యుండు పురోహితునకుఁ గాని యేమైనఁ బనివడినపుడు పిలిచి యిచ్చు "భృతి దానము" వలనఁ బ్రయోజన మేమి?

పరధన స్పర్శమును గాంక్షింపక, పశ్చాత్తాపమునకవకాశ మిడక, నిష్కామబుద్ధిమెయి న్యాయార్జితంబున నొనరించుదానము సర్వోత్తమ దానమై నెగడు. ఫలాపేక్షనొసఁగిన మేరువైనను దృణకల్పమై పరిణమించు. ఆర్తులదైన్యమపనయించుపొంటె నాదరంబున నిచ్చిన గడ్డిపఱకేని మహామేరు వై యుల్లసిల్లు.

తొల్లి ధర్మహేమాచలుం డైన ధర్మసుతుఁడశ్వమేధమొనరించుచుండ లెక్కకు మిక్కిలిగఁబుడమివేల్పులేగుదెంచి మహారాజభోగ్యంబు లగుభక్ష్యభోజ్యాదుల బంగరు పళ్లెరంబుల నాప్యాయనంబుగ నారగించి, వలసినమణి కనక వస్తువాహనంబులఁ గైకొని సంబరముతోఁ బ్రతిదినం బేగుచుండిరి. ఇట్లుండ నొక్కనాఁ డొక్కముంగిస తనపార్శ్వమొండు పైడిచాయనీనుచుఁ జూపఱు కచ్చెరువాటుఁ గొల్పుచుండ సారంగమునుండి వెలువడి ధర్మజుయాగశాలం జొచ్చి యందలియెంగిలినీళుల మత్స్యముమాడ్కిఁబొర్లసాగె. దానిఁ గనుగొనినంతనె యుల్లము





లు పల్లవింప నచటివా రతిరయంబున నరిగి తమఱేనికా సంగతి నెఱుక పఱచిరి. వసుమతీశుఁడు వారిమాట లాలించి విస్మితుం డై తత్క్షణమె యా ముంగియున్నవలనునకు వచ్చి సస్నేహదృష్టుల నద్దానిఁ దిలకించు నప్పు డది యారాజేంద్రుని మోమువైఖరి నుపలక్షించి యతఁడె తన్నడిగినట్లు వినువారి కబ్బురముదోఁప నచ్చుపుఁబలుకుల నిట్లు పలుకఁ దొడఁగె.

"మహారాజా! నీవిపు డవారిగ నొనరించు నీ విపులదానమున కనుపగుఫలము గానఁబడదు. మిక్కుటంపు సంబారమున నొప్పెసలారు నీదానమునకంటె నేనెఱింగిన సక్తుదానం బెన్నిమడుఁగులేని మే లనఁ దగియున్నది. ఇట్లనవరతంబు వలసినవారికి వలసినట్లు కనకవర్షముఁ గురియుచున్నవాఁడవయ్యు, నీచిత్తవిత్తవృత్తముల పారిశుద్ధ్య మెవ్వాఁ డెఱుఁగనోపు? ఈపుడమిజనుల కోర్కెల నెల్ల నేకకాలమున నెఱవేర్చుట కేని లెక్కఁగొననిది యగు నీసేకరించియున్న పదార్థసంచయము బ్రహ్మాండభవనముం గూడ నిండింపఁజాలిన దనుట నిక్కము. అయిన నార్తత్రాణైకపరత నచ్చుపుడెందమున నొసఁగు తృణమేని మేరుకల్ప మనుట మదిఁ దలం

పుము. భూపతీంద్రా! నేఁ గన్నులారఁ గనిన పరమాద్భుతంబగు నంశ మొండు వాక్రుచ్చెద. సావధానుఁడవు కమ్ము. అద్దానిఁ దలఁచినంతమాత్రమున శరీర మిప్పుడును రోమాంచ కంచుకిత మయ్యెడి.

ధర్మక్షేత్ర మగుకురుక్షేత్రమున నిత్యోపవాసకృశుఁడై శిలోంఛవృత్తిగల యొకభూసురవరుఁడు గలఁడు. ఆగృహమేధి యొకనాఁ డల్పమగు యవధాన్యమునేరి దీసికొనిరా నాతనిధర్మపత్ని యద్దానిఁ జూర్ణముఁ గావించెను. అంత నాభూదేవుఁడు కృతాహ్నికుండై యాసక్తువుఁ దనకుటుంబమునకుఁ బంచియిచ్చి తనపాలిభాగమును దినుట కాయత్తపడుచుండె. ఇంతలో నొకయతిథి తన ముదిమితనమున కాఁకటికడిమి తోడగుడు వంగము లెల్లమిక్కిలి కుదియఁ బడుచుండ మెల్లమెల్లన నేగుదెంచి వాకిట నిలిచెను. ఆగృహస్థుఁ డాయతిథి దుస్థితిఁ గనినంతనె సంభ్రమంబున నెదుర్కొని పర్ణశాలాభ్యంతరంబునకుఁ దోడితెచ్చి యుచితోపచారము లొనర్చి స్వచ్ఛహృదయమున శ్రద్ధామృతయుతం బగునిజభోజనం బాతని కొసంగెను. అతిథి యాసక్తువును గ్రోలియుఁ దృప్తి పడకుండుట నెఱింగి యాపాఱుఁడు డోలాయమానమానసుఁ





డై యుండుతఱి నతనియర్ధాంగి తదింగితం బారసి యత్యంతాదరంబునఁ దనపాలిసక్తువు నాపుడమివేలుపున కర్పించె. ఆతఁ డద్దానిఁగూడఁ బ్రియమున మెసవియుఁ దృప్తి నొందఁజాలఁ డయ్యె. అపు డావిప్రసుతుఁడు తనతండ్రి సంతుష్టాంతరంగుఁ డగుచుండఁ దనభాగమును సయిత మాయతిథికీయ నతఁ డమందానందమున దాని నారగించి నిజేచ్ఛం జనియె. ఆభూమిసురుఁడు నిట్టుపాసంబున నతిశ్రాంతుఁడయ్యు మనమున విచార మించైనలేక సంతసంబున నారేయి గడపెను.

ఆఁకటిబాధ కోర్వఁ జాలక తల్లడపడుచున్న నేనాయతిథి చనినపదంపడి యల్లనల్లన సక్తుగంధమునుబట్టి యాచోటికరిగి యచటనున్న యెంగిలి దొన్నియఁ దారసిల్లి యుచ్ఛిష్టజల మున్నచోటఁ గూరుచుండినంతమాత్రమున "ఇదే చూడుమా!" ఈప్రక్క హేమకాంతి విలసితమై యలరె. నాఁటఁగోలె వామపార్శ్వము నట్లగుట నభిలషించి తదేకధ్యానమున నాఁకలిదప్పులఁ గూడఁ బరిగణింపక క్రుమ్మరుచున్న నాకుఁ ద్రిప్పుట మాత్రమె మిగిలినదయ్యె. ఏప్రాణియైనఁ గర్మానుసారముగ నాయా సమయముల మనసున నుప్పతిలుకోర్కెయీడేరినఁగదా యూరటఁ జెందనేర్చు.

మహానుభావుఁడ వైనసీ విపు డత్యంతవైభవంబున నశ్వమేధము సలుపుచుండుట నాలించినంతనె పెద్దకాలమునుండి డెందమును బందిగొని నొగులఁజేయు హేమపార్శ్వాభిలాష నన్నెంతయుఁ దీవరింప మహోత్సాహమున నిటకేతెంచి, పుడమిదేవు లారగించి వెడలిన యిచ్చోటుఁ జొచ్చి పసిడికంచములనుండి జారిన యీ యెంగిలిసిత్థులఁ దడవు పొర్లితింగాని నామేనఁబైడిచాయ లేశంబేని కాన్పింపకున్నయది. రాజేంద్రా! ఫలాపేక్షవిడనాఁడి చిత్తశుద్ధిమెయి సలుపు నల్పదానంబునకు నా ప్రీతిపూర్వక వందనశతంబులు. గొప్పకోర్కెలఁగోరి మహాడంబరంబునఁజేయు భూరిదానమునకు నాపదివేల దండములు.

ఇట్లు నుడివి యానకులము వలయుచోటికేగెను. ధర్మపుత్త్రుఁ డాముంగి పలుకు లెడఁద నచ్చొత్తినట్లగుడు బరిపరివిధంబులఁ దలపోసి నిట్టూర్చి యెట్టకేలకు మనస్సమాధాన మొందె.

కావున మానవుఁడు ప్రతిఫలాపేక్షతో భూరత్నసువర్ణాంబరాది విపులదానములఁ గావించియు వదాన్యుఁడనని విఱ్ఱవీఁగుట వెంగిలితనంబె యగు. ఆర్తులఁగావనుద్దేశించి భక్తితాత్పర్యములు పెనఁగొన నొసఁగు నల్ప





దానమేని యనేకజన్మసుకృత పరిపాకమున నేమహాత్మునకో యొకప్పు డరుదుగ లభించుచుండు నని విదితమయ్యెడి.

ఇది కౌండిన్య గోత్రపవిత్ర
గొల్లపూడి శ్రీరామశాస్త్రి ప్రణీతమైన
దర్పదళనమను గ్రంథమున దానవిచారమను
షష్ఠపరిచ్ఛేదము.

---

# దర్పదళనము

తపోవిచారము – సప్తమపరిచ్ఛేదము.

## త పో వి చా ర ము.

సీ. కటిసూత్రములు గొన్ని • గట్టఁగావచ్చును
పుట్టగోఁచులు చాలఁ • బెట్టవచ్చు,
తలలు బోడులుగాఁగ • దగఁ జేయఁగావచ్చు
గంతబొంతలు మీఁదఁ • గప్పవచ్చు,
మేలుగా భస్మంబు • మేనఁ బూయఁగవచ్చు
ధర నింద్రియేచ్ఛ లే • దనఁగవచ్చు,
విపినంబులోపల • విహరింపఁగావచ్చు
నశనంబుపై నాశ • నణఁపవచ్చుఁ,
తే. గాని మీదివ్యపదపద్మ • కలిత భక్తి
ముక్తిమిక్కిలి మదినూని • ముక్తిఁబొంద
నేరఁడెందును డాంబికా • చారపరుఁడు
చిత్కళాధామ శ్రీగురు • సిద్ధరామ!

సత్పురుషు లంతశ్శత్రువుల నణఁచుటకుఁగా నెడపక తపముఁజేయ నుత్సహింతురు. అట్టితపమె కామ





క్రోధాదులకుఁ గారణమయ్యెనేని, ఇల్లువాఁకిలివిడిచి యడవులపాలై యాకలముఁదినుచుఁ బలువెతలఁ బడుటవలని ఫలమేమి? కోపకలుషితమై మోహదూషితం బగుతపము మిగులఁ దీవ్రమయ్యు నెన్నటికిని ప్రశాంతి నొడఁగూర్పఁ జాలదు. మనస్సు నిస్పృహతఁ జెందియున్నప్పటివలె సస్పృహమైనసమయమునను, ప్రశాంతమైనప్పటివలె సక్రోధమైన కాలమునను దపముచే లాభము గాన్పింపదు. అసారసంసారవృక్షమును మొదలంట నున్మూలింపఁగడఁగినతపసులకు సంసారదోహదం బగుతపశ్చరణంబుచే నుపయోగ మేమి? కోపతాపంబునకు బానిసలై యొరులశపియించుటకె సంతతము మదిఁదలంచుచుఁ జిత్తోద్రేకమునఁ గంపించువారెఱతోడ గాటంపుటూర్పులు చెలంగ, సస్వేదమై కాంతిహీనమగు నంగముతో నొప్పు జడదారులకుఁ దపమువలని ఫలము లేకపోవుట యటుండ, మీఁదుమిక్కిలి వారిశాపానలంబున కితరు లింధనములగుట చేకూరెడి.

గౌతమమునికోపాగ్నికి గుఱియైకదా యతనియిల్లాలు పాషాణమయ్యె. త్రిశంకుభూపతి చండాలత్వమొందుటకు వాసిష్ఠులకోపానలంబె కారణంబుగదా! ధర్మపత్నినిఁ గౌగిలించుకొనినంతమాత్రన పాండురాజిహ

మయ్యెఁగాదా? పరీక్షిన్మహారాజు ప్రాణములఁ బాయుట కొకజడదారి కింకయే హేతువనుట లోకప్రసిద్ధము.

ప్రభువుల యూడిగంబున మాలిన్యమొందక స్థలవిద్యావివాదములఁ గలుషితముగాక, డాంబికాదులఁ గలఁకఁబాఱకయుండు వ్రతమె మేలొనఁగూర్పఁజాలిన పుణ్యవ్రతంబై తనరు.

ఆలుబిడ్డల ముచ్చటకు మురియువాఁ డయ్యుఁ బైకి సంగరహితునిమాడ్కి నభినయించుచు, వ్రత మను నెపంబున గ్రామముల వెంటఁ దిరిగి ధనార్జనముఁ జేయుచు, కపటంపుటభిమానమున వాటిల్లునిడుమల నప్పటప్పటి కెట్లెట్లో తప్పించుకొనుచు సలుపునట్టి మిథ్యావ్రతము బ్రతుకుఁదెరువున కనువగు వెరవనియుఁ జెప్పఁజనదు. అనురాగభూయిష్ఠమును, అజ్ఞానబంధురమును, అకుంఠిత గర్వకలితమును, అసూయాదోష మిశ్రితమును, అతిశయితమాయామిళితమును, ఆధివ్యాధిసంయుతంబు నగు వ్రతము సంసారచిహ్న మనఁదగియుండును. జడలపెంపు, జింకతోలు, చింపిబొంత, యోగపట్టె మొదలగు వానిచే బిగింపఁబడి వివేకరహిత మై వైరాగ్యము నటించు వ్రతము బహుబంధన మనియె పేర్కొనఁదగినది. సరా





గకాషాయమును దాల్చుటఁజేసి యొదవిన కాలుష్యము గలిగి, సచ్ఛేలవసనపరిత్యాగమున వాటిలిన దిగంబరత్వముతోఁగూడి, లోకరంజన కౌతూహలంబునఁ దీర్చిన బూదిపట్టెలచేఁ బొడిమింగన్న వ్రతము పరిహాసభాజనమై లోకవంచకవ్రత మన నొప్పును. జోగులచెలిమి నెల్లప్పుడుఁ గాంక్షించుచు, స్పర్శభయమున నితరులఁ జూచినంతనె గంతులు వేయుచు, రుదురాక పేరులు మెడను గ్రుంగఁదీయుచుండ, సక్రోధమగు మనసుతో నాచరించు వ్రతమును బాపహేతు వగుభారవ్రతంబుగ వచింపనొప్పు. ఈవింతఁగనుఁడు. అభము శుభ మెఱుంగని పిన్నాతఁడు తపసియగుచున్నవాఁడు. కుటుంబపోషకుఁడై గార్హస్థ్య మాచరింపఁదగిన యువకుఁడు వనవాసము నభిలషించెడి. కాటికిఁ గాళ్లుసాఁచిన మూఁడుకాళ్లముసలి పెండ్లికై పాతరలాడుచున్నవాఁడు. ఉన్నచో పెలుకపడకుండ నుండవలసినమూర్ఖుఁడు ప్రబోద్ధయై యుపన్యాసవేదికల నధిరోహించి ధర్మమర్మముల వాకొనుచున్నవాఁడు. వీనికంటె శోచ్యములై నింద్యము లనఁదగిన యంశము లుండునా?

తపస్సున కావశ్యకము లయిన శమదమాది సద్గుణంబుల నెసఁగునాతఁడు వనమునఁగాని, భవనమునఁ

గాని యుండి మోక్షపద మనాయాసంబుగ నొందఁజా లుదు. ఇఁక శరీరమును శుష్కింపఁజేయుటయన్న వేఱు విషయము.

శ్యామల దేవదారువనశోభిత మై సొగసగు నగవునకు దీటగు సెలయేళ్లబారుల విలసిల్లు మంచు కొండదరిసి పెక్కుకష్టములకు లోనై తొల్లి ముని సముదయంబు లుగ్రంపుఁదప మొనరించుచుండ నొక్కు మ్మడి వేయి వత్సరములు గడచెను. పదఁపడి నొక్కసమ యమున సంసారార్తి ప్రశమనుం డగుచంద్రశేఖరుఁ డం బికతోడ వృషభాధిరూఢుఁడై చదలు తెరువున నచ్చో టికేగుదెంచె. వెన్నెలకు వన్నెఁబెట్టఁగలయా యీశుని మోముఁదామరనుండి వెడలినచిరునగవునం జేసి యా కసము ధవళవసనముఁ దాల్చినపగిదిఁ గన్పట్టుచుండె.

అత్తఱి ననేకకాలముంబట్టి శీతవాతాతపంబుల నవయుచు, శల్యమాత్రావశిష్టులై తపము సల్పుజడదా రులఁగాంచినంతనె జాలిపొడమ, దయారసతరంగితాం తరంగయై జగన్మాత యగునుమాదేవి లోకారాధ్యుఁ డగు శంకరదేవుని సాదరవీక్షణంబులఁ దిలకించి యిట్లు వాక్రుచ్చె:





దేవా! విషయసౌఖ్యముల విడనాడి నీయడుగుఁ దామరల నాశ్రయించి 'అన్యథాశరణం నాస్తి' యనెడి తలంపుతో నుగ్రంపుఁదప మొనరించు కతమున నెండఁ బాఱిన యొడళ్లుగల యీమునుల కిప్పటికిని మోక్ష పద మనుగ్రహింప కుండుటకంటె వింత వేఱు గలదా? కట్టా! సహస్రవర్షము లవిచ్ఛిన్నముగ నొందిన తపః క్లేశమున మేని కండలెల్లఁ దఱుగ నెముకల ప్రోవులై చూపట్టు నీమునుల కింతటనైన నిత్యానందకర మగు నీసన్నిధానభాగ్యము లభింపమికిఁ గారణమేమో నుడువు మా! అవు నవును. క్రొత్తగ వచ్చినవారి నాదరం బునఁ జేరఁదీసి కోరికకుమీఱి నిచ్చుటయు, బహు కాలమునుండి యడుగులకు మడుఁగులిడువారియెడ ననా దరంబు సూపుటయు నిగ్రహానుగ్రహసమర్థులగు నిరం కుశప్రభువుల నైజముకదా."

ఇట్లు నెనరు నెక్కొన గేస్తురా లాడినపలుకులా లించి యాకఱకంఠుఁ డాత్తదంతప్రభలఁ దన యట్టుచా య మఱుఁగుపఱచుచు నల్లన నిట్లనియె.

"దేవి! మునులయెడఁ గనికరించి నీవు నుడివినదంత యు భక్తవత్సలుండ నగునాకెంతయుఁ దగినదే సుమీ. అయిన నీతపసులకు సంసారసాగరము నుత్తరింప నంతరా

యంబులగు కామక్రోధాదు లిప్పటికి నుపశాంతి నొందకున్నయవి. అంతశ్శత్రువుల లోఁగొనుసంత కెవరును గాయశోషకంబు లగు నెన్నినోముల నోఁచియు, సాంద్రాటవులనుండి యెన్నికడగండ్లఁ బడియు, ఎన్నటికిని నిర్వికారపద మొందఁజాల రనియే నమ్ముము. ఈయడవికాఁపుల డెందముల నెలకొనియుండు మోహాతరువు నీమనోదృష్టి కగపడున ట్లిప్పుడే యొనర్చెదఁగాక. కఠినంపు వ్రతముల వీరిదేహము లిట్లు శుష్కించిన వని మనసున జాలినొందితివిగాని వీరియంతరంగముల నాటుకొనియుండు వాసనావశంవదమగు మోహాంధతమసమునఁ బెంపొందుచుండుట నుఁగూర్చి తలపోయనైతివి. భోగాసక్తి లేనివారును, విషయసుఖముల విడనాడినవారును, సర్వసంగవిముఖులు నగువారు మాత్రమే యనాయాస మగుతపముచేనైన మత్పదము నందఁజాలుదురు."

అని పలికి మృత్యుంజయుండు నడగొండంబోలు నిజవాహనమునుండి భూమి కవతరించి నగ్నవ్రతముఁబూని మాఱువేషమున సొగసులగని యై యలరారుచుండె. వేల్పుటెకిమీనిమకుటమున దాపిన తామరకెంపు కెంపుచాయల నుల్లసిల్లు నావేల్పువేల్పు నడుగుఁదమ్ములిలపై లేఁబగడములఁ గ్రేణిసేయున వయ్యె. అట్టితఱి నా





సదాశివుఁడు చలువలతేనిఁ గేలు నెమ్మొగంబున నొప్పుచు, నిద్దపుటద్దములఁ బోనిచెక్కులు గలిగి, పీనాంసుండును నాజానుబాహువును సింహమధ్యుండు నై యనన్యసాధారణం బగులావణ్యసుధాసాగరంబునఁ గ్రుంకులిడిన ట్లచ్చపుఁబటికంపుఁజాయల నీనునంగములం దనరుచు, దిగంబరత్వకారణమునం బలె దశదిశల వెలుఁగున ట్లొనరించె. ఆ శ్రీకంఠుఁడు విలాసార్థముగఁ గేలఁగీలించిన నెమలిపురినుండి వెడలిన నీలంపుఁగాంతుల నావృతం బగునతనికంఠ మంతరంగమున దీపించు కాలకూటానలనిర్గతం బగుధూమరేఖచేఁ గప్పఁబడినరీతిఁ గానఁబడుచుండె. పృథులపక్ష్మలశోభితములై కెందామరలఁ దెగడులోచనంబుల వఱలు నాపరమేశ్వరుని వాలకంబు నుపలక్షింప, దిగంగనల డెందముల వలపుఁగొలుప నుంకించెనో యన వెలయుచుండె. ముల్లోకముల వలపించి వలతేనిఁ దలపించు నామనసిజహరుని సోయగముఁ గాంచినంతనె యతనిపాగకన్న, మున్ను దా మరున కొనరించిన యెగ్గుతలఁపునకురా సిగ్గుజెందెననఁ ద్రుటిలో మాయమయ్యె. జడలమాటున నున్నచందమామను వెదకుటకుఁ బత్త్వేన యిరులగములా యన నొప్పుచు, మూఁపులతోఁ జెలిమిసలుపు కేశపాశమున నాచంద్రశేఖరుఁడు మిక్కిలి తనరారుచుండెను. అయ్యె

దనున లతాకాంతలు చిగురుదోసిళ్ళ శీర్షమున నింపిన యచ్చపు విరులచే సుల్లసిల్లునా మినువాఁక తొల్పు, రూపాంతరంబున మిన్నేటినురుగులఁ గూడినజడలు గలవాఁడనుట తేటపడుచుండె. ఆచంద్రమౌళి నిజరూపమును మఱుఁగుపరుచుటకై తాల్చిన మాఱువేసమున నెంతయు గొనబు మీఱియుండుటఁ గనుంగొన, శిరమున నున్నయమృతకరునిఁ గరముఁ బులిమి మయిపూఁతగనొనర్చెనా యని తోఁచెడి.

సిగ్గరు లగువిద్యాధరాంగనల కనుఁగవ లనివార్యముగఁ దత్కరగతంబు లగుతామరలఁ జాటుచేసికొని యాదిసమౌల వేల్పు నునుమేనఁ గవిసిన వయ్యె. మవ్వపు మానికంపుఁదొడవులఁ దొడిగి వినువీథిఁ గ్రుమ్మరుచున్న తెలిగంటి తెలివల కాలోకమోహనమూర్తినిఁ గనినంతనె చిత్తములు పరవశములై ముందడుగు సాగదయ్యె. సిద్ధకన్యలు కిసలయాంజలులఁ జల్లిననీలోత్పలంబుల నొప్పారు నామహేశ్వరుని దేహమత్తఱి, భువిఁ గలనేత్రసముదయంబెల్ల నందమున లగ్నమయ్యె ననుభ్రాంతినిఁ గలిగించుచుండె. నవమోహనాకారుఁ డగునప్పరమేశ్వరుని సోయగము నాలోకించు నుల్లాసమునఁ నిశ్చలములై తమ కన్నులను వీనులకుఁ దొడవులుగ నొనరించియుండు





నాడుమృగములకును మనసులు వసముఁ దప్పినవయ్యె. ఆవన్నెకాఁడు తపోవనప్రాంతమును దారసిల్ల, సంతతము మోవితావికై పాతరలాడు కొదమతేఁటులఁగూడినపుష్పిత లతలయెడ సయితము గదలిక తలసూపసాగె.

మేనఁ దాల్చినజవ్వనము పగిది నొప్పెసలారునా మనోజ్ఞమూర్తి యల్లనల్లన నాకుఁజవికెలదాపునకుఁ జేరవచ్చుటను గనినంతనె నిరాబారియువిదలకు మానసోల్లాసము జనించె. ప్రచ్ఛన్నరూపమున సొగసులదీవియై యలరారు నా పరమశివుఁడు తపోవనపరిసర ప్రదేశముల నొయ్యారముగ విహరించుచుండ, మునికాంతలు కోర్కెపెంపున నిజాభిమానము దూరమగుడు ముగ్ధహరిణుల చందమున తెప్పపాల్పక తమకముతోడ నతనింజూడ సాగిరి. ఇంతలో సవిలాసముగఁ దమచేరువకు విచ్చేసిన యావేసగానిఁ దగినవిధమున గారవింపఁదలఁచి తొట్రుపాటున లేచుతఱి నామునికామినుల మేనులు పొంగి, కాంతివిలసితము లయ్యె. ఆసమయమున నాజడదారి తెలివలదృష్టి, మన్మథాకారుఁ డగునాయీశుని నునుఁజెక్కిళుల ముద్దుఁగొన నాసఁజెందిన వడువునను, లోకమోహనకరుఁ డైనయాశంకరుని యాలింగనసౌఖ్య మనుభవింపఁగోరిన కరణియు నభిలాషాతి

రేకమున నిశ్శంకముగ నతనిపయిం బడెను. ఇట్లు చెడు తలంపులకు లోనై విపరీత చేష్టలకుఁ గడఁగిన యా సీమంతినుల నవలోకించి యచటి కుసుమగుచ్ఛములు, క్రొందమ తేఁటుల రొదలపేర హుంకారములచేతను, అప్పుడ విప్పారిన క్రొవ్విరు లనెడు సపహాసములచేతను, గాలికిఁ గదలంబాఱు కిసలయంబులపేరి కరములచేతను మరలిం చుచున్నవో యనఁ జూపట్టుచుండె. అందముల ప్రో వన నెగడు నావన్నెకానిచేరువ, శీలవసనముఁ బరిత్య జింప సంసిద్ధలై యున్నయాయాతివలఁగాంచి రోసి, దెసలు సయిత మాసమయమున హోమపుధూమరేఖపేరి బొమముడి వైచి బెదరించుచున్నవా యనఁ బరిఢవిల్లె.

అలరువిల్తుఁడేయు నమ్ములఁ గలఁకఁబాఱినరీతి నిట్టూ ర్పుచున్న తమకాంతల మనోవికారమారసి, రోసము తాలిమిం గ్రాసంబుఁగొనఁ గావితాల్పు లపుడు, బొమ ముడిపాటుకతమున భయంకరులై చూపట్టిరి. సంజ కెంజాయ నతకరించు మునులనేత్రము లత్తఱి, బెట్టిదపు టలుకబెబ్బులిచేఁ జీల్పఁబడిన తాలిమిలేడి నెత్తుటం దడిసి నవా యనఁ జెలంగుచుండె. అగ్గలంబగు కినుక మెయి మేనులు చెమర్చి తారలు దిర్దిరం దిరుగుచుండ నొడుఁ గఱచి వలపుపెంపునఁ బొడమిన నీసునై గాటంపుటూ





ర్పులఁబుచ్చు నామును లత్తఱి విటునిచెయ్దములనే యొనర్చిరి.

అందొక జడదారి యంతరంగమున నెరియు కనలు టగ్గినిఁబోలు జింకచర్మమును జంకనిడుకొని దండపాణి యై తత్తరపాటుతో లేచి యాశ్రమోపాంతమునఁ దిరుగు పినాకపాణిని నెదుర్కొనెను. మఱొకతపసి నిజాసనము నుండి త్స్వారహితుండువోలె నిరాలంబతనువై మోహాము నఁ బడి, తాల్మిఁదిగనాడి వేవేగ దర్భాసనముఁ గైకొని యోగట్టువిల్తుపై వైచెను. వేఱొకనిరాహారి యుగ్గలంబగు నడచిపాటున ముద్దగఁ జేయఁబడిన బెట్టిదపుఁ గోపంబు కరణిఁ గన్పట్టు తనకమండలువుఁ జేఁబూని రివ్వున నా తిగప్రోలుదాయపై కుఱికెను. తమకు వాటిలిన బెడఁదను మనసున నిముసమాత్రంబేని నిలుపుకొన నిలుకడలేని తపసులు కరములం దున్నజపమాల లాతపోవనభూమి కయ్యెదనున భ్రూభంగతను గూర్చినవయ్యె. మిక్కుటం పురోసమున నామును లొనరించు నార్భటి కుఱ్ఱూట లూగిన లతాంతములనుండి వెలువడిన శాపాతురంబులం బోలుషట్పదంబు లపుడావనంబునఁ బ్రమోహాసన్ని భంబగు నంధకారమును గల్పించె. కలికంఠకంఠస్థ లము దర్శించినకతంబున విషపూరితలోచనులు పోలె

మోహమూర్ఛమునిఁగిన యామునుల మోముజాబిలులు తత్క్షణమె యీరసంబున కిరవులై యిరుల కిమ్ము లయ్యె.

అంతట నాఋషులు మందహాససుందర వదనారవిందుఁడగు నాశశాంకశేఖరుని శరీరలావణ్యమును దేఱి చూచి, తమయిల్లాండ్ర కొదవిన మనశ్చాంచల్యమును దలపోసి యీర్ష్యాళులై యీరెలుంగున నిట్లు నుడివిరి.

"మహర్షి సేవితమై పరమ పవిత్రమగు గంగానదినిఁ బోలు నీ తాపసీజనమును గలుషితముఁ గావించుపాంసుఁ డేజస్వియయ్యు నిర్గుణుండై నానలేక దిసమొలతో నిటు చను దెంచుచున్నవాఁడు. ఎవఁడీతఁడు? నిజరూపమును మఱుగు పఱచి కావరంబునఁ గన్నుఁగానక యిట్లీమునుల చక్కఁజొచ్చి యకులీనభావముఁ జూపుచుఁ గాపాలికుఁడు పోలె నీతపోవన పవిత్రతకుఁ గొఱఁతఁ గల్పించువాఁడు? ఇస్సిరో! ఇతని పొగరుఁబోతుతనమున కేమన వచ్చును? బలవంతముగఁ బెఱకాంతల కవుగిళుల కువ్విళ్లూరువాఁడై పొంచియున్నాఁడని తోఁచెడి. విచారింప నెవండో యొక కయిలాటకాఁడు వలకాఁక మేరమీఱిన దగుడు మతిహీనుఁడై యిట్టి వేషముఁ దాల్చియెడ లెఱుంగక వనవాసులనె మోసగింప నేతెంచెనని తెల్లమయ్యెడి"





ఇట్లనుచున్న యవసరమునఁ గోప మగ్గలంబగుడు మీఁదెఱుంగక యాతపస్వులాగట్టువిల్తుని దండపాషాణ బృసీశతంబుల ముంచిరి. తెలివిలేమిం గల్గుమనోవైకల్యము ద్వేషపూరితలోచనులైనవారిని నెంతటి ప్రమాదమునకైనఁ బాల్పడఁ జేయుఁగాదా! అంతట నాముక్కంటి యచ్చోటువాసి చనుచుండ నా జడదారిపడఁతులాపొగసుకానిఁ జూచు వేడుకచే నఱమఱ లేక యతని వెన్నంటి పోవసాగిరి. అపుడు కోపానలంబున శరీరము లెరియుచున్నను, వలరాజు నానతినుల్లంఘింపనేరని యామునులు తమభార్యల మరలింప శతవిధంబులఁ బ్రయత్నముఁ జేయ మొదలిడిరి.

పదఁపడి భగవానుఁడగు నాశంకరుఁడు క్రమముగ నాచోటుఁబాసి ప్రశాంతవిమలమగు నభోమార్గమున కెగసి, సాశ్చర్యమందహాసముఖి యగు ప్రేయసినిఁ జూచి హాసభూషితముఖుఁడగుచు 'దేవి! మునిచేష్టితముఁ గన్నులారఁ గాంచితివి కాదా!' అని వెండియు నిట్లనియె.

"అంతశ్శత్రువుల నరికట్టఁజాలనివారికి బోడితలలు జడలు బూడిదెపూఁతలు జింకతోలు దండసూత్రకషుపాల లెన్నియైన మోఁతచేటకాని మోక్షంబు లేదని రూఢిగ

నష్టము. కామక్రోధాదులకు దాసులై యుడుగని విషయవాంఛల మునింగియుండువార లొనరించు వ్రతము లెట్టివియైనను నిష్ఫలంబులే యగు"

నావుడు శర్వాణి మహేశ్వరుని వచనములయందలి తత్త్వమారసి యట్లై యగునని మదిఁ దలంచియు, మునులయందలి కనికరమునం జేసి వారి మనముల నాటుకొని యుండు రాగద్వేషపూరితం బగు మోహమును మొదలంట నణఁచి, వైళంబ సంసారనివృత్తి మార్గము ననుగ్రహింపుమని జగదీశ్వరునిఁ బ్రార్థించెను. గిరిజానాథుఁడును గృపాళుఁడై ప్రేయసిమనోరథంబు బూర్తిఁ గావింప నెంచి యనుగ్రహమయమగు విలోకనంబున నాఋషులఁ దిలకించి వారియంతరంగముల నెలకొని యుండు మోహరజస్సును శాంతింపఁ జేసె.

కనుక నెక్కుడగు యత్నమున సలుపు తపోవిశేషముంగని గర్వ మూనుట తగదు. రాగద్వేషకృత మగు తపంబు నిష్ఫలంబె యగు. కామక్రోధదూర మగుతపంబు మానసిక తాపమును శమజలంబులఁ జల్లార్చి సంతోషామృతంబు నెలకొల్పి సంసారసంబంధమును పద్మజల





సంకాశంబుగాఁ జేయుకతమున నెల్లరకట్టి తపమె హితకరంబై వెలయును.

ఇది కౌండిన్యగోత్రపవిత్ర
గొల్లపూడి - శ్రీరామశాస్త్రి ప్రణీతమైన
దర్పదళన మను గ్రంథమున తపోవిచారమను
**సర్వంబు సప్తమపరిచ్ఛేదము.**

ఆర్యభారతీప్రెస్, 108 పిడారియార్ కోవిలవీథి, మద్రాసు.—1927

## అచ్చగుచున్న గ్రంథములు.

# నాటక జిజ్ఞాస.

1, 2, 3 భాగములు.

ఇందు, హిందూనాటక ప్రాచీనత, నాటక వాఙ్మయమునకు సంబంధించిన దశావిశేషములు, దశవిధరూపకములయు, అష్టాదశ ఉపరూపకములయు, లక్షణోదాహరణములు, నాటక కవితాదర్శము, ప్రాచ్యపాశ్చాత్య నాటకములకు ఉండు నాదర్శభేదములు, ప్రసిద్ధ సంస్కృతనాటక పాత్రౌచిత్యము, మొదలగునవి విపులముగఁ జర్చింపఁబడినవి.

# కావ్యమీమాంస.

కావ్యస్వరూపనిర్వచనము, వివిధమతములు, కావ్యసామగ్రి, తల్లక్షణములు, రసస్వరూపము, తద్భేదములు, భిన్నమతముల సమన్వయము, లోనగు నంశములు చాల విపులముగఁ జర్చింపఁబడినవి. ప్రాచీనాధునిక మత సమన్వయముతో వ్రాయఁబడిన అపూర్వ లక్షణగ్రంథము.

మేనేజర్ — విద్యావినోదినీ గ్రంథమాల,

చిత్తూరు.

## BY THE SAME AUTHOR.

**Andhra Nataka Rangamu (Andhra Stage)**

*Text for B. A. Degree Examination, 1929.*

This book discusses the four kinds of *actions* in a drama and the language pertaining to each; as also many other matters such as the place of music etc. in a play. This valuable work has received the approbation of most of the great pandits of our country. Re. 1—4—0.

**Ahobalamahatmyamu—**

A prose version of the Narasimha Puranam of Erra Pragada one of Mahabharata poets. Replete with devotion and beautiful descriptions. Re. 0—12—0.

**Guruseva— (A Poem)**

This book aims at giving the elementary notions of Hindu religion and duty to parents and teachers. With copious annotations at the end. Re. 0—9—0.

**Satkathamanjari—**

A collection of novel and interesting moral stories from various epics and 'Puranas' written in easy style. Re. 0—10—0.

## IN THE PRESS.

**Nataka Jignasa (In three parts)—**

All topics connected with the drama and its development are dealt with here.

**Kavya Mimamsa—**

Introduction to the study of Telugu Literature.

END OF
TITLE